తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 31.08.2026 | సంపుటి :13 సంచిక : 42 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
జనంసాక్షి tv
JANAMSAKSHI



## నీట్ పీజీ పరీక్ష ప్రశాంతం

- సుమారు 2.73 లక్షలకు పైగా అభ్యర్థులు హాజరు
- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహణ
- రాజస్థాన్‌లోని 2 పరీక్ష కేంద్రాల్లో వాయిదా
- అభ్యర్థుల ఆందోళన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నీట్ పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సుమారు 2.73 లక్షలకు పైగా అభ్యర్థులు వైద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ సంస్థ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. అయితే, రాజస్థాన్‌లోని జైపుర్‌లో 2 పరీక్ష కేంద్రాల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. విద్యుత్ అంతరాయంతో పరీక్షలు సజావుగా జరగలేదని, తిరిగి సెప్టెంబర్ 5న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్

మిగతా 2లో..

## అమెరికాకు వ్యతిరేకంగా గల్ఫ్ దేశాలు

# ఏకంకావాలి



### నిజమైన శత్రువును గుర్తించి వారి ప్రణాళికను భగ్నం చేయాలి

> అమెరికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా గల్ఫ్ దేశాలన్నీ ఏకం కావాలి.ఇస్లామిక్ దేశాల పాలకులకు, ముఖ్యంగా పశ్చిమ ఆసియా గల్ఫ్ దేశాల పాలకులకు నేను పదేపదే గట్టిగా ఇచ్చే సిఫార్సు ఏమిటంటే, మీ నిజమైన శత్రువును గుర్తించి అతని ప్రణాళికను అర్థం చేసుకోండి తిప్పికొట్టండి.ముస్లిం దేశాల మధ్య విభేదాలు కేవలం శత్రువులకే మేలు చేస్తాయి.గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైన్యానికి ఇకపై ఎలాంటి సురక్షిత స్థావరాలు ఉండబోవు.
> - ఖమేనీ

- ముస్లిం దేశాల మధ్య విభేదాలు వారి ప్రత్యర్థులకు మేలు చేస్తాయి
- అమెరికా సైనిక బలగాలకు రక్షణ కవచంగా నిలవకూడదు
- ప్రవక్త ముహమ్మద్ జన్మదినాన్ని పురస్కరించుకుని టెలిగ్రామ్ వేదికగా ఖమేనీ రాతపూర్వక సందేశం
- గల్ఫ్ దేశాలు ,ప్రజలు ఐక్యంగా ఉండి ఉంటే నేడు భూములు, ఆస్తులకు ముప్పు వాటిల్లి ఉండేదా ప్రశ్న
- పాలస్తీనియన్లు ఇంత నిస్సహాయం మిగిలిపోయేవారు కాదని వ్యాఖ్య
- గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైన్యానికి ఇకపై ఎలాంటి సురక్షిత స్థావరాలు ఉండబోవని హెచ్చరిక

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా, ఇజ్రాయెల్‌లను ఉమ్మడి శత్రువుగా గుర్తించి, గల్ఫ్ దేశాలన్నీ ఏకం కావాలని ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లా మొజ్తబా ఖమేనీ పిలుపునిచ్చారు. ఇస్లామిక్ ఐక్యతా వారోత్సవాల సందర్భంగా తన టెలిగ్రామ్ ఖాతాలో ప్రచురించిన ఒక లిఖిత సందేశంలో, ఖమేనీ ముస్లింల ఐక్యతకు, వివిధ రంగాలలో సహకారానికి పరస్పర రక్షణకు పిలుపునిచ్చారు. ఈ వారం ప్రవక్త ముహమ్మద్ జన్మదినాన్ని సూచిస్తుంది."ఇస్లామిక్ దేశాల పాలకులకు, ముఖ్యంగా పశ్చిమ ఆసియా మరియు గల్ఫ్ దేశాల పాలకులకు నేను పదేపదే గట్టిగా ఇచ్చే సిఫార్సు ఏమిటంటే, మీ నిజమైన శత్రువును గుర్తించండి, అతని ప్రణాళికను అర్థం చేసుకోండి దానిని ఎదుర్కోండి," అని రాయిటర్స్ ప్రకారం ఖమేనీ అన్నారు.

మిగతా 2లో..

## మత్తు వీడాలి.. నవసమాజాన్ని

# నిర్మించాలి

### ఈ దిశగా ప్రచారం చేయాలని సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లకు మోదీ పిలుపు

- దేశ యువతుల కలలు భూమిని దాటి అంతరిక్షంలోకి దూసుకుపోతున్నాయ్
- పీఎం స్వనిధి లబ్ధిదారుల్లో 46 శాతం మంది మహిళలే
- దేశ ఆర్థిక వ్యవస్థలో వారి పాత్ర పెరుగుతోంది
- విదేశాల్లోనూ త్రివర్ణపతాకం రెపరెపలాడింది
- 'మన్ కీ బాత్'లో మోదీ వెల్లడి
- డ్రగ్స్ రహిత భారత్ కోసం కృషి చేయాలని ప్రజలకు ప్రధాని పిలుపు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** క్షణికమైన ఆనందాన్నిచ్చే మత్తు పదార్థాలు ఉజ్వల భవితను దెబ్బతీసి వ్యక్తిగత జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతినబూనాలని యువతకు పిలుపునిచ్చారు. ఎటువంటి మత్తు పదార్థాలకైనా బానిసలు కాకుండా దూరంగా ఉండేలా మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో అవగాహన కల్పించాలని కంటెంట్ క్రియేటర్లు, యూట్యూబర్లకు సూచించారు. ఆదివారం మన్‌కీ బాత్ 137వ కార్యక్రమంలో మాట్లాడుతూ..ఈ మేరకు యువతకు దిశానిర్దేశం చేశారు. దేశ యువతుల కలలు భూమిని దాటి అంతరిక్షంలోకి దూసుకుపోతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మిషన్ శక్తిశాట్ ద్వారా

మిగతా 2లో..

## యురేనియం సరఫరా, యూపీఐ చెల్లింపులకు ఒప్పందాలు

- ఉజ్బెకిస్థాన్‌లో భారతీయులకు 30 రోజులు వీసా ఫ్రీ
- ఇరుదేశాల మధ్య భారీ ట్రేడ్ డీల్
- 5 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యం!
- తాష్కెంట్‌లో శాస్త్రి స్మారకానికి మోదీ నివాళి

2లో..

## ప్రముఖ న్యాయకోవిదులను సుప్రీం జడ్జీలుగా నియమించకపోవడం

# విచారకరం

### నియమిస్తే అత్యున్నత ధర్మాసనం వైవిధ్యభరితంగా మారుతుంది

### జస్టిస్ ఉజ్జల్ భూయాన్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రముఖ న్యాయకోవిదులను నియమించాలనే వాదనను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఆదివారం బలపరిచారు. ఇలా చేయడం వల్ల ప్రతిభావంతులతో సుప్రీంకోర్టు ధర్మాసనం వైవిధ్యభరితంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే ప్రముఖ న్యాయకోవిదులు న్యాయ నిర్ణయ ప్రక్రియలో పాలుపంచుకునేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (3) (సీ) ప్రకారం ఇటువంటి నియామకానికి వీలున్నప్పటికీ, గత 76 ఏళ్లలో హైకోర్టు న్యాయమూర్తులు లేదా ప్రాక్టీసింగ్ న్యాయవాదులు తప్ప మరెవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాకపోవడం విచారకరమని అన్నారు. దిల్లీలోని నేషనల్‌లా యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో జస్టిస్ భూయాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా న్యాయకోవిదుడిని (న్యాయశాస్త్ర నిపుణుడు) నియమించడానికి

మిగతా 2లో..






## రైల్వే కనెక్టివిటీ

# ఎంతో కీలకం

- రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు అభివృద్ధి చేస్తున్నాం
- వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** రూ.27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను చేపట్టారు. ఈ అభివృద్ధి పనులను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచనలు చేశారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రూ.27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం క్యాంటీన్, ఎస్కలేటర్, 2 లిఫ్టులు,

మిగతా 2లో..




## అంటరానితనానికి నిదర్శనం..

# శుద్ధి పేరుతో అవమానం

- గతంలో రాష్ట్రపతికి ఆలయ ప్రవేశ నిరాకరణ
- దళితులు పూజ చేసిన రామాలయాన్ని శుద్ధి చేసిన ఘటన
- ఇప్పుడు జాతీయ పార్టీ అధ్యక్షుడు ప్రసంగించిన వేదికకే 'శుద్ధి'
- సామాజిక సమానత్వానికి సవాలుగా మారుతున్న కుల వివక్ష
- విచారణకు ఆదేశించిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా

> అంటరానితనం రూపాలు మారుతున్నాయే తప్ప.. కుల వివక్ష సమాజాన్ని ఇంకా వెంటాడుతూనే ఉందనడానికి ఉత్తరాఖండ్‌లో చోటుచేసుకున్న తాజా ఘటన మరో ఉదాహరణగా నిలిచింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే హల్ద్వానీలోని రామలీలా మైదానంలో బహిరంగ సభలో ప్రసంగించిన అనంతరం అదే ప్రదేశంలో కొందరు వ్యక్తులు 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది.

**న్యూఢిల్లీ (జనంసాక్షి):** ఖర్గే ఆగస్టు 8న హల్ద్వానీలో జరిగిన సభలో ప్రసంగించారు. ఆయన ప్రసంగించిన ప్రాంతాన్ని ఆ తర్వాత 'హవన్'తో శుద్ధి చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ చర్యను ఖర్గే రాజ్యసభలో ప్రస్తావిస్తూ, తనకు అంటరానితనం తాలూకు చేదు అనుభవాన్ని కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఏ కులం లేదా మతాన్ని ప్రస్తావించకుండా ప్రజా సమస్యలనే మాట్లాడానని, అయినప్పటికీ తన ప్రసంగం అనంతరం వేదికను శుద్ధి చేయడం తనను అవమానించడమేనని అన్నారు.

**రూపాలు మారుతున్నా.. వివక్ష అదే**

భారత రాజ్యాంగం సమానత్వాన్ని హామీ ఇచ్చిన దేశంలో ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకప్పుడు రాష్ట్రపతి వంటి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తికి ఆలయ ప్రవేశం నిరాకరించడమో, దళితులు పూజలు చేశారనే కారణంతో ఆలయాన్ని శుద్ధి చేయడమో జరిగిన సందర్భాలు దేశ సామాజిక చరిత్రలో నమోదయ్యాయి. ఇప్పుడు ఏకంగా ఒక జాతీయ రాజకీయ పార్టీ అధ్యక్షుడు ప్రసంగించిన ప్రదేశాన్నే 'అపవిత్రమైందని'

మిగతా 2లో..



# నేపాల్‌లో హైఅలర్ట్!

### మళ్లీ ఉప్పొంగుతున్న భోటే కోషి • పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

- విషాదంలో 788కి పెరిగిన మృతుల సంఖ్య
- మొత్తంగా 2,500 మందికి పైగా గల్లంతు
- రంగంలోకి దిగిన భారత రెస్క్యూ బృందాలు
- భారీ వర్షాల హెచ్చరికతో సహాయక చర్యలకు ఆటంకం
- విద్యుత్ ప్రాజెక్టులకు తీవ్ర నష్టం

**ఖాట్మండు(జనంసాక్షి):** నేపాల్‌లో ప్రకృతి సృష్టించిన విలయం మరింత విషాదాన్ని నింపుతోంది. వరదలు, కొండచరియలు, శిథిలాల కారణంగా మృతుల సంఖ్య ఆదివారం నాటికి 724కు చేరింది. దాదాపు 2,500 మంది ఇంకా గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయి ఉండొచ్చన్న అనుమానంతో సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. అయితే భోటే కోషి నదిలో నీటిమట్టం మళ్లీ పెరుగుతుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది.సహాయక చర్యలు కొనసాగుతున్న వేళ రుసువా జిల్లాలో అద్భుత ఘటన చోటుచేసుకుంది. టిమురే ప్రాంతంలో సాయుధ పోలీసు బలగాలు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తుండగా, శిథిలాల కింద నుంచి చిన్నారి ఏడుపు వినిపించింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది మట్టి, శిథిలాలను తొలగించి ఆరేళ్ల బాలికను సజీవంగా బయటకు తీశారు. దాదాపు మూడు రోజుల పాటు శిథిలాల కింద చిక్కుకున్నప్పటికీ బాలిక ప్రాణాలతో బయటపడింది. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే మెరుగైన వైద్యం కోసం కాఠ్‌మాండూలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో శిథిలాల కింద చిక్కుకున్న మరికొందరు కూడా సజీవంగా ఉండొచ్చన్న ఆశతో సహాయక సిబ్బంది తనిఖీ చేస్తున్నారు.

**గల్లంతైన వారిలో భారతీయులు**

నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో కలిపి వేలాది మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు తెలిపారు. గల్లంతైన వారిలో విదేశీయులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా మానస సరోవర్ యాత్రకు వెళ్లిన భారతీయుల్లో పలువురి సమాచారం తెలియడం లేదు.

**మళ్లీ భోటే కోషిలో వరద ముప్పు**

ఇదిలా ఉండగా, భోటే కోషి నదిలో మరోసారి నీటిమట్టం భారీగా పెరుగుతున్నట్లు నేపాల్ విపత్తు నివారణ సంస్థ ఎన్డీఆంఆర్ఎంఏ హెచ్చరించింది. రసువా జిల్లా అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం నుంచి అందిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఈ హెచ్చరికలు జారీ చేసింది. రసువా,

మిగతా 2లో..

## 'ప్రభుత్వ భూముల ధారాదత్తం ఆపాలి'

### ముఖ్యమంత్రి రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ

**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం ఆపాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు లేఖ రాశారు. హైదరాబాద్‌లోని ఆజామాబాద్‌లో రూ.500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కేవలం రూ.87 కోట్లకే కట్టబెడుతున్నారని ఆరోపించారు. రూ.87 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వ సంస్థ ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నప్పటికీ.. ప్రైవేట్ వ్యక్తులకే ఇస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. రేవంత్ సర్కారు రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయిందని విమర్శించారు.

## అత్యాచారాన్ని అడ్డుకోవడంతో హత్య

- పహాడీషరీఫ్‌లో నర్సు మృతి కేసులో వీడిన మిస్టరీ
- బీహార్ వాసి హత్య చేసినట్లు తేల్చిన పోలీసులు



## రష్యా ఆయిల్ రిఫైనరీపై ఉక్రెయిన్

# డ్రోన్ దాడి

### పనులు తిరిగి ప్రారంభం అవ్వాల్సి ఉండగానే అటాక్

### గతంలో ఇదే కర్మాగారాన్ని కీవ్ తీవ్రంగా దెబ్బతీయడంతో తిరిగి పునరుద్ధరించిన రష్యా

**మాస్కో(జనంసాక్షి):** రష్యాలోని పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. కిరిషి ప్రాంతంలోని ఒక చమురు శుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడి చేయడంతో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. గతంలో ఇదే కర్మాగారాన్ని కీవ్ తీవ్రంగా దెబ్బతీయడంతో మాస్కో తిరిగి పునరుద్ధరించింది. మరికొద్ది రోజుల్లోనే కర్మాగారంలో పనులు తిరిగి ప్రారంభం అవ్వాల్సి ఉండగా ఈ దాడి జరగడం గమనార్హం. రోజుకు 4,00,000 బ్యారెళ్ల

మిగతా 2లో..

## అమెరికాకు వ్యతిరేకంగా గల్ఫ్‌దేశాలు ఏకం కావాలి

ముస్లిం దేశాల మధ్య విభేదాలు కేవలం శత్రువులకే మేలు చేస్తాయని, పశ్చిమ ఆసియా, గల్ఫ్ దేశాల పాలకులు తమ “నిజమైన శత్రువు”ను గుర్తించి వారి కుట్రలను తిప్పికొట్టాలని ఖమేనీ కోరారు. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైన్యానికి ఇకపై ఎలాంటి “సురక్షిత స్థావరాలు” ఉండబోవని, అమెరికా సైనిక బలగాలకు గల్ఫ్ దేశాలు రక్షణ కవచంగా నిలవకూడదని ఇరాన్ హెచ్చరించిందిముస్లిం ప్రపంచం అంతా ‘ఇస్లాం జెండా’ కింద ఒకటిగా ఉండి ఉంటే, ఈరోజు పాలస్తీనా ప్రజలు ఇంత నిస్సహాయ స్థితిలో ఉండేవారా? అని ఆయన ప్రశ్నించారు హోర్ముజ్ జలసంధి సంక్షోభం, అమెరికా విధిస్తున్న ఆర్థిక ఆంక్షలు, ప్రాంతీయ రక్షణ ఒప్పందాల నేపథ్యంలో ఇరాన్ నుండి ఈ పిలుపు రావడం గమనార్హం

## రష్యా ఆయిల్ రిఫైనరీపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

సామర్థ్యం గల ఈ ప్లాంట్ గ్యాసోలిన్, డీజిల్, ఫ్యూయల్ ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తుంది. కిరిషి పెట్రోలియం ఆర్గానిక్ సింథసిస్ కర్మాగారం రష్యాలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో ఒకటి. ఇది దేశ వాయువ్య ప్రాంతంలో ఉన్న ఏకైక రిఫైనరీ. అయితే, ఈ దాడిపై అధికారుల నుంచి ఎలాంటి ధ్రువీకరణ రాలేదు. కానీ డ్రోన్ దాడుల తర్వాత కిరిషి పారిశ్రామిక ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగిందని స్థానిక గవర్నర్ అలెగ్జాండర్ డ్రోజ్డెంకో ఆదివారం వెల్లడించారు. ఈ రిఫైనరీ చుట్టుపక్కల ప్రాంతంలో మొత్తం 62 డ్రోన్‌లను కూల్చివేశారని ఆయన చెప్పారు. ఉక్రెయిన్ ప్రయోగించిన దాదాపు 494 డ్రోన్లను విజయవంతంగా కూల్చేసినట్లు రష్యా ప్రకటించింది. ఈ నెలలో 20కి పైగా రిఫైనరీలపై ఉక్రెయిన్ దాడులు చేసినట్లు వెల్లడించింది. దాడులకు ప్రతిస్పందనగా ఉక్రెయిన్ ఇంధన కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని వార్నింగ్ ఇచ్చింది. ఉక్రెయిన్ ఇంధన మౌలిక సదుపాయాలపై భారీ దాడులు చేయడానికి సిద్ధమవుతున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం వెల్లడించింది. రష్యా పౌర మౌలిక సదుపాయాలు, ఇంధన రంగంపై కీవ్ జరుపుతున్న నిరంతర దాడులకు ప్రతిస్పందనగా ఈ దాడులను చేపట్టనున్నట్లు రష్యా మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. “రష్యా అమెజాన్”గా పిలిచే రిటైలర్‌పై, అలాగే దేశ చమురు, గ్యాస్ రంగంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు జరిపిన నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి.

## అత్యాచారాన్ని అడ్డుకోవడంతో హత్య

హైదరాబాద్(జనంసాక్షి): పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో నర్సు (21) అనుమానాస్పద మృతి కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. నర్సును బిహార్ వాసి హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. సైనా ఉల్లా (35) అనే వ్యక్తి కిటికీ నుంచి నర్సు రూమ్‌లోకి దూకి ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలు నర్సు ప్రతిఘటించగా గొంతు నొక్కి కేకలు వేయకుండా అడ్డుకున్నాడు. దీంతో ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు సైనా ఉల్లా పారిపోతుండగా పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సైనా ఉల్లా ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నట్లు గుర్తించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన నర్సు 7 నెలల క్రితం మహేశ్వరంలో ఉంటున్న తన పిన్ని ఇంటికి వచ్చారు. తుక్కుగూడ ఓ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న స్నేహితురాలు ఆమెను అదే ఆసుపత్రిలో నర్సుగా చేర్చారు. ఆసుపత్రికి చెందిన ఓ రూమ్?లో వీరిద్దరూ గత 7 నెలలుగా ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు శిరీష తన రూమ్?కి వెళ్లి మళ్లీ ఆసుపత్రికి తిరిగిరాలేదు. 2 గంటలకే రావాల్సి ఉన్నా 3 గంటలు అవుతున్నా రూమ్?లో నుంచి బయటకు రాలేదు. డాక్టర్లు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో నర్సు ఉంటున్న రూమ్‌కి ఆసుపత్రి సిబ్బందిని పంపించారు. రూమ్? తలుపునకు లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో కిటికీ సందులోంచి చూశారు. నర్సు నేలపై పడి ఉంది. ఆసుపత్రి సిబ్బంది తలుపు విరగ్గొట్టి లోనికి వెళ్లారు. అప్పటికే నర్సు మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు క్లూస్ టీంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నర్సు నుదుటిపై ఉన్న దెబ్బలపై ఆరా తీశారు. నర్సు ఒంటిపై గాయాలున్నాయని, ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆమె పిన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో బిహార్ వాసి సైనా ఉల్లా హత్య చేసినట్లు తేలింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కుటుంబ సభ్యులు పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

## యురేనియం సరఫరా, యూపీఐ చెల్లింపులకు ఒప్పందాలు

తాష్కెంట్(జనంసాక్షి):మధ్య ఆసియాలో కీలక దేశమైన ఉజ్బెకిస్థాన్‌తో భారత్ తన వ్యూహాత్మక బంధాన్ని మరో స్థాయికి తీసుకెళ్లింది. ప్రధాని నరేంద్ర మోదీ 2 రోజుల ఉజ్బెకిస్థాన్ పర్యటనలో భాగంగా ఆ దేశ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్‌తో ఆదివారం తాష్కెంట్‌లో ఉన్నత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య సంబంధాల్ని ‘సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం’గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఇరువురు నేతలు సంయుక్తంగా ప్రకటించారు. ప్రస్తుతం భారత్–ఉజ్బెకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 1 బిలియన్ డాలర్లుగా ఉండగా, దీనిని 2030 నాటికి ఏకంగా 5 బిలియన్ డాలర్లకు పెంచాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. మైనింగ్, పర్యటకం, సంస్కృతి, విద్య, ఆయుర్వేదం తదితర కీలక రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇరు దేశాలు 11 అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేశాయి. రక్షణ రంగంలో కూడా సహకారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు. ముఖ్యంగా ఇక్కడ ఉజ్బెకిస్థాన్ నుంచి భారత్‌కు దీర్ఘకాలికంగా (లాంగ్ టర్మ్ సప్లై) యురేనియం సరఫరా చేసేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇరు దేశాలు అంగీకరించాయి. డిజిటల్ చెల్లింపుల రంగంలో కూడా భారత్‌కు కీలక పురోగతి లభించింది. ఇక్కడ భారత్‌కు చెందిన ఔఖఅఎ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్, ఉజ్బెకిస్థాన్‌కు చెందిన నేషనల్ ఇంటర్‌బ్యాంక్ ప్రాసెసింగ్ సెంటర్ జేఎస్‌సీ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీని ద్వారా భారతీయ యూపీఐ యాప్స్‌ను ఉపయోగించే వారు ఉజ్బెకిస్థాన్‌లోని జజిఖిఖీ నేషనల్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వ్యాపార చెల్లింపులు చేసే అవకాశం ఏర్పడుతుంది.

ఉగ్రవాద వ్యతిరేక పోరు

చర్చల అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ, ‘మధ్య ఆసియా ప్రాంతంలో భారత్ భాగస్వామ్యానికి ఉజ్బెకిస్థాన్ గుండెకాయ లాంటిది. ఇరు దేశాల రక్షణ పరిశ్రమలు సంయుక్తంగా మిలిటరీ పరికరాలను అభివృద్ధి చేయడం, ఉత్పత్తి చేయడంపై దృష్టి సారిస్తాయి’ అని తెలిపారు.

# అంటరానితనానికి నిదర్శనం.. ‘శుద్ధి’ పేరుతో అవమానం

భావించి శుద్ధి చేయడం కుల వివక్ష ఎంత లోతుగా సామాజిక మనస్తత్వంలో పాతుకుపోయిందనే ప్రశ్నను ముందుకు తెస్తోంది. ఇది కేవలం ఒక రాజకీయ పార్టీకి, ఒక నాయకుడికి సంబంధించిన వివాదంగా చూడాల్సిన అంశం కాదు. మనిషిని మనిషిగా కాకుండా కులం ఆధారంగా అంచనా వేసే మనస్తత్వానికి వ్యతిరేకంగా దేశం ఇప్పటికీ పోరాడాల్సి వస్తోందన్న వాస్తవాన్ని ఇది గుర్తుచేస్తోంది.

**‘శుద్ధి’పై నడ్డా స్పందన**

ఖర్గే ఆరోపణలపై కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్పందిస్తూ ఇలాంటి కార్యక్రమాలను బీజేపీ సమర్థించదని స్పష్టం చేశారు. ఘటనపై విచారణ జరిపి, తప్పు చేసిన వారు ఎవరైనా తగిన చర్యలు తీసుకుంటామని రాజ్యసభలో తెలిపారు. అయితే ఈ ఘటనతో లేవనెత్తిన అసలు ప్రశ్న మాత్రం రాజకీయాలకు అతీతమైనది. అంటరానితనం రాజ్యాంగ విరుద్ధమని తెలిసినా, ‘పవిత్రత?అపవిత్రత’ పేరుతో ఒక మనిషి స్పర్శ, ఉనికి లేదా ప్రసంగించిన ప్రదేశాన్నే శుద్ధి చేయాల్సిన అవసరం ఎక్కడి నుంచి వస్తోంది? అన్నదే.

**మనువాద భావజాలానికి ప్రతిబింబమా?**

కుల ఆధారిత శ్రేణీకరణ, ఉన్నత నిమ్న భావనలు, అంటరానితనం వంటి ఆచారాలు భారత సమాజాన్ని శతాబ్దాలుగా వేధించాయి. వాటిని నిర్మూలించేందుకు రాజ్యాంగం స్పష్టమైన హామీలు ఇచ్చింది. అయినప్పటికీ సామాజిక జీవితంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కావడం ఆందోళన కలిగించే పరిణామం. సామాజిక సమానత్వం, మానవ గౌరవం, రాజ్యాంగ విలువలపై జరుగుతున్న చర్చగా చూడాల్సిన అవసరం ఉంది. పేర్లు, సందర్భాలు, పద్ధతులు మారినా.. మనిషిని కులం ఆధారంగా ‘పవిత్రుడు?అపవిత్రుడు’గా విభజించే ఆలోచన కొనసాగితే అది ఆధునిక భారతదేశానికి సవాలే. అందుకే హల్ద్వానీ ఘటనను కేవలం ఖర్గే వర్సెస్ బీజేపీ రాజకీయ వివాదంగా కాకుండా మెదళ్లలో నాటుకుపోయిన భావాజాలంగా చూడాలి.

## మత్తు వీడాలి.. నవసమాజాన్ని నిర్మించాలి

ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ఆశావహ బాలికలను భారత్ ఏకం చేస్తుండటం గర్వంగా ఉందన్నారు. ఈ చారిత్రక కార్యక్రమం 108 దేశాలకు చెందిన 12,000 మంది విద్యార్థినులకు ఉపగ్రహ సాంకేతికతలో నైపుణ్యం సాధించడానికి, అంతరిక్ష ఆవిష్కరణలలో కొత్త సరిహద్దులను ఆవిష్కరించడానికి అవకాశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం ప్రసారమైన 137వ ‘మన్ కీ బాత్’ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ”దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్ర పెరుగుతోంది. పీఎం స్వనిధి స్కీమ్ లక్షలాది మంది మహిళలకు ఊతమిస్తోంది. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్షలాది మహిళలు నగరాలు, పట్టణాల వీధుల్లో తమ పనులతో బిజీగా ఉంటారు. కొందరు కూరగాయలు, కొందరు పండ్లు అమ్ముతారు. కొందరు టీ స్టాల్స్ నిర్వహిస్తారు. మరికొందరు పువ్వులు, దీపాలు, పూజా సామగ్రి అమ్ముతారు. చాలాసార్లు కొద్దిపాటి పెట్టుబడి కొరత వారి వ్యాపారాన్ని ముందుకు సాగకుండా అడ్డుకుంటుంది. కానీ ఇప్పుడు లక్షలాది మంది తల్లులు, సోదరీమణులు పీఎం స్వనిధి పథకం ద్వారా కొత్త బలాన్ని పొందుతున్నారు. చిన్న, వీధి వ్యాపారులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తీసుకొచ్చిన ‘పీఎం స్వనిధి’ పథకం లబ్ధిదారులలో దాదాపు 46 శాతం మంది మహిళలే ఉన్నారు. అంటే దేశవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ పథకం ద్వారా తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. అందుకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన బబితా శర్మ చక్కని ఉదాహరణ. బబిత గతంలో పూజా సామగ్రిని విక్రయించే ఒక చిన్న స్టాల్‌ను ఏర్పాటు చేశారు. పీఎం స్వనిధి పథకం ద్వారా ఆమెకు ఆర్థిక సహాయం లభించింది.”అని అన్నారు.

**విదేశాల్లోనూ త్రివర్ణపతాకం రెపరెపలాడింది : మోదీ**

దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న దేశభక్తి స్ఫూర్తిని ‘మన్ కీ బాత్’లో మోదీ హైలైట్ చేశారు. హర్‌ఘర్ తిరంగా ప్రచారం విజయవంతమవ్వడంతో ఆగస్టు నెల ప్రత్యేకంగా నిలిచిందని తెలిపారు. “జాతీయ చేనేత దినోత్సవం, క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం కారణంగా ఆగస్టు నెల చాలా ప్రత్యేకంగా మారింది. స్వాతంత్ర్య దినోత్సవం, జాతీయ అంతరిక్ష దినోత్సవం వంటి సందర్భాలు ప్రతి పౌరుడిలో గర్వాన్ని నింపాయి. హర్ ఘర్ తిరంగా ప్రచారం ఈ దేశభక్తి భావనను మరింత బలపరిచింది. అదే సమయంలో వందేమాతరం 150వ వార్షికోత్సవం ఈ సంవత్సరాన్ని మరింత విశేషమైనదిగా చేసింది. ఫిజీలోని సువాలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా ఖండాల్లోని భారత రాయబార కార్యాలయాలు, అమెరికాలో భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడింది” అని మోదీ స్పష్టం చేశారు.

**డ్రగ్స్ రహిత భారత్ కోసం కృషి చేయాలని ప్రజలకు పిలుపు**

అలాగే భారత్‌ను డ్రగ్స్ రహితంగా మార్చాలని నరేంద్ర మోదీ దేశ పౌరులకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం ముప్పు నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి, యువతకు మంచి భవిష్యత్తును నిర్మించడానికి కలిసి పనిచేయాలని ప్రజలను కోరారు. మాదకద్రవ్యాల వ్యసనం పర్యావసానాలు కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా మొత్తం కుటుంబం, సమాజంపై పడతాయని చెప్పారు. వికసిత్ భారత్ కోసం నషా ముక్త్ యువ ప్రచారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఊపందుకుంటోందన్నారు. దేశ యువత ఆరోగ్యం, సంతోషం, ఉజ్వల భవిష్యత్తు కోసం ఇది ప్రజలందరి సమష్టి సంకల్పమని అన్నారు.

”ఈ ఏడాది జరిగిన అమర్‌నాథ్ యాత్రలో పరిశుభ్రత, ప్రజా భాగస్వామ్యానికి సంబంధించిన స్ఫూర్తిదాయకమైన ఉదాహరణలను చూశాం. వేలాది మంది పారిశుధ్య కార్మికులు కఠినమైన మార్గాల్లో రేయింబవళ్లు సేవలు అందించారు. 400 మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలను సేకరించి, వాటిని శుద్ధి చేశారు. యాత్రికులు ఈ శుభ్రతా కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. 16,000 మందికి పైగా పరిశుభ్రత ప్రమాణం చేశారు. పరిశుభ్రత ప్రతి పౌరుడి వ్యక్తిగత నిబద్ధతగా మారినప్పుడు, దాని ప్రభావం పరిసరాలను శుభ్రంగా ఉంచడం వరకే పరిమితం కాదు. అది ఒక ప్రదేశం గుర్తింపు, స్వభావాన్ని పూర్తిగా మార్చివేస్తుంది. అలాగే ముంబయికి చెందిన కృష్ణ శేషాద్రి చిచిచి.ఃఊంఖీయఖీంఏజం.ఊాట వెబ్‌సైట్‌ను రూపొందించారు. మీరు ఈ వెబ్‌సైట్‌కి వెళ్లి ఏదైనా ఒక సంవత్సరాన్ని ఎంచుకోండి. ఆ సమయంలో భారతదేశంలోని ఏ ప్రాంతాన్ని, ఎవరు పాలించారో ఈ వెబ్‌సైట్‌లో సులభంగా తెలుసుకోవచ్చు. ఇది నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది” అని మోదీ పేర్కొన్నారు.

## నీట్ పీజీ పరీక్ష ప్రశాంతం

వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 గంటలకు రీ టెస్ట్ ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. పరీక్షా కేంద్రం, సవరించిన అడ్మిట్ కార్డులతో సహా తదుపరి వివరాలు విడిగా తెలియజేస్తామని ప్రకటించాయి. రీ షెడ్యూల్? చేసిన పరీక్ష కేంద్రాల్లో దాదాపు 300 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. తమిళనాడు, ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్ సహా పలు నగరాల్లోని విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉన్నత వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందడం కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు. సాంకేతిక సమస్యల కారణంగా పరీక్షకు అంతరాయం కలిగిందని ఆరోపిస్తూ, సీతాపురలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. “నేను పరీక్ష రాయడానికి ఇక్కడికి వచ్చాను. పరీక్ష మొదలవ్వకముందే సిస్టమ్ పదేపదే ఆగిపోతూ వచ్చింది. రెండు నిమిషాలు పనిచేసి, ఆ తర్వాత ఆగిపోయింది. ఇలా కనీసం 20 సార్లు జరిగింది. కొద్ది సేపటికి పనిచేస్తుందేమోనని అనుకున్నా. కానీ అది పనిచేయలేదు” అని విష్ణు శర్మ అనే అభ్యర్థి ఆందోళన వ్యక్తం చేశారు. తమ వద్ద భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నప్పుడు, దేశంలోనే అతిపెద్ద పరీక్షల్లో ఒకటైన దీనికి సరైన సదుపాయాలను కల్పించలేరా? అని అభ్యర్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి బాధ్యత వహించడానికి ఎవరూ సిద్ధంగా లేరని, పరీక్షను కేవలం తమ కేంద్రంలోనే మళ్లీ నిర్వహించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని రద్దు చేసి దేశవ్యాప్తంగా మళ్లీ నిర్వహించాలని డిమాండ చేశారు.

విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం’

మరోవైపు, ఈ ఘటనపై పోలీసు అధికారి లలిత్ శర్మ స్పందించారు. “సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడం వల్లే పరీక్ష సజావుగా సాగలేదని తెలుస్తోంది. కొందరి కంప్యూటర్లు పనిచేయగా మరికొందరివి పనిచేయకపోవడంతో పరీక్షకు అంతరాయం కలిగింది. పరీక్ష, నిర్వహణ తీరుపై విద్యార్థులు ఆగ్రహంతో ఉన్నారు. ప్రస్తుతం వారితో చర్చిస్తూ, నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఈ విషయం గురించి పరీక్ష నిర్వహణ సంస్థతో ఉన్నతాధికార స్థాయిలో చర్చలు కూడా జరుగుతున్నాయి” అని తెలిపారు.

## రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకం

దివ్యాంగులకు ఆధునిక వసతులు కల్పించడం జరుగుతుందని వివరించారు. ఈ సంవత్సరం చివరి నాటికి వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందని వెల్లడించారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని, ఆధునికీకరణ పనులు పూర్తైన తరువాత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని స్పష్టం చేశారు. చేవెళ్లలో హైదరాబాద్ బీజాపూర్ రహదారి రోడ్డు పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రోడ్డు పనుల్లో ఆలస్యం ఎందుకు జరుగుతుందని అధికారులను ప్రశ్నించారు. రోడ్డు వంకర టింకర్లు ఉండడంతో భూసేకరణ సమయంలో పరిశీలించలేదా అని అధికారులను ప్రశ్నించారు. రోడ్డు మలుపులు ఎక్కువగా ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా హెచ్చుగా ఉండటంతో ఒకవైపు సర్వీస్ రావడం, మరోవైపు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు.

## నేపాల్‌లో హైఅలర్ట్!

ధాదింగ్, నువాకోట్, చిత్వాన్ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నదీ పరివాహక ప్రాంతాల్లో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరింది. ఇప్పటికే వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో మరోసారి నీటిమట్టం పెరగడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

**భారీ వర్షాలకు హెచ్చరిక**

వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని నేపాల్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రోడ్లు, వంతెనలు దెబ్బతినడంతో కొన్ని ప్రాంతాలకు చేరుకోవడం కష్టంగా మారింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సహాయక సామగ్రిని తరలించడం, శిథిలాల తొలగింపు, గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు నెమ్మదిస్తున్నాయి.

**విద్యుత్ ప్రాజెక్టులకు భారీ నష్టం**

ఈ ప్రకృతి విపత్తు మానవ ప్రాణాలను బలిగొనడంతో పాటు నేపాల్ మౌలిక సదుపాయాలను కూడా తీవ్రంగా దెబ్బతీసింది. ప్రధాన జలవిద్యుత్ ప్రాజెక్టులతో పాటు సౌర విద్యుత్ కేంద్రాలు వరదలు, శిథిలాల ధాటికి దెబ్బతిన్నాయి. నువాకోట్‌లో త్రిశూలి నది ఒడ్డున ఉన్న సౌర విద్యుత్ కేంద్రం పూర్తిగా శిథిలాల కింద కూరుకుపోయింది. ప్రాజెక్టులోని అనేక పరికరాలు ధ్వంసమయ్యాయి. ఒకప్పుడు అక్కడ సౌర విద్యుత్ కేంద్రం ఉండేదనే విషయాన్ని గుర్తించేలా కొన్ని అవశేషాలు మాత్రమే మిగిలాయి.

అమెరికా భారీ మానవతా సాయం

విపత్తు నేపథ్యంలో నేపాల్‌కు అంతర్జాతీయంగా సహాయం అందుతోంది. నేపాల్‌కు 3.6 మిలియన్ డాలర్లకు పైగా విలువైన ప్రాణరక్షక, మానవతా సహాయాన్ని అందిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ సహాయంలో వరద బాధితులైన సుమారు 10 వేల కుటుంబాలకు అత్యవసర ఆహారం అందించే సామగ్రి కూడా ఉందని తెలిపింది. మరోవైపు భారత్ సహా ఇతర దేశాలు కూడా సహాయక చర్యలకు తమవంతు సహకారం అందిస్తున్నాయి. నేపాల్ ఆకస్మిక వరదల ధాటికి మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేపాల్‌లో మృతుల సంఖ్య 788కు చేరిందని నేపాల్ పోలీసులు ఆదివారం తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం, చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 264 మంది మరణించారు.

## ఇది జైలు జాలీ ములాఖాతా.. గురుకుల పాఠశాలనా?

- అనురాగానికి అడ్డుగోడగా ఇనుప గేటు
- రాఖీ పండుగ రోజున లేని ఆత్మీయ స్పర్శ
- ఊచల మధ్య నుంచే రాఖీలు

**రాఖీ.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక. తమ్ముడి చేతికి అక్క రాఖీ కట్టడం.. అన్న చేతికి చెల్లెలు రాఖీ కట్టడం.. కుటుంబమంతా ఒక్కచోట చేరి ఆప్యాయతను పంచుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. కానీ బుద్ధారం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మాత్రం రాఖీ పండుగ రోజు ఆప్యాయతకు ఇనుప గేటే అడ్డుగా నిలిచిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.**




గోపాలపేట, ఆగస్టు 30 (జనంసాక్షి): కుమార్తెలకు రాఖీలు కట్టించేందుకు వచ్చిన తల్లిదండ్రులు, సోదరులు, కుటుంబ సభ్యులను పాఠశాల ఆవరణలోకి అనుమతించకుండా గేటు బయటే నిలిపివేశారని ఆరోపించారు. దీంతో విద్యార్థినులు లోపల.. కుటుంబ సభ్యులు బయట.. మధ్యలో ఇనుప ఊచలు. చివరకు ఆ ఇనుప ఊచల మధ్య నుంచే రాఖీలు కట్టించాల్సిన దుస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు వాపోయారు.

**జైలు ములాఖాత్‌లా..!**

“పిల్లలను చూడటానికి వచ్చామా.. జైలు ములాఖాత్‌కు వచ్చామా?” అంటూ కొందరు తల్లిదండ్రులు ప్రశ్నించారు. బాలికల భద్రత విషయంలో కఠిన నిబంధనలు అవసరమే అయినా, తల్లిదండ్రులు తమ పిల్లలను కొద్దిసేపు ఆత్మీయంగా కలుసుకునే అవకాశం కూడా లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

**రాఖీకి కూడా గేటు అడ్డా?**

పండుగల సమయంలోనైనా ప్రత్యేక ఏర్పాట్లు చేయలేరా? సిబ్బంది పర్యవేక్షణలో తల్లిదండ్రులను విద్యార్థినులతో కలపలేరా? సందర్శకుల నమోదు, గుర్తింపు పరిశీలన, నిర్దిష్ట సమయాలు వంటి భద్రతా చర్యలతో కలయికను నిర్వహించలేరా? అని ప్రశ్నిస్తున్నారు. భద్రత అవసరమే.. కానీ భద్రత పేరుతో మానవీయతను తాళం వేయడం ఎందుకు? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆప్యాయతకు అడ్డుగోడ ఎందుకు?**

తమ పిల్లలను చూడటానికి వచ్చినప్పుడూ గేటు వద్దే నిలబెట్టి విద్యార్థినులతో మాట్లాడిస్తున్నారని కొందరు తల్లిదండ్రులు ఆరోపించారు. పిల్లలకు తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయత అవసరమని.. ముఖ్యంగా పండుగల సందర్భంగా కుటుంబ బంధాలకు విలువనిచ్చే వాతావరణం ఉండాలని కోరారు. తల్లిదండ్రులు?విద్యార్థినుల కోసం ప్రత్యేక సందర్శన ప్రదేశం ఏర్పాటు చేసి, సిబ్బంది పర్యవేక్షణలో కలుసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రిన్సిపాల్ తీరుపై ఆరోపణలు**

ప్రిన్సిపాల్ ఏళ్లుగా ఇదే పాఠశాలలో కొనసాగుతున్నారని కొందరు తల్లిదండ్రులు పేర్కొంటూ, పాఠశాల నిర్వహణపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. తల్లిదండ్రుల సందర్శన విధానం, విద్యార్థినుల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పండుగల సందర్భంగా చేపడుతున్న చర్యలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**చదువులో మంచి ఫలితాలు..**

పాఠశాల విద్యార్థినులు పదో తరగతిలో 600 మార్కులకు 565 మార్కులు సాధించడం అభినందనీయమని తల్లిదండ్రులు పేర్కొన్నారు. విద్యలో మంచి ఫలితాలు సాధిస్తున్న విద్యార్థినులకు అదే స్థాయిలో భద్రతతో పాటు ఆత్మీయత, గౌరవం, మానవీయ వాతావరణం కూడా కల్పించాలని కోరారు.

**రాఖీ రోజున అసలేం జరిగింది?**

తల్లిదండ్రులను ఆవరణలోకి అనుమతించకూడదనే నిబంధన ఉందా? పాఠశాలలో తల్లిదండ్రుల సందర్శనకు నిర్దిష్ట విధానం ఏమిటి? ఆ విధానాన్ని ఎవరు అమలు చేస్తున్నారు? పండుగల సందర్భంగా ప్రత్యేక సందర్శన ఏర్పాట్లు ఎందుకు చేయలేదు? ఈ అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**గేట్లు పిల్లలకు రక్షణగా ఉండాలి.. ప్రేమకు కటకటాలుగా కాదు!**

రాఖీ బంధాన్ని ఇనుప ఊచల మధ్యకు పరిమితం చేసిన పరిస్థితికి బాధ్యులెవరు? భద్రత పేరుతో ఆప్యాయతకు తాళం వేయడం సమంజసమేనా? గురుకులం అంటే కేవలం గోడలు, గేట్లు, నిబంధనలా?లేక పిల్లల భద్రతతో పాటు వారి కుటుంబ బంధాలను గౌరవించే మానవీయ విద్యాలయమా? ఈ ప్రశ్నలకు ఉన్నతాధికారుల సమాధానం కోసం తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

## ప్రముఖ న్యాయకోవిదులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించకపోవడం విచారకరం

మన రాజ్యాంగంలో అవకాశం ఉన్నప్పటికీ, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 ఏళుదాటినా ఇప్పటివరకు అటువంటి నియామకం జరగలేదు. ఒక విశిష్ట న్యాయకోవిదుడు కోర్టుకు గొప్ప విలువను తీసుకురాగలరు. తన పాండిత్యంతో, అత్యున్నత స్థాయిలో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో గణనీయమైన కృషి చేయగలరు. ప్రముఖ న్యాయకోవిదులు, న్యాయ పండితుల భాగస్వామ్యం సుప్రీంకోర్టు పనితీరుపై కీలక ప్రభావాన్ని చూపుతుంది. అత్యున్నత న్యాయస్థానంలో జడ్జీలుగా న్యాయశాస్త్ర నిపుణులు ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. అయితే కేంద్ర ప్రభుత్వం లేదా కొలీజియం ఈ అంశాన్ని ఇప్పటివరకు పరిశీలించలేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపిక కావడానికి అవసరమైన లోతైన పరిజ్ఞానం భారతీయ న్యాయకోవిదులకు లేదని వారు భావిస్తున్నారు. అని అన్నారు

**అదే ఆనవాయితీగా వస్తోంది : జస్టిస్ ఉజ్జల్ భూయాన్**

సాధారణంగా హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి లేదా ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంకోర్టు జడ్జీగా నియమించడం ఆనవాయితీగా వస్తోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో బార్ అసోసియేషన్ నుంచి నేరుగా నియామకాలు జరిగాయని, ఆ నియమకాలు అద్భుతమైన ఫలితాలను ఇచ్చాయని గుర్తు చేసుకున్నారు. అయినప్పటికీ న్యాయకోవిదులు ఎవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ న్యాయకోవిదులు సుప్రీంకోర్టులో భాగమై ఉంటే గణనీయమైన కృషి చేయగలిగే అద్భుతమైన మేధావులు న్యాయ రంగంలో ఉండేవారని అభిప్రాయపడ్డారు.”సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయ నిర్ణయాధికార సంస్థ మాత్రమే కాదు. అది దేశానికి నైతిక, చట్టపరమైన, రాజ్యాంగపరమైన అంతరాత్మ సంరక్షకురాలు. సుప్రీంకోర్టు సాంకేతిక అంశాలకు అతీతమైనది. ప్రతిభావంతులైన న్యాయమూర్తులతో ధర్మాసనాన్ని వైవిధ్యభరితంగా మార్చడానికే విశిష్ట న్యాయవేత్త అనే నిబంధనను ఏర్పాటు చేశారు. ఒక వ్యక్తిని విశిష్ట న్యాయవేత్తగా గుర్తించడానికి, అతను కోర్టు ముందు న్యాయవాద వృత్తిని చేపట్టాల్సిన అవసరం లేదు. లాయర్లు, జడ్జీలను న్యాయకోవిదులుగా వర్గీకరించగలిగినప్పటికీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(3) ప్రకారం ఈ పదాన్ని ఆ రెండు వర్గాలకు మించి విస్తరించాలి. చట్టంలో నైపుణ్యం ఉన్న లేదా చట్ట రంగంలో పరిజ్ఞానం ఉన్న వ్యక్తిని న్యాయకోవిదుడిగా పిలవడానికి అర్హత ఉంటుంది. ఫెడరల్ కోర్టు న్యాయమూర్తిగా నామినేట్ కావడానికి అమెరికా రాజ్యాంగం ప్రకారం కనీసం అధికారిక న్యాయశాస్త్ర డిగ్రీ కూడా అవసరం లేదు. న్యాయ పండితులకు ఆచరణాత్మక అనుభవం కొరవడిందన్న వాదనను అవాస్తవం. అమెరికా, బ్రిటన్, కెనడా, కెన్యా వంటి పలు దేశాల్లో ప్రముఖ న్యాయకోవిదులు రాజ్యాంగ న్యాయస్థానాల జడ్జీలుగా నియమితులవుతున్నారు” అని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు.

యూనివర్సిటీల గురించి కీలక వ్యాఖ్యలు

ప్రశ్నించే, స్వేచ్ఛగా ఆలోచించే సంస్కృతి విద్యార్థులకు విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లోనే ప్రారంభం కావాలని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. విశ్వవిద్యాలయాలు కేవలం ఒక తరం నుంచి మరొక తరానికి జ్ఞానాన్ని అందించేవిగా మాత్రమే ఉండకూడదని అభిప్రాయపడ్డారు. అవి విద్యార్థులకు స్వతంత్రంగా ఆలోచించడానికి, ప్రశ్నించడానికి సహాయపడాలని తెలిపారు. స్వేచ్ఛను, భిన్నత్వాలను నిజంగా గౌరవించే ప్రజాస్వామ్యాన్ని సమాజం కోరుకుంటే దానికి పునాది విశ్వవిద్యాలయాల్లోనే వేయాలని పేర్కొన్నారు.

## సైప్రస్‌లో పడవ ప్రమాదం

### 270 మందితో వెళ్తున్న పడవ బోల్తా

**జనంసాక్షి:** సైప్రస్‌లో పడవ ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తర సైప్రస్‌లోని కైరేనియా నుంచి తుర్కియేలోని టౌచుకు సుమారు 270 మంది ప్రయాణికులతో వెళ్తుండగా బోల్తా పడింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. దాదాపు 159 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగాయి. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని కైరేనియా మేయర్ మురాత్ సెన్‌కుల్ వెల్లడించారు. మరోవైపు, ఈ ఘటనలో భారీ ప్రాణనష్టం జరిగినట్లు స్థానిక మీడియా పేర్కొంది. కోస్టు గార్డుకు చెందిన పడవలు, హెలికాప్టర్లు సహా ప్రయాణికుల పడవలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. బాధితులను ఆసుపత్రులకు చేర్చేందుకు తీరంలో అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు. అయితే, పడవలో కచ్చితంగా ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత లేదు.

# పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అల్లుడి పెత్తనం ఏంటి?

- ఎమ్మెల్యే అల్లుడి ఒత్తిడితోనే హిందూ యువకులపై వేధింపులు
- హనుమకొండ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలి..
- అర్ధరాత్రి అరెస్టులు రాక్షస పాలనకు నిదర్శనం



హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 30 (జనం సాక్షి) : ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ పండుగలను స్వేచ్ఛగా జరుపుకునే రాజ్యాంగ హక్కు ఉందని, అయితే వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో హిందూ పండుగల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు అర్ధరాత్రి వేళ యువకులను అరెస్టు చేయడం దారుణమని బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కంటెస్టెంట్ ఎమ్మెల్యే రావు పద్మ రెడ్డి ఆరోపించారు. తండ్రి దొరకకపోతే కొడుకును, కొడుకు దొరకకపోతే తండ్రిని అరెస్టు చేయడం ఏ రకమైన పాలన అని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్యేను తాము గౌరవిస్తామని, అయితే ఎమ్మెల్యే అల్లుడి పెత్తనం ఏంటని నిలదీశారు. ఎమ్మెల్యే అల్లుడు చెప్పారని హనుమకొండ సీఐ ఒక పక్షానికే కొమ్ముకాస్తూ హిందూ యువకులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అల్లుడికి వత్తాసు పలుకుతున్న సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హిందూ యువకులను అక్రమంగా అరెస్టు చేశారనే సమాచారం తెలుసుకున్న రావు పద్మ రెడ్డి, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్‌తో కలిసి హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐని ప్రశ్నించి పోలీసుల వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. బన్నీ, బంటి, రాహుల్‌ను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి హిందువు హక్కుల కోసం బీజేపీ పోరాడుతుందని రావు పద్మ రెడ్డి స్పష్టం చేశారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునే హక్కును హరించే చర్యలను సహించబోమన్నారు. ప్రశాంతంగా ఉండే వరంగల్ వాతావరణాన్ని దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, నిరంకుశ చర్యలు కొనసాగితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు

# కాసులపైనే దృష్టి.. కోడెలపై నిర్లక్ష్యం

- సామర్థ్యానికి మించి గోశాలలో కోడెలు
- కానరాని నిర్వహణ పర్యవేక్షణ
- పాలు మరువని కోడెలు సమర్పిస్తున్న భక్తులు
- అనారోగ్యంతో పలు కోడెల మృత్యువాత





రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30 (జనంసాక్షి) : దేశంలో ఏ ఆలయంలో లేనివిధంగా దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెలను మొక్కుగా చెల్లిస్తుంటారు. ఏట ఆలయానికి సింహభాగం ఆదాయం భక్తులు సమర్పిస్తున్న కోడె మొక్కుల ద్వారా లభిస్తుంది. ఆలయ అధికారులు మాత్రం కాసులపైనే దృష్టి సారిస్తున్నారు. కోడెల సంరక్షణపై దృష్టి సారించడం లేదన్న అపవాదును మూటగట్టుకుంటున్నారు. గోశాలలో సామర్థ్యానికి మించి కోడేలు ఉండడంతో అక్కడ సరైన వసతులు వాటికి లేకపోవడం ఆలయ అధికారుల పర్యవేక్షణ నిర్లక్ష్య ధోరణి వలన అనేక సందర్భాల్లో కోడెలు మృత్యువాత పడుతున్నాయనే ఆరోపణలువస్తున్నాయి. మూడు రోజుల క్రితం 5 కోడేలు మృత్యువాత పడగా వాటిని గుట్టుచప్పుడు కాకుండ మూలవాగులో పూడ్చివేశారు. ఈ సంఘటనపై వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా గోశాలకు వెళ్లి పరిశీలన చేసి సిబ్బందికి సూచనలు చేయడంతో పాటు సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజన్న ఆలయానికి కట్ట కింద, తిప్పాపూర్ లో ఒక గోశాలలు ఉన్నాయి. కట్టకింద గోశాలలో ఆలయంలో తిరిగే కోడెలు, ఆవులను సంరక్షిస్తున్నారు. తిప్పాపూర్ గోశాలలో భక్తులు సమర్పించిన నిజ కోడెలు, ఆవులు ఉంచుతున్నారు. వీటి సంరక్షణకు ఏటా ఆలయ అధికారులు సుమారు రూ 80 లక్షల వరకు వెచ్చిస్తుంటారు. ఎండుగడ్డి, పచ్చి మేత, తాగునీటి వసతి, ఎండ వేడి తగలకుండా ఫాగర్స్, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ సీజన్ తో సంబంధం లేకుండా కోడెలు మృత్యువాత చెందుతున్నాయి.

### పశువైద్య సిబ్బంది, నిర్వహణ అంత మాత్రమే...

తిప్పాపూర్ గోశాలలో సుమారు 250 కోడెలను ఉంచడానికి సామర్థ్యం ఉంది. అయితే ప్రస్తుతం సుమారు 450 కోడేలు ఆవులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురై ఐదు కోడెల మృత్యువాత చెందాయి. కోడల సంరక్షణ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాల్సిన పూర్తిస్థాయి సిబ్బంది ఇక్కడ లేరు. కోడేల సామర్థ్యానికి తగిన విధంగా కూడ ఆలయ నుంచి సిబ్బంది ఇక్కడ ఉండడం లేదు.

పచ్చిగడ్డి దాన ఎంత మేర ఇస్తున్నారన్నది ఎవరికీ తెలియదు. ఎప్పటికప్పుడు షెడ్లు బయట ఓపెన్ ప్లేస్ శుభ్రం చేయాల్సినప్పటికీ అధికారులు పట్టించుకోక పోవడంతో మురుగు నిలుస్తుంది. దీంతో కోడేలు అనారోగ్యానికి గురవుతున్నాయి.

### రైతులకు కోడెల పంపిణీ..

భక్తులు స్వామి వారికీ సమర్పించిన కోడెలను. తెలంగాణ గోశాల ఫెడరేషన్ ద్వారా రాష్ట్రంలోని వివిధ గోశాలలకు ఆలయ అధికారులు గతంలో అందజేయాగ పక్కదారి పట్టాయి. అప్పటి నుంచి పంపిణీ నిలిపివేసి నేరుగా రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఇటీవల 2 నెలల నుండి పంపిణీ చేయక పోవడంతో గోశాలలో సామర్థ్యానికి మించి కోడేలు ఉంటున్నాయి. గోశాలకు వస్తున్న కోడెలను నేరుగా అందులో ఉన్న కోడెలు కలపడంతో కూడ అనారోగ్యానికి గురవుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తోడు పలువురు భక్తులు తమ మొక్కుబడి తీరాలన్న ఉద్దేశంతో పాలు మరువని కోడెలు, అనారోగ్యానికి గురైన వాటిని మొక్కుగా చెల్లిస్తున్నారు. భక్తులు సమర్పించిన కోడెలను నేరుగా వాటిలో కలపకుండా క్వారంటైన్ లో ఉంచడం లేదు.

### 40 ఎకరాల్లో ఆధునిక గోశాల..

ప్రస్తుత గోశాల సామర్థ్యం మేరకు లేక పోవడంతో ఆధునిక గోశాల నిర్మాణం చేపట్టాలని విప్ ఆది శ్రీనివాస్ సూచన, ప్రతిపాదనలు చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు 40 ఎకరాల్లో మరిపెల్లి వద్ద ఆధునిక గోశాల నిర్మించేందుకు క్యాబినెట్లో ఆమోదం తీసుకున్నారు. త్వరలోనే గోశాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. గోశాల నిర్మాణం పూర్తయితే కోడెల బాధలు తప్పనున్నాయి.

## పాలు మరవని ఏడాదిలోపు దూడలు మరణిస్తున్నాయి

### జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి



వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులలో కొంతమంది భక్తులు నిజ కోడలు సమర్పిస్తుంటారు. ఆ క్రమంలో మూడు మాసాలు నుండి యాదాదిలోపు దూడ పిల్లలను మొక్కుబడిగా అప్పగిస్తున్నారు. గోశాల సిబ్బంది వాటిని తీసుకోకపోవడంతో వారు ఆలయ పరిసర ప్రాంతాల్లో కట్టి వెళ్లడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని గోశాల తరలిస్తున్నారు. పాలు మరువని ఏడాదిలోపు దూడపిల్లలను సుమారు 100 నుండి 200 కిలోమీటర్ల సుదూర ప్రాంతాల నుండి ఆటోలో వాటిని తరలించడంతో అవి అనారోగ్యానికి గురవుతున్నాయి. ఇప్పటికే గోశాలలో పశువైద్యాధికారులతో వాటికి చికిత్స జరిపిస్తున్నాం. భక్తులు పాలు మరువని దూడలను, జెర్సీ దూడలను తీసుకురావద్దని పలు ఫ్లెక్సీలు ఏర్పడి చేసినప్పటికీ భక్తులలో మార్పు రావడం లేదు.

# గోదావరి పుష్కరాలతో తెలంగాణకు ప్రత్యేకత

- అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ
- నిర్వహణకు ప్రజాభవన్‌లో ప్రత్యేక అధికారి కార్యాలయం ప్రారంభం



హైదరాబాద్ (జనంసాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ, తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు అనేలా దేశం నలుమూలలా తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే విధంగా గోదావరి పుష్కరాల ఏర్పాట్లు వుండాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ అన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం ప్రతిబింబించేలా వసతుల కల్పన వుండాలని మంత్రి సురేఖ అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో వచ్చే ఏడాది జూన్ 26 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లను సమర్థవంతంగా సమన్వయం చేసేందుకు ప్రజాభవన్ లోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన స్పెషల్ ఆఫీసర్ (ప్రత్యేక అధికారి) కార్యాలయాన్ని మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. కార్యాలయంలోని సెక్షన్లను దేవాదాయ శాఖ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. తర్వాత ప్రత్యేకాధికారి కార్యాలయంలోని నూతన కాన్ఫరెన్స్ హాలులో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ఆర్జేసి రామకృష్ణారావు, డిసి కృష్ణ ప్రసాద్, పలువురు దేవాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్ లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# నాగోల్ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఘనంగా బోనాల పండుగ



హైదరాబాద్ (జనంసాక్షి) : శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నాగోల్‌లోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ బోనాల పండుగ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని శ్రీ మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కన్న గౌడ్, మహేందర్ గౌడ్ ఆర్య వైశ్య సంఘం నాయకులు అనిల్ కుమార్ ప్రవీణ్ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మూడు దశాబ్దాల ప్రజాసేవకు అంతర్జాతీయ పట్టాభిషేకం

- పుదుచ్చేరి వేదికపై కేశెట్టి సంతోష్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్
- సేవా స్ఫూర్తికి ప్రపంచస్థాయి గుర్తింపు



తాండూర్, ఆగస్టు 30(జనం సాక్షి) : ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ, గత మూడు దశాబ్దాలుగా నిరంతరాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తాండూరు మండలం కి చెందిన యువకుడు అభినవ కల్చరల్ సోషల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషనల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లైక్ టు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా మేనేజ్మెంట్ సభ్యులు కేశెట్టి సంతోష్ కుమార్ (అభినవ సంతోష్ కుమార్) కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. శనివారం పుదుచ్చేరిలోని కంబన్ కలైయరంగం ఆడిటోరియంలో నిర్వహించిన సామాజిక నాయకులు-దార్శనికుల సమ్మేళనం-2026 కార్యక్రమంలో ఆయనకు సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ డైరెక్టర్, తమిళనాడు మాజీ న్యాయమూర్తి డాక్టర్ కె. వెంకటేశన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.ఆర్. శంపత్, ఐఏఎస్, ప్రపంచ శాంతి సంస్థ, ఐక్యరాజ్యసమితి ప్రతినిధి, ప్రపంచ బౌద్ధ సమాఖ్య అధ్యక్షులు రాయబారి డాక్టర్ పర్విందర్ సింగ్, అంతర్జాతీయ న్యాయవాది డాక్టర్ కావేటి శ్రీనివాసరావు, యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ పి. అమృతవల్లి, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కమిషనర్ డాక్టర్ కె. సుకుమార, చెన్నై మద్రాస్ హైకోర్టు గౌరవ మధ్యవర్తి డాక్టర్ ఎస్. సిద్ధార్థన్ , గౌరవ అతిథులుగా కెనడాకు చెందిన న్యాయవాది కాలిసిస్ టెలెష్, అంతర్జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి చైర్మన్ డాక్టర్ సందీప్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జిల్లా కోర్టు మాజీ సహాయ న్యాయమూర్తి డాక్టర్ హరిదాస్, భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ హిందీ సలహా కమిటీ సభ్యులు, యూనివర్సిటీ డీన్ డాక్టర్ నాగేశ్వరరావు చితిరాల, కర్ణాటక భారతీయ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు, యూనివర్సిటీ సంయుక్త డైరెక్టర్ డాక్టర్ ఎం. రామచంద్ర తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

### ప్రజల కష్టాల్లో అండగా... సేవలో ముందంజ

కేశెట్టి సంతోష్ కుమార్ గత 30 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు వన్ ఇస్ నిర్వహిస్తూ ఇప్పటివరకు 98 సార్లు రక్తదానం చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్, తెలంగాణ గవర్నర్ నరసింహన్ చేతులమీదుగా ఉత్తమ రక్త దాత అవార్డ్ తీసుకున్నారు, పేదలకు సహాయ కార్యక్రమాలు, విద్యార్థులకు ప్రోత్సాహం, పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు, విద్యా సహాయం, వైద్య శిబిరాలు, ఉచిత వైద్య సహాయం, మహిళా సాధికారత, యువతలో సేవా దృక్పథం పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక అవగాహన, ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి, మజ్జిగ, మంచినీటి పంపిణీ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పేదలు, వృద్ధులు, నిరుపేదలకు అన్నదానం, వస్త్రాలు, నిత్యావసర వస్తువులు, అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలోనూ ప్రజలకు అండగా నిలిచి ఆహారం, నిత్యావసర సరుకులు, ఇతర అత్యవసర సహాయాలను అందించారు. 17 సంవత్సరముగా పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి సంవత్సరం హరిత గణపతులు (మక్కా మట్టితో చేసిన మట్టి గణపతులు మొక్కలు ) ఆధ్యాత్మిక సేవతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యం ఇస్తూ అన్నదానం, వైద్య సహాయం, రక్తదానం, విద్యా సహాయం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. డాక్టరేట్‌పై డాక్టర్ కేశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఈ గౌరవం తన ఒక్కరి విజయం కాదని అభినవ సంస్థ సభ్యులు, సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలు, అధికారులు, అనధికారులు, మీడియా మిత్రులు, పాత్రికేయులు, తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అందరి సహకారం, ఆశీస్సుల ఫలితమేనని తెలిపారు. తన సేవా ప్రయాణంలో అడుగడుగునా తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గౌరవం పెరిగిన కొద్దీ బాధ్యత మరింత పెరుగుతుందని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. పుదుచ్చేరి వేదికపై ప్రముఖుల సమక్షంలో గౌరవ డాక్టరేట్ అందుకోవడం కేశెట్టి సంతోష్ కుమార్ మూడు దశాబ్దాల నిస్వార్థ ప్రజాసేవకు లభించిన ప్రతిష్ఠాత్మక గుర్తింపుగా నిలిచింది. సేవే లక్ష్యం... మానవత్వమే మార్గం... ప్రజల ఆశీస్సులే నిజమైన పురస్కారం అని డా. అభినవ సంతోష్ కుమార్ తెలిపారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తుల గడువు పొడిగించాలి

- రాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా



హైదరాబాద్ (జనం సాక్షి) : చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం పొడిగించాలని రాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఓ పక్క ఎస్ఐఆర్‌లో పేర్లు లేకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరగడం, మరోపక్క చేయూత వెబ్‌సైట్‌లో సర్వర్ సమస్యల కారణంగా అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర అర్హులకు చేయూత పెన్షన్ జీవనాధారంగా ఉందన్నారు. సాంకేతిక సమస్యల కారణంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సర్వర్ సమస్యలను పరిష్కరించడంతో పాటు దరఖాస్తుల గడువును మరో 10 రోజుల పాటు పొడిగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని ఎండీ యాకూబ్ పాషా కోరారు.

# కలెక్టరేట్‌లోనే పాలకుల నిర్లక్ష్యం

- తాళం వేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం
- వింత సమాధానం ఇస్తున్న జిల్లా అధికారి వినయ్!




గద్వాల, ఆగస్టు 30(జనం సాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ సముదాయంలో అత్యంత కీలకమైన జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రజలకు అందుబాటులో లేకుండా తాళం వేసి దర్శనమివ్వడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా మారింది. మందుల నాణ్యతను పర్యవేక్షించాల్సిన మరియు నకిలీ మందుల దందాను అరికట్టాల్సిన బాధ్యత గల ప్రభుత్వ కార్యాలయమే ఇలా లాక్‌డౌన్‌లో ఉండటం స్థానికంగా తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ మధ్యకాలంలో కాలం చెల్లిని మందులను రైల్వే ట్రాక్ దగ్గర ముళ్లపదలలో కుప్పలు కుప్పలుగా పోసిన వైనం కూడా తెలిసింది అయిన వాటి పైన ఎలాంటి చర్యలు తీసుకున్నారు ఇంతవరకు బయటికి ప్రకటించకపోవడం అన్యాయం అని, కళ్ళు మూసుకున్న యంత్రాంగం జిల్లా పరిపాలనకు గుండెకాయ లాంటి కలెక్టరేట్ సముదాయంలోనే ఈ రకమైన నిర్లక్ష్యం కొనసాగుతుండటం ప్రభుత్వ పర్యవేక్షణా లోపానికి స్పష్టమైన అద్దం పడుతోంది. పొంతన లేని బుకాయింపులు, కార్యాలయం మూసివేతపై జిల్లా అధికారి వినయ్ వివరణ కోరగా, "మా ఎంప్లాయిస్ అక్కడ పని చేస్తున్నారు" అంటూ సమాధానం ఇవ్వడం హాస్యాస్పదంగా మారింది. బయట నుంచి తాళం వేసి ఉన్న గదిలో సిబ్బంది ఎలా పని చేస్తున్నారనేది ఇప్పుడు ఒక మిస్టరీగా మారింది .గాల్లో దీపమైన ప్రజల ఆరోగ్యం, గ్రామీణ ప్రాంతాల నుండి ఔషధాల నాణ్యత, ధరల దోపిడీ, మెడికల్ షాపుల నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేయడానికి వచ్చే సామాన్య ప్రజలు, లైసెన్సుల కోసం వచ్చే వ్యాపారులు దిక్కుతోచని స్థితిలో వెనుదిరుగుతున్నారు. జీతాలు తీసుకుంటూ విధులకు డుమ్మా కొడుతున్న సిబ్బందిపై, బయట తాళాలు వేసి లోపల పని చేస్తున్నామంటూ కట్టుకథలు చెబుతున్న అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న ఇలాంటి కీలక కార్యాలయంపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కార్యాలయం నిర్దిష్ట సమయాల్లో తెరిచి ఉంచి ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నిర్లక్ష్య వైఖరిపై ఉన్నతాధికారులకు లేదా స్పందన పోర్టల్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసిన లాభం లేకపోయిందని ప్రజలు ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

# కోతుల బెడదకు చెక్.. ఎలుగుబండ్లతో ఎంట్రీ!

- అప్పాజీపల్లిలో గ్రామంలో వినూత్న అవగాహన కార్యక్రమం
- వార్డుల్లో తిరుగుతూ కోతులను తరిమే ప్రయత్నం



కొల్చారం, ఆగస్టు 30 (జనం సాక్షి): కొల్చారం మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో కోతుల బెడద నివారణకు గ్రామ సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని) ఆధ్వర్యంలో వినూత్న ప్రయత్నం చేపట్టారు. కోతుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులకు ఉపశమనం కలిగించేందుకు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఎలుగుబంటి వేషధారణలో ఉన్న వ్యక్తులను ఏర్పాటు చేసి, వార్డుల వారీగా గ్రామంలో తిప్పుతూ కోతులను తరిమే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఎలుగుబంటి వేషధారణలో ఉన్న వ్యక్తులు వీధుల్లో తిరుగుతూ కోతులను గ్రామానికి దూరంగా తరిమేందుకు ప్రయత్నించారు. ఈ వినూత్న కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు కార్యక్రమంలో పాల్గొని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చలం నరసింహులు, వార్డు సభ్యులు సదాల నర్సింలు, కన్యబోయిన రామానుజన్, కాదూరి సుశీల, మానేపల్లి సావిత్రి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చింతల భాగయ్య, సంఘ సభ్యులు రాజబోయిన జోగులు, గ్రామ యువకులు చింతల సురేందర్, అక్కమ్మ రాములు, కాదూరి కుమార్, తిమ్మకపల్లి సుధాకర్, తిమ్మకపల్లి ప్రభు, గ్రామస్తులు నేరెళ్ల కృష్ణ, నేరెళ్ల శేకులు, పితిరి రవి, చింతల నరేందర్, రాజబోయిన సాయి, రాజబోయిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కోతుల బెడద నివారణకు సహకరించిన గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులకు సర్పంచ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 31 ఆగస్ట్ 2026

## రిజర్వేషన్ల రక్షణే నేటి తక్షణ కర్తవ్యం

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై ఇప్పుడు దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ సాధారణ రాజకీయ వివాదం కాదు. ఇది రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయ హక్కుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన ప్రశ్న. కేంద్ర మంత్రి జితన్‌రామ్ మాంఝీ, ఆయన కుమారుడు బిహార్ మంత్రి సంతోష్‌కుమార్ సుమన్ రిజర్వేషన్ల సమీక్ష, ఎస్సీ--ఎస్టీలలో ఉపవర్గీకరణ, క్రీమీలేయర్ అంశాలను ముందుకు తేవడం ఈ వివాదాన్ని మరింత తీవ్రం చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్ తీవ్రంగా స్పందించి మాంఝీ, సుమన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం ఎన్డీయేలోనే రిజర్వేషన్లపై విభేదాలు ఎంతగా ముదిరాయో వెల్లడిస్తోంది.

ముందుగా ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. రిజర్వేషన్ ఎవరో ఇచ్చిన దానం కాదు. ఎవరో పెట్టిన భిక్ష కాదు. అది రాజ్యాంగం గుర్తించిన సామాజిక అన్యాయానికి ఒక పరిష్కార మార్గం. శతాబ్దాల పాటు కులం పేరుతో విద్య, ఉద్యోగం, భూమి, ఆలయ ప్రవేశం, సామాజిక గౌరవం వంటి ప్రాథమిక హక్కులకు దూరం చేసిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజ్యాంగం రిజర్వేషన్‌ను ఒక సాధనంగా రూపొందించింది. అందుకే రిజర్వేషన్‌ను కేవలం "పేదవాడికి సహాయం" అనే ఆర్థిక కోణంలో చూడటం అసలు సమస్యను పక్కదారి పట్టించడమే. ఒక దళిత కుటుంబం ఆర్థికంగా ఎదిగిందని చెప్పి కుల వివక్ష అంతమైందని చెప్పగలమా? ఒక దళిత అధికారి ఉన్నత పదవిలో ఉన్నంత మాత్రాన అతని కుల గుర్తింపు సమాజంలో చెరిగిపోతుందా? సమాధానం స్పష్టమే. ఆర్థిక స్థితి మారవచ్చు.. కానీ సామాజిక వివక్ష ఒక్క తరం లోనే మాయం కాదు. ఇదే రిజర్వేషన్‌కు సంబంధించిన మౌలిక తేడా.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఓబీసీ క్రీమీలేయర్‌తో సమానంగా చూడటం కూడా సరైనది కాదు. ఓబీసీలకు వర్తిస్తున్న క్రీమీలేయర్ విధానం వెనుక ఉన్న సామాజిక, రాజ్యాంగపరమైన నేపథ్యం వేరు. ఎస్సీ, ఎస్టీల విషయంలో అంటరానితనం, కుల వివక్ష, సామాజిక బహిష్కరణ వంటి చారిత్రక అణచివేతలు కీలక అంశాలు. ఇక్కడే అసలు ప్రశ్న వస్తోంది. కుల వివక్షను తొలగించడానికి ఉద్దేశించిన రిజర్వేషన్‌ను క్రమంగా ఆర్థిక ప్రమాణాలతో నిర్వీర్యం చేయాలనుకుంటున్నారా? అదే జరిగితే రిజర్వేషన్ ఉద్దేశమే దెబ్బతింటుంది. 2024లో సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో రాష్ట్రాలు ఉపవర్గీకరణ చేయడానికి అవకాశం ఉందని తీర్పు ఇచ్చింది. అయితే దాని అర్థం రిజర్వేషన్‌నే బలహీనపరచడం కాదు. ఎవరికీ ప్రయోజనం అందడం లేదో గుర్తించి, వాస్తవ గణాంకాల ఆధారంగా అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం చేరేలా చేయడం ఒక విషయం; రిజర్వేషన్‌కు కొత్త ఆర్థిక అడ్డంకులు పెట్టి దాని పరిధిని కుదించడం మరో విషయం. అందుకే "రిజర్వేషన్ ప్రయోజనం కొందరికే పరిమితమైంది" అనే వాదన ఉంటే దానికి పరిష్కారం రిజర్వేషన్‌ను బలహీనపరచడం కాదు. ఎవరికి ప్రయోజనం అందలేదు? ఎందుకు అందలేదు? ఏ వర్గాలు అత్యంత వెనుకబడ్డాయి? అనే ప్రశ్నలకు దేశవ్యాప్తంగా సమగ్ర సామాజిక, విద్యా, ఉద్యోగ గణాంకాలతో సమాధానం చెప్పాలి. కానీ ఆ పని చేయకుండా క్రీమీలేయర్ పేరుతో మొత్తం ఎస్సీ, ఎస్టీ వర్గాలపై కొత్త కోత పెట్టాలనుకోవడం మాత్రం తీవ్రంగా ప్రశ్నించాల్సిన అంశమే.

ఇంకో విషాదకరమైన అంశం ఏమిటంటే.. ఈ వాదనను ముందుకు తీసుకువస్తున్న వారిలో దళిత నాయకత్వం కూడా ఉండటం. అణచివేతకు గురైన వర్గాల నుంచి ఎదిగిన నాయకులే తమ వర్గానికి రాజ్యాంగం ఇచ్చిన రక్షణపై ప్రశ్నలు లేవనెత్తడం మరింత బాధాకరం. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం అయినా, అధికార రాజకీయాల్లో భాగంగా అయినా, ఇలాంటి అంశాలను ప్రయోగించడం మాత్రం ప్రమాదకరం.

మాంఝీ వర్గం మాత్రం తమ వాదనను "అత్యంత వెనుకబడినవారికి రిజర్వేషన్ ప్రయోజనం చేరాలి" అనే సామాజిక న్యాయ కోణంలో సమర్థిస్తోంది. ఆ లక్ష్యం నిజంగా ఉంటే దానిపై ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. కానీ అత్యంత వెనుకబడిన వారికి న్యాయం చేయాలనే పేరుతో మొత్తం రిజర్వేషన్ వ్యవస్థను బలహీనపరచకూడదు. ఇదే సమయంలో చిరాగ్ పాస్వాన్ చేసిన వాదనలోని ఒక ముఖ్యమైన అంశాన్ని కూడా విస్మరించలేం. రిజర్వేషన్ ఆర్థిక దానధర్మం కాదని, సామాజిక వివక్ష నుంచి పుట్టిన రాజ్యాంగ హక్కు అని ఆయన స్పష్టం చేశారు. క్రీమీలేయర్‌ను ఆర్థిక ప్రమాణాలతో ఎస్సీలకు వర్తింపజేయాలనే ఆలోచన సామాజిక న్యాయం లక్ష్యాన్ని దెబ్బతీయవచ్చని ఆయన హెచ్చరించారు. ఇక్కడే కేంద్ర ప్రభుత్వం ఆడిస్తున్న నాటకంగా ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల విషయంలో క్రీమీలేయర్‌ను వర్తింపజేయవచ్చా లేదా అనే ప్రశ్నపై కేంద్రం పార్లమెంట్ ముందు తేటతెల్లమైన విధానాన్ని ప్రకటించాలి. గతంలో కేంద్రం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఎస్సీ, ఎస్టీలకు క్రీమీలేయర్ భావనను విస్తరించలేమని పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి. అది తమ విధానం కాదని గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దానికి కట్టుబడుతున్నట్టు మరో మారు స్పష్టం చేయాలి. అయితే రాజకీయ నాయకులు మాత్రం ఒకరిపై ఒకరు రాజీనామాల డిమాండ్లు చేసుకుంటూ ఉంటే అసలు ప్రశ్న మరుగున పడుతుంది.

దేశానికి కావాల్సింది నేతల మధ్య రాజీనామాల యుద్ధం కాదు. రిజర్వేషన్లపై స్పష్టమైన రాజ్యాంగబద్ధ విధానం. అంబేద్కర్ పోరాడింది కేవలం కొన్ని ఉద్యోగాల కోసం కాదు. సమాజంలో సమాన గౌరవం కోసం. సావిత్రిబాయి పూలే పోరాడింది కేవలం చదువు కోసం కాదు. శతాబ్దాల సామాజిక సంకెళ్లను తెంచేందుకు. ఆ పోరాటాల ఫలితంగా వచ్చిన హక్కులను రాజకీయ బేరసారాల పట్టికపై పెట్టే అధికారం ఏ నాయకుడికీ లేదు. నేడు "క్రీమీలేయర్" అంటారు. రేపు "సమీక్ష" అంటారు. ఆ తర్వాత "పునర్వ్యవస్థీకరణ" అంటారు. చివరికి రిజర్వేషన్ అసలు ఉద్దేశాన్నే నీరుగార్చే పరిస్థితి రాకూడదు. రిజర్వేషన్‌లో లోపాలు ఉంటే సరిదిద్దాలి. ప్రయోజనం అందని వర్గాలకు ప్రయోజనం చేరేలా చేయాలి. ఉపవర్గాల మధ్య అసమానత ఉంటే గణాంకాల ఆధారంగా పరిష్కరించాలి. కానీ రిజర్వేషన్ అనే రాజ్యాంగ రక్షణను క్రమంగా కత్తిరించే ప్రయోగాలకు మాత్రం అడ్డుకట్ట వేయాలి. ఇది దళితుల సమస్య మాత్రమే కాదు. ఇది గిరిజనుల సమస్య మాత్రమే కాదు. ఇది వెనుకబడిన వర్గాల సమస్య మాత్రమే కాదు. సామాజిక న్యాయం మీద దాడి జరిగితే అది రాజ్యాంగం మీదే దాడి.

అందుకే ఈ రోజు దేశం అడగాల్సిన ఒకే ఒక్క ప్రశ్న.. రిజర్వేషన్లను బలహీనపరచాలా? లేక రిజర్వేషన్ల అసలు లక్ష్యం అయిన సామాజిక న్యాయాన్ని మరింత బలపరచాలా? జవాబు ఒక్కటే.. రిజర్వేషన్లను కాపాడాలి. రాజ్యాంగ హక్కులను కాపాడాలి. సామాజిక న్యాయాన్ని మరింత బలపరచాలి.

సంపాదకీయం
జనంసాక్షి

# కులం కేవలం భావజాలమా? లేక భౌతిక వాస్తవికమా?



'భారతదేశంలో వర్గం లేదు, కేవలం కులమే ఉంది" అనే వాదన తరచుగా వినిపిస్తుంది. కానీ, మార్క్సిస్ట్ దృక్పథంలో ఇది సంకుచితమైన, వాదన మాత్రమే అందులో నిజం లేదు భారతదేశంలో కులం మరియు వర్గం వేర్వేరు కావు; అవి ఒకదానితో ఒకటి పెనవేసుకుపోయి ఉన్నాయి. శ్రామిక వర్గ ఐక్యతను దెబ్బతీసేందుకు పాలకులు–శ్రామిక వ్యతిరేక శక్తులు కులాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటున్నాయి . దీన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి కుల–వర్గ సంబంధాన్ని చారిత్రక కోణంలో చూడాలి.

**కులం కేవలం భావజాలమా? లేక వాస్తవికమా?**

బూర్జువా భావజాలం కులాన్ని కేవలం సాంస్కృతిక లేదా మతపరమైన అంశంగా చూపిస్తుంది. కానీ మార్క్సిజం దీన్ని తిరస్కరిస్తుంది. కుల వ్యవస్థ అనేది కేవలం ఆచారాల సముదాయం కాదు; అది ఉత్పత్తి సంబంధాలతో ముడిపడి ఉన్న ఒక భౌతిక దోపిడీ వ్యవస్థ. చారిత్రకంగా కులమే శ్రమ విభజనను నిర్ణయించింది. ఏ కులం వారు ఏ ఉత్పత్తి సాధనాలను నియంత్రించాలి, ఎవరు శ్రమించాలి అనేదానిపై కుల వ్యవస్థ ఒక గీత గీసింది. తద్వారా శ్రామిక శక్తిని దోచుకోవడానికి కులం ఒక పునాదిగా పనిచేసింది.

**కుల, వర్గాల మధ్య వైరుధ్యమా? లేక ఐక్యతా?**

భారతదేశంలో వర్గ పోరాటం జరగకుండా కుల వైరుధ్యాలు అడ్డుపడుతున్నాయనే వాదనలో కొంత నిజం ఉన్నప్పటికీ, లోతుగా చూస్తే కులమే ఒక రూపంలో వర్గ దోపిడీ.

**ఆర్థిక ఆధిక్యత - కుల ఆధిపత్యం:** భారతదేశంలో సంపద, భూమి, ఉత్పత్తి సాధనాలు ప్రధానంగా అగ్రవర్ణాల చేతిలోనే కేంద్రీకృతమై ఉన్నాయి. అదే సమయంలో అట్టడుగు, దళిత, బహుజన కులాలు ప్రధానంగా శ్రామిక వర్గంగా, భూమిలేని కూలీలుగా, అసంఘటిత రంగ కార్మికులుగా మనుగడ సాగిస్తున్నాయి. అంటే, కులం అనేది ఒక వర్గంగా పనిచేస్తోంది. అగ్రవర్ణాల చేతిలో కుల ఆధిపత్యం అనేది శ్రామిక వర్గాన్ని అణచివేసే ఆర్థిక మరియు సామాజిక సాధనంగా మారుతోంది.

**కులం పునాదిగా వర్గ దోపిడీ**

భారతదేశ సామాజిక–రాజకీయ చర్చల్లో తరచుగా తలెత్తే ఒక ప్రధాన ప్రశ్న: "భారతదేశంలో వర్గం ఉందా, లేక కేవలం కులమే ఉందా? ఒకవేళ రెండూ ఉంటే, వాటి మధ్య సంబంధం ఎలాంటిది?" సాంప్రదాయ బూర్జువా సామాజిక శాస్త్రం, అలాగే కొన్ని అస్తిత్వ రాజకీయ ధోరణులు భారతీయ సమాజాన్ని కేవలం కులాల కూడలిగా మాత్రమే చిత్రీకరిస్తాయి. భారతదేశంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ, వర్గ వైరుధ్యాలు తీవ్రమవుతున్నప్పటికీ, దాన్ని పక్కదారి పట్టించడానికి కుల అస్తిత్వాలను బూర్జువా వర్గాలు ఉపయోగిస్తున్నాయి. మరోవైపు, సంప్రదాయ వామపక్షాలలోని కొన్ని విభాగాలూ కులాన్ని కేవలం ఒక 'ఉపరికృతి'గా, లేదా త్వరలో కనుమరుగయ్యే ఫ్యూడల్ అవశేషంగా మాత్రమే చూసి చేతులు దులుపుకున్నాయి. కానీ, మార్క్సిజం చారిత్రక భౌతికవాద పద్ధతి ద్వారా పరిశీలిస్తే, భారతదేశంలో కులం, వర్గం అనేవి రెండు విభిన్న అంశాలు కావు; అవి ఒకదానితో ఒకటి అల్లుకుపోయిన, ఒకదానికొకటి ఊపిరి పోసుకుంటున్న సంక్లిష్ట భౌతిక వాస్తవాలు. శ్రామిక వర్గ విముక్తి కోసం పనిచేసే ప్రతి కార్యకర్త ఈ సంక్లిష్టతను లోతుగా అర్థం చేసుకోవడం అత్యవసరం.

**చారిత్రక భౌతికవాద దృక్పథంలో కులం - కేవలం భావజాలమా? భౌతిక వ్యవస్థా?**

బూర్జువా భావజాలం కులాన్ని మతం, సంస్కృతి, లేదా కేవలం ఆలోచనలకు సంబంధించిన విషయంగా చూపుతుంది. "అందరూ ఒకే దేవుడి సృష్టి" అని ప్రబోధించడం ద్వారా, లేదా చట్టపరంగా సమానత్వం కల్పించడం ద్వారా కులం మాయమవుతుందని వారు వాదిస్తారు. కానీ మార్క్సిస్టులు భావాలకంటే భౌతిక పరిస్థితులకు ప్రాధాన్యత ఇస్తారు.

**ఉత్పత్తి సంబంధాలు, కులం :** ప్రాచీన భారతదేశంలో ఉత్పత్తి సాధనాల (భూమి, వనరులు, శ్రమ) పై గుత్తాధిపత్యాన్ని నిలబెట్టడానికి, శ్రమ విభజనను శాశ్వతం చేయడానికి కుల వ్యవస్థ ఒక భౌతిక పునాదిగా రూపాంతరం చెందింది. ఎవరి శ్రమను ఎవరు దోచుకోవాలి? ఎవరికి విద్య, ఆయుధాలు, భూమిపై హక్కు ఉండాలి? ఎవరికి కేవలం కష్టపడే శ్రమ మాత్రమే మిగల్చాలి? అనే ప్రశ్నలకు కుల వ్యవస్థే భౌతికమైన సమాధానాన్ని ఇచ్చింది.

శ్రమ విభజన రూపం : కార్ల్ మార్క్స్ చెప్పినట్లుగా, సమాజంలో భౌతిక ఉత్పత్తి విధానం మారినప్పటికీ, పాత సామాజిక సంబంధాలు కొత్త రూపంలో కొనసాగుతాయి. భారతదేశంలో ఫ్యూడల్ (భూస్వామ్య) ఉత్పత్తి సంబంధాలు బలంగా ఉన్నంత కాలం, కుల వ్యవస్థ ఆ భూస్వామ్య ఉత్పత్తి విధానానికి అవసరమైన చౌకైన శ్రామిక శక్తిని, అణచివేత యంత్రాంగాన్ని అందించింది. కాబట్టి కులం అనేది కేవలం ఒక సాంస్కృతిక ఆచారం కాదు; అది ఒక ఆర్థిక–సామాజిక దోపిడీ వ్యవస్థ.

**కులం, వర్గం మధ్య వైరుధ్యం: సహజీవనమా? ఏకీభవనమా?**

"భారతదేశంలో కులమే వర్గంగా పనిచేస్తోంది" అనడంలో సత్యం ఉంది, కానీ అది పూర్తిగా సరిపోదు. కులం, వర్గం మధ్య వైరుధ్యం చాలా గతిశీలమైనది.

**ఆర్థిక ఆధిక్యత, కుల ఆధిపత్యం ఏకీకరణ :** నేటికీ భారతదేశంలో సంపద, పారిశ్రామిక యాజమాన్యాలు, భూకమతాలు, ఉన్నత ఉద్యోగాలు ప్రధానంగా అగ్రవర్ణాల చేతిలోనే కేంద్రీకృతమై ఉన్నాయి. దీనికి విరుద్ధంగా, శ్రామిక శక్తిలో సింహభాగం, భూమిలేని వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు ఎక్కువగా దళిత, ఆదివాసి, బహుజన (SC, ST, OBC) కులాల నుంచే వస్తున్నారు.

**కులం రూపంలో వర్గ దోపిడీ :** ఒక అగ్రవర్ణ భూస్వామి లేదా పెట్టుబడిదారుడు తన ఫ్యాక్టరీలో లేదా పొలంలో పనిచేసే కార్మికుడిని కేవలం వర్గపరంగా మాత్రమే కాకుండా, కులపరమైన ఆధిపత్యంతో కూడా అణచివేస్తాడు. అక్కడ కులం అనేది శ్రామిక వర్గంపై పెత్తందారీ వర్గం ప్రయోగించే అదనపు ఆయుధంగా మారుతుంది.

కులాల మధ్యే వర్గ వైరుధ్యాలు: అయితే, ఈ సమీకరణం అక్కడితో ఆగిపోదు. నేడు అన్ని కులాలలోనూ వర్గ విభజన స్పష్టంగా కనిపిస్తోంది. దళిత, బహుజన కులాల నుండి కూడా కొద్దిపాటి మధ్యతరగతి, బూర్జువా వర్గం పుట్టుకొచ్చింది. అలాగే వెనుకబడిన కులాలలో (రాదీజ) కూడా ఆర్థికంగా బలపడిన శక్తులు, నిరుపేదలుగా ఉన్న శ్రామిక వర్గాల మధ్య తీవ్రమైన అంతరాలు ఉన్నాయి. అందువల్ల, కులాన్ని కేవలం ఒకే రంగుతో చూడలేం; కులం లోపలే తీవ్రమైన వర్గ వైరుధ్యాలు దాగి ఉన్నాయి.

**పాలకుల కుట్ర :** శ్రామిక వర్గ ఐక్యతను చీల్చడానికి కుల అస్తిత్వాల వాడకం

పెట్టుబడిదారీ విధానం, దేశీయ బూర్జువా–భూస్వామ్య కూటమి తమ అధికారాన్ని కాపాడుకోవడానికి "విభజించి పాలించు" సూత్రాన్ని నిరంతరం అమలు చేస్తున్నాయి.

**వర్గ పోరాటాన్ని కుల పోరాటంగా మార్చడం:** దేశంలోని పేదలు, కార్మికులు, కర్షకులు తమ ఉమ్మడి శత్రువు అయిన పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా ఐక్యమైతే, పాలకుల సింహాసనాలు కదులుతాయి. దీన్ని తప్పించుకోవడానికి పాలకుడు–శ్రామిక వ్యతిరేక శక్తులు కుల అస్తిత్వాలను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొడతాయి. ఎన్నికల రాజకీయాలలో కులాలను పావులుగా వాడుకుంటూ, శ్రామిక ప్రజల వర్గ చేతనను దెబ్బతీస్తాయి.

**కులాల మధ్య కొట్లాటలు :** ఒక కులంలోని పేదవాడికి, మరో కులంలోని పేదవాడికి మధ్య శత్రుత్వాన్ని సృష్టించడం ద్వారా, అసలైన దోపిడీదారుడైన పెట్టుబడిదారుడి వైపు ప్రజల దృష్టి వెళ్లకుండా పాలకుల మీడియా మరియు భావజాల యంత్రాలు పనిచేస్తాయి. కార్మిక వర్గ ఐక్యతను ఛిన్నాభిన్నం చేయడానికి కులతత్వం ఒక అత్యంత ప్రమాదకరమైన బూర్జువా ఆయుధంగా ఉపయోగపడుతోంది.

**విప్లవాత్మక పరిష్కారం : వర్గ పోరాటంతో పాటు కుల నిర్మూలన**

ఈ సంక్లిష్ట వైరుధ్యాన్ని మార్క్సిస్టులు ఎలా పరిష్కరించాలి? కేవలం "వర్గ పోరాటం వస్తే కుల సమస్య అంతాకంటే అదే సర్దుకుంటుంది" అనే యాంత్రిక వాదనను విప్లవ ఉద్యమం ఎప్పుడూ తిరస్కరించింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పినట్లుగా కుల నిర్మూలన జరగకుండా నిజమైన సామాజిక సమత సాధించడం అసాధ్యం. అదే సమయంలో, పెట్టుబడిదారీ దోపిడీని అంతం చేయకుండా కులాలను మాత్రమే మార్చడం వల్ల దోపిడీ రూపం మారుతుందే తప్ప అంతం కాదు.

ద్విముఖ పోరాటం :

. వర్గ పోరాటం: ఉత్పత్తి సాధనాలపై సామాజిక యాజమాన్యం కోసం, దోపిడీకి వ్యతిరేకంగా, కనీస వేతనాలు, ఎనిమిది గంటల పనివేళలు, సంపద పునఃపంపిణీ కోసం జరిగే ఆర్థిక–రాజకీయ పోరాటం.

. సామాజిక విప్లవం: బ్రాహ్మణీయ ఆధిపత్యానికి, అంటరానితనానికి, కుల అణచివేతకు వ్యతిరేకంగా, సాంస్కృతిక మరియు సామాజిక రంగంలో జరిగే పోరాటం.

ఈ రెండు పోరాటాలు వేర్వేరు కావు; అవి ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలు. కుల అణచివేత నుంచి విముక్తి పొందకుండా దళిత, బహుజన శ్రామికులు పూర్తి స్థాయి వర్గ చేతనను పొందలేరు. అలాగే, వర్గ దోపిడీని అంతం చేయకుండా కుల నిర్మూలన కూడా సాధ్యం కాదు.

భారతదేశంలో వర్గం, కులం అనేవి విడదీయరాని సంక్లిష్ట వాస్తవాలు. శ్రామిక వర్గ విముక్తి కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులు ఈ వైరుధ్యాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలి. అన్ని కులాల శ్రామికులను (వర్గాన్ని) దోపిడీ వ్యతిరేక వేదికపైకి తెస్తూనే, ప్రతి కులంలోనూ అణచివేయబడుతున్న పీడితుల పక్షాన నిలబడాలి. వర్గ పోరాటాన్ని కుల నిర్మూలన లక్ష్యంతో జోడించినప్పుడే, భారతదేశంలో అసలైన విప్లవ శంఖం పూరించబడుతుంది; దోపిడీ లేని, సమానత్వ సోషలిస్టు సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.



మాలోతు సాగర్
సెల్ : 7013805411

జనంసాక్షి

## దోమ నీతి

ఓ దోమ
నీ కోసం
కడుపు నిండ రక్తం
తీసుకో
మరో చోటుకి జారుకో...

ఓ బాబు
మీ లా జీవితాన్ని
ఆశించను
దోచి దాచి పెట్టుకో
లేను
నా కష్టంతో
నా ఆకలి తీర్చు


కుంటా
స్వేచ్ఛగా తిరుగుతూ
నీతిగా బతుకుతా

రేడియమ్
9291527757
(ఒక ఆంగ్ల కార్టూన్ చూసి)

జనంసాక్షి

# దళారుల చేతిలో దగా - పడుతున్న వ్యవసాయ రైతు

భారతదేశ వ్యవసాయ రంగం కోట్లాది కుటుంబాలకు జీవనాధారం. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి కీలక స్థానం ఉన్నప్పటికీ వ్యవసాయం చేస్తున్న రైతు మాత్రం ఆర్థికంగా ఎందుకు వెనుకబడుతున్నాడనే ప్రశ్నకు సమాధానం వెతికితే అనేక సమస్యలు కనిపిస్తాయి. పంట పండించడానికి రైతు నెలల తరబడి శ్రమిస్తాడు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు, సాగునీరు, విద్యుత్, యంత్రాల అద్దె, భూమి కౌలు, రవాణా వంటి అనేక ఖర్చులను భరిస్తాడు. ప్రకృతి అనుకూలిస్తే పంట చేతికి వస్తుంది. అయితే పంట చేతికి వచ్చిన తర్వాత రైతు ఎదుర్కొనే అసలు సమస్య మార్కెట్. తన చెమటతో పండించిన పంటకు తగిన ధర పొందేందుకు రైతు మార్కెట్‌లో అడుగడుగునా పోరాడాల్సి వస్తోంది. పంట ధరను నిర్ణయించే శక్తి రైతు చేతుల్లో లేకపోవడం, మార్కెట్ సమాచారం పూర్తిస్థాయిలో అందకపోవడం, నిల్వ సదుపాయాలు లేకపోవడం, తక్షణ నగదు అవసరం ఉండటం వంటి కారణాలతో రైతు దళారులు, మధ్యవర్తులు, కమిషన్ వ్యాపారులపై ఆధారపడుతున్నాడు. ఫలితంగా పంట పండించినా పెట్టుబడిని పూర్తిగా తిరిగి పొందలేని పరిస్థితి ఏర్పడుతోంది.




రైతు వ్యవసాయం ప్రారంభించినప్పటి నుంచి ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, వ్యవసాయ యంత్రాల అద్దెలు, డీజిల్, సాగునీటి వ్యయం పెరుగుతున్నాయి. చిన్న, సన్నకారు రైతులకు ఈ భారాన్ని భరించడం మరింత కష్టంగా మారుతోంది. పెట్టుబడి ముందుగానే ఖర్చవుతుండగా ఆదాయం మాత్రం పంట కోత తర్వాత మార్కెట్ ధరపై ఆధారపడి ఉంటుంది. ఒక సంవత్సరం మంచి ధర వస్తే మరో సంవత్సరం అదే పంటకు ధర పడిపోవచ్చు. దీంతో రైతు ఆదాయం అనిశ్చితంగా మారుతోంది.

రైతు పంట పండించడానికి ఉపయోగించే ప్రతి వస్తువుకు మార్కెట్ ధర ఉంటుంది. కానీ పంటను విక్రయించే సమయంలో మాత్రం రైతు మార్కెట్ ధరను నిర్ణయించే స్థితిలో ఉండడు. రైతు వద్ద నిల్వ సదుపాయం లేకపోతే కోత అనంతరం వెంటనే పంటను మార్కెట్‌కు తీసుకెళ్లాల్సి వస్తుంది. ఒకేసారి పెద్ద మొత్తంలో పంట మార్కెట్‌లోకి రావడంతో సరఫరా పెరిగి ధర పడిపోయే అవకాశం ఉంటుంది. నిల్వ సదుపాయం ఉంటే ధర మెరుగుపడే వరకు వేచి చూసే అవకాశం ఉంటుంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న రైతులకు శాస్త్రీయ గోదాములు, శీతల నిల్వ కేంద్రాలు, పంట సంరక్షణ సదుపాయాలు పరిమితంగా ఉండటంతో తక్షణ విక్రయానికే మొగ్గుచూపాల్సి వస్తోంది. ఈ పరిస్థితి మధ్యవర్తులకు అనుకూలంగా మారుతోంది.

మార్కెట్‌కు పంట తీసుకెళ్లినప్పుడు తూకం, నాణ్యత, రవాణా, కమిషన్ తదితర ఖర్చుల పేరుతో వివిధ రకాల కోతలు ఎదురయ్యే అవకాశం ఉంది. పారదర్శకత లేకపోతే రైతుకు వాస్తవంగా తన పంటకు ఎంత ధర లభించిందో తెలుసుకోవడం కూడా కష్టమవుతుంది. రైతు వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి కొంతకాలం నిల్వ చేసి ధర పెరిగినప్పుడు విక్రయించడం ద్వారా వ్యాపారి లాభం పొందుతాడు. రైతు మాత్రం పంటను విక్రయించిన వెంటనే మార్కెట్ నుంచి బయటకు వెళ్లిపోతాడు. దీంతో ధర పెరిగిన తర్వాత వచ్చే లాభం రైతుకు కాకుండా తదుపరి మార్కెట్ దశల్లో ఉన్నవారికి చేరుతుంది.

రైతు అప్పుల సమస్య కూడా మార్కెట్ సమస్యతో ముడిపడి ఉంది. పంట సాగు కోసం అప్పు తీసుకున్న రైతు పంట చేతికి వచ్చిన వెంటనే అప్పు తీర్చాల్సిన ఒత్తిడిలో ఉంటాడు. ధర తక్కువగా ఉన్నప్పటికీ వేచి ఉండే పరిస్థితి ఉండదు. కుటుంబ అవసరాలు, తదుపరి పంటకు పెట్టుబడి అవసరం వంటి కారణాలతో రైతు తక్కువ ధరకు పంటను విక్రయించాల్సి వస్తుంది. ఇలా రైతు అప్పు–పంట–మార్కెట్ అనే చక్రంలో చిక్కుకుపోతాడు. కనీస మద్దతు ధర రైతుకు ధర రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన ముఖ్యమైన చర్య. అయితే కనీస మద్దతు ధర ప్రకటించడం మాత్రమే సరిపోదు. రైతు వాస్తవంగా ఆ ధరను పొందేలా కొనుగోలు వ్యవస్థ బలపడాలి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు రైతుకు అందుబాటులో ఉండాలి. నాణ్యత పేరుతో అనవసర కోతలు జరగకూడదు. కొనుగోలు చేసిన పంటకు రైతుకు చెల్లింపు ఆలస్యం కాకూడదు. మార్కెట్ ధర కనీస మద్దతు ధర కంటే పడిపోయినప్పుడు ప్రభుత్వ జోక్యం సమర్థంగా ఉండాలి. రైతుకు సరైన ధర రావాలంటే పంట ఉత్పత్తి నుంచి విక్రయం వరకు మొత్తం విలువ గొలుసును పునఃపరి శీలించాలి. రైతు నుంచి పంట కొనుగోలు చేసే వ్యక్తి, కమిషన్ వ్యాపారి, పెద్ద వ్యాపారి, నిల్వదారు, ప్రాసెసింగ్ సంస్థ, చిల్లర వ్యాపారి వంటి అనేక దశలు ఏర్పడినప్పుడు ప్రతి దశలో మార్జిన్ జోడించబడుతుంది. వినియోగదారుడు చెల్లించే తుది ధరకు రైతుకు లభించే ధరకు మధ్య వ్యత్యాసం పెరుగుతుంది. ఈ వ్యత్యాసంలో రైతు వాటా ఎంత, మధ్య వర్తుల వాటా ఎంత అనే విషయంపై పారదర్శకత అవసరం.

రైతు సమస్యకు రుణమాఫీ మాత్రమే శాశ్వత పరిష్కారం కాదు. రుణభారం తగ్గించడం అవసరమైన సందర్భాలు ఉన్నప్పటికీ పంటకు సరైన ధర లభించని పరిస్థితి కొనసాగితే కొంతకాలం తర్వాత రైతు మళ్లీ అప్పుల పాలవుతాడు. అందువల్ల సాగు ఖర్చు తగ్గించడం, ఉత్పాదకత పెంచడం, మార్కెట్ ధర రక్షణ కల్పించడం, నిల్వ సదుపాయాలు పెంచడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, విలువ జోడింపు పెంచడం, రైతు సంఘాలను బలోపేతం చేయడం వంటి చర్యలు సమగ్రంగా అమలు కావాలి. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్‌పై పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలి. తూకాల్లో మోసం, నాణ్యత పేరుతో అన్యాయం, అక్రమ కమిషన్లు, చెల్లింపుల ఆలస్యం, ధరల కృత్రిమ నియంత్రణ వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. రైతు ఫిర్యాదు చేస్తే త్వరగా పరిష్కరించే వ్యవస్థ ఉండాలి. మధ్యవర్తిత్వాన్ని పూర్తిగా తొలగించడం కంటే రైతుకు అన్యాయం చేసే అనవసరమైన దశలను తగ్గించడం వాస్తవిక పరిష్కారం.

రైతు మార్కెట్ గేటు వద్ద నిలబడినప్పుడు అతని చేతిలో కేవలం పంట బస్తా ఉండకూడదు; మార్కెట్ సమాచారం, ప్రత్యామ్నాయ కొనుగోలుదారులు, నిల్వ సదుపాయం, సమిష్టి బేరసారాల శక్తి, ప్రభుత్వ ధర రక్షణ వంటి ఆర్థిక సాధనాలు ఉండాలి. అప్పుడు మాత్రమే దళారి చెప్పిన ధరకు పంటను అమ్మాల్సిన పరిస్థితి తగ్గుతుంది. రైతు తన శ్రమకు విలువ అడగగలడు. తన ఉత్పత్తి విలువలో తగిన వాటాను పొందగలడు. రైతు దేశానికి అన్నం పెడుతున్నాడు. అతని చేతిలోని పంటను మధ్యవర్తుల లాభానికి మాత్రమే పరిమితం చేయకుండా, ఆ పంట ద్వారా సృష్టించే విలువలో రైతు వాటాను పెంచడం సమాజం మొత్తానికి ఉన్న బాధ్యత. రైతు పెట్టుబడి తిరిగి రావడం కనీస అవసరం; అతని శ్రమకు గౌరవప్రదమైన లాభం రావడం నిజమైన లక్ష్యం. రైతు బలంగా ఉంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. గ్రామీణ భారతదేశం బలపడితేనే దేశ అభివృద్ధి సమగ్రంగా ఉంటుంది. అందువల్ల రైతును దళారుల దయపై ఆధారపడే ఉత్పత్తిదారుడిగా కాకుండా, మార్కెట్‌లో నిర్ణయాధికారం కలిగిన ఆర్థిక భాగ స్వామిగా తీర్చిదిద్దడమే భవిష్యత్ వ్యవసాయ విధానాల ప్రధాన లక్ష్యం కావాలి.



ప్రొఫెసర్. సుంకరి జ్యోతి
డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## వసుధైవ కుటుంబకం మాటకు పరీక్ష
# అమెరికాలో కాదు, భారత్‌లోనే కనిపించాలి




న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆగస్టు 29న జరిగిన 'యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్'లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ చేసిన ప్రసంగం ఒక సాధారణ ప్రవాస భారతీయుల కార్యక్రమం కంటే ఎక్కువ రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యతను సంతరించుకుంది. అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్ (ఏహెచ్ఈఏడీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సుమారు 5,000--6,000 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. 250కిపైగా హిందూ–అమెరికన్ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని నిర్వాహకుల సమాచారం.

భగవత్ ప్రసంగంలోని ప్రధాన సందేశం "వసుధైవ కుటుంబకం" ప్రపంచమంతా ఒకే కుటుంబం. అనే భారతీయ తాత్విక భావన. భారతదేశం, అమెరికా రెండింటి సామాజిక స్వభావంలో వైవిధ్యంలో ఏకత్వం ఉందని ఆయన అన్నారు. ధర్మం అంటే కేవలం మతాచారం కాదని, వ్యక్తి తనకంటే సమాజం, మానవత్వం, ప్రకృతి పట్ల బాధ్యతను నిర్వర్తించడమే ధర్మమని ఆయన వివరించారు. ముఖ్యంగా "భారతదేశంలో ముస్లింలు ఉండకూడదని భావించే వ్యక్తి నిజమైన హిందువు కాదు" అన్న ఆయన వ్యాఖ్య గమనించదగ్గది. అన్ని మతాల మార్గాలు వేర్వేరైనా మానవత్వం, సత్యం ఒకటేనన్న సందేశాన్ని ఆయన ఇచ్చారు.

ఇక్కడే ఈ ప్రసంగం అసలు రాజకీయ–సామాజిక పరీక్షను ఎదుర్కొంటుంది. "ప్రపంచం ఒక కుటుంబం" అనే మాట సార్వత్రిక మానవతా విలువగా ఎవరూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కానీ ఆ భావనను చెప్పే సంస్థకు సంబంధించిన చారిత్రక, రాజకీయ వివాదాలను విస్మరించడం కూడా సరైంది కాదు. ఆర్ఎస్ఎస్ 1925లో స్థాపించబడి 2025లో శతాబ్ది పూర్తి చేసుకుంది. భారతదేశంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీతో ఆర్ఎస్ఎస్‌కు ఉన్న సైద్ధాంతిక సంబంధం అంతర్జాతీయంగా విస్తృతంగా చర్చించబడుతోంది. అందువల్ల భగవత్ అమెరికాలో చెప్పిన సమగ్రత సందేశాన్ని ఆయన సంస్థ భారతదేశంలోని సామాజిక–రాజకీయ వాస్తవాలతో పోల్చి చూడటం సహజమే.

అమెరికాలో ఈ కార్యక్రమానికి వచ్చిన వ్యతిరేకత కూడా అందుకే ప్రాధాన్యత పొందింది. న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీ ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని మైనారిటీలను వెలివేసే దృక్పథంగా విమర్శించారు. అమెరికా అంతర్జాతీయ మత స్వేచ్ఛ కమిషన్ కూడా భగవత్ అమెరికా పర్యటన సందర్భంగా ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ, సంస్థకు సంబంధించిన వ్యక్తులపై లక్షిత ఆంక్షలను సిఫారసు చేసింది. అయితే ఇవి అమెరికా ప్రభుత్వ తుది నిర్ణయాలు కావు; ఆర్ఎస్ఎస్ ఈ ఆరోపణలను తిరస్కరిస్తూ తాను సాంస్కృతిక, సేవా సంస్థ మాత్రమేనని చెబుతోంది.

అమెరికాలోని భారతీయ సమాజ పరిమాణాన్ని చూస్తే ఈ వాదోపవాదం మరింత ఆసక్తికరం. 2022 నాటికి అమెరికాలో సుమారు 48 లక్షల భారతీయ అమెరికన్లు ఉన్నారని ప్యూ రీసెర్చ్ సెంటర్ అంచనా. వారిలో 48 శాతం మంది హిందువులుగా తమను గుర్తించుకున్నారు. అంటే అమెరికాలో హిందూ సమాజం కేవలం ఆధ్యాత్మిక సమూహం మాత్రమే కాదు; ఆర్థిక, విద్యా, వృత్తి, రాజకీయ రంగాల్లో ప్రభావం పెంచుకుంటున్న ప్రవాస సమాజం.

అయితే భగవత్ ప్రసంగాన్ని కేవలం విమర్శలతో కొట్టిపారేయడం కూడా అంతే అసంపూర్ణం. మతాల మధ్య సంభాషణ, సేవ, పరస్పర గౌరవం, మానవ ఏకత్వం వంటి విలువలను బహిరంగంగా చెప్పడం స్వాగతించదగ్గ పరిణామమే. న్యూయార్క్‌లో ఆయన ఇస్కాన్ కార్యక్రమంలో పాల్గొని నిరాశ్రయులకు లక్ష భోజనాల కార్యక్రమంలో 1,00,000వ భోజన పంపిణీని ప్రారంభించడం కూడా సేవను ఆధ్యాత్మికతతో అనుసంధానించే ప్రయత్నంగానే చూడాలి.

కానీ అసలు ప్రశ్న ఒక్కటే "వసుధైవ కుటుంబకం" నినాదం వేదికపై ఎంత అందంగా వినిపించిందన్నది కాదు; అది భారత్ లో సామాజిక జీవితంలో ఎంతవరకు ఆచరణలో కనిపిస్తుందన్నదే ప్రధాన అంశం. భారత రాజ్యాంగంలోని మత స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి విలువలు ప్రతి మతానికీ సమాన భద్రత కల్పించగలిగితేనే ప్రపంచానికి భారతదేశం నిజమైన "ఏకత్వంలో భిన్నత్వం" అనే మాటకు ఉదాహరణగా నిలుస్తుంది. అమెరికా వేదికపై ముస్లింలు భారతదేశంలో సమానంగా ఉండాలనే సందేశం చెప్పడం సానుకూలమే. కానీ అదే సందేశం భారతదేశంలోని ప్రతి గ్రామం, ప్రతి మతం, ప్రతి అల్పసంఖ్యాకుడి జీవితంలోనూ అనుభూతి కలిగిందా? అన్నదే కావాలి. అప్పుడు మాత్రమే "ప్రపంచం ఒక కుటుంబం" అనే మాట ఒక ప్రసంగంలోని ఆకర్షణీయమైన వాక్యం కాకుండా భారతీయ నాగరికత యొక్క జీవన సత్యంగా ప్రపంచం అంగీకరిస్తుంది. గత పన్నెండేళ్లలో భారత్ లో ఆరెస్సెస్, దాని రాజకీయ అనుభంధ సంస్థ బీజేపీ అనుసరించిన విధానాలు ఇప్పటికే చరిత్ర పుటల్లో లిఖించబడింది, మోహన్ భగవత్ జీవిత చరమాంకంలో నిజమైన పరిపక్వత అనుభవంలో నుండి "ఉపదేశించిన ఈ ఆరెస్సెస్ , (బీజేపీ) ఆశయాలు" ఆచరణలో భవిష్యత్తులో అనుసరించ బోతున్న విధానాలు వాటికి భిన్నంగా ఉండబోతుందా అనేది వేచి చూడాలి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- వ్యవసాయాన్ని కాపాడాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్
- రెండో రోజు కొనసాగిన సీపీఎం పాదయాత్రకు మేడ్చల్ నాయకుల ఘన స్వాగతం



**బోడుప్పల్, ఆగస్టు 30 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పడి దశాబ్ద కాలం పూర్తవుతున్నా సాగు, తాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులకు తక్షణమే నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన గడువు ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అసంపూర్తి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలనే డిమాండ్‌తో సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ చేపట్టిన పాదయాత్ర రెండో రోజు ఘట్కేసర్, మేడిపల్లి మీదుగా ఉప్పల్‌కు చేరుకుంది. బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో జహంగీర్ మాట్లాడారు. వ్యవసాయాధారిత యాదాద్రి భువనగిరి జిల్లాలో సాగునీటి వసతులు లేక లక్షలాది మంది చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బునాదిగాని, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల పనులకు నిధులు కేటాయించకపోవడంతో అవి మధ్యలోనే నిలిచిపోయాయని తెలిపారు. బస్వాపూర్, గంధమల్ల, చర్లగూడెం వంటి బహుళార్థసాధక ప్రాజెక్టులు నిధుల కొరతతో పెండింగ్‌లో ఉండటం వల్ల జిల్లాకు సాగు, తాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నవాబుపేట రిజర్వాయర్ నుంచి గుండాల మండలానికి, అశ్వరాయిపల్లి నుంచి ఆలేరు ప్రాంతానికి నీరందించేందుకు నిర్మించిన కాల్వల్లో 15 ఏళ్లకు పైగా నీరు ప్రవహించక గడ్డి మొలిచి శిథిలావస్థకు చేరాయని అన్నారు. నారాయణపురం, చౌటుప్పల్ ప్రాంతాలకు కీలకమైన రాచకొండ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఎందుకు ముందుకు సాగడం లేదో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆసిఫ్‌నగర్, బృందావనం కాల్వలను పునరుద్ధరించాలని కోరారు.

### మూసి ప్రక్షాళనకు గోదావరి జలాలే పరిష్కారం

మూసి సుందరీకరణ పేరుతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు కార్పొరేట్ లాభాలకే పరిమితమవుతున్నాయా అన్న అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని జహంగీర్ అన్నారు. భువనగిరి ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని విషపూరిత మూసి నీరు ప్రభావితం చేస్తోందని వారికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
మూసి పరివాహక ప్రాంతానికి గోదావరి జలాలు అందించడం ద్వారానే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. మూసి ప్రక్షాళనతో పాటు గోదావరి జలాల అనుసంధానానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లాలోని షామీర్‌పేట్ చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి, అక్కడి నుంచి యాదాద్రి భువనగిరి ప్రాంతానికి గోదావరి జలాలు అందించే ప్రతిపాదనను అమలు చేయాలని కోరారు.
పాదయాత్రకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ, ఘట్కేసర్ మండల కమిటీ, మేడిపల్లి మండల కమిటీ నాయకులు ఘన స్వాగతం పలికారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి వేలాది మంది రైతులు పాదయాత్రకు సంఘీభావంగా తరలివస్తారని జహంగీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అవనగంటి వెంకటేష్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం వెంకటేశ్, వనం ఉపేందర్ లు పాల్గొన్నారు. పాదయాత్ర బృందానికి స్వాగతం పలికిన వారిలో సీపీఎం మేడ్చల్ జిల్లా నాయకులు చింతల యాదయ్య, ఘటకేసర్ నాయకురాలు సబితా, మేడిపల్లి మండల కార్యదర్శి ఎన్. సృజన, కర్రె జంగయ్య, కుమార్, అంజయ్య గౌడ్, పాపయ్య, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌మాల పనులతో ప్రకృతి సంపదకు ముప్పు

- గుట్టల విధ్వంసాన్ని తక్షణమే ఆపాలి
- పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి రాజు



**మక్తల్, ఆగస్టు 30 (జనంసాక్షి) :** జక్లేర్ శివారులోని సర్వే నంబర్ 244 (31.18 గుంటల ప్రభుత్వ ఖరీజ్ ఖాతా భూమి), గుడిగండ్ల శివారులోని సర్వే నంబర్ 246 పరిధిలో ఉన్న సహజసిద్ధమైన గుట్టలను భారత్‌మాల ప్రాజెక్టు కాంట్రాక్టర్లు విచక్షణారహితంగా ధ్వంసం చేస్తున్నారు. భారీ హిటాచీలు, టిప్పర్లతో గుట్టలను తవ్వుతూ, తీవ్రస్థాయిలో బ్లాస్టింగ్ పనులకు సిద్ధమవుతున్నారు. ఈ చర్యల వల్ల పర్యావరణానికి, స్థానిక ప్రజల జీవనానికి తీవ్ర ముప్పు వాటిల్లనున్నందున, సంబంధిత అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి బ్లాస్టింగ్, మట్టి తవ్వకాలను నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గుడిగండ్ల గ్రామం ఈ గుట్టకు సమీపంలోనే ఉండటంతో బ్లాస్టింగ్, క్రషర్ యంత్రాల వల్ల వెలువడే భారీ ధూళి (డస్ట్) గాలిలో కలిసి గ్రామంలోని ఇళ్లపై, పరిసర పంట పొలాలపై పడుతుంది. దీనివల్ల వాయు కాలుష్యం పెరిగి ప్రజలు శ్వాసకోశ సమస్యల బారిన పడటంతో పాటు పంటలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఇప్పటికే సమీపంలో ఉన్న ఇటుక బట్టీల సమస్యకు తోడు, తాజాగా గుట్ట పక్కనే ఏర్పాటు చేస్తున్న కాటన్ (పత్తి) మిల్లుకు కూడా ఈ దుమ్ము వల్ల తీవ్ర ఆటంకం కలుగుతుంది. గుట్టపై చారిత్రక శివాలయం, ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే మిషన్ భగీరథ ట్యాంక్ ఉన్నాయి. బ్లాస్టింగ్ వల్ల వచ్చే ప్రకంపనలతో ఈ నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

### జీవవైవిధ్యం, పర్యావరణ వినాశనం

గుట్టపై ఉన్న ఎన్నో ఏళ్ల నాటి వృక్ష సంపద నేలమట్టమవుతోంది. ఎన్నో మూగ జీవాలు, పక్షులు తమ సహజ ఆవాసాలను కోల్పోతున్నాయి. ఇప్పటికే వాతావరణ మార్పులతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, ఇలాంటి పచ్చదనాన్ని నాశనం చేయడం భవిష్యత్ తరాలకు తీరని అన్యాయం. గుట్ట పక్కనే జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 167) ఉండటంతో, బ్లాస్టింగ్ రాళ్లు, భారీ దుమ్ము కారణంగా హైవేపై వెళ్లే వాహనదారులకు ప్రమాదాలు జరిగే తీవ్ర అవకాశముంది. రోడ్డు నిర్మాణానికి అవసరమైన కంకర, మట్టిని ఆవాసాలు, చెట్లు లేని ప్రత్యామ్నాయ అనుమతి పొందిన క్వారీల నుంచి సేకరించాలని, ప్రజల ప్రాణాలతో, ప్రకృతితో చెలగాటం ఆడవద్దని కోరుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, ఈ గుట్ట వద్ద జరుగుతున్న పనులను శాశ్వతంగా నిలుపుదల చేయాలని స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు

**సనత్‌నగర్, ఆగస్టు 30 (జనంసాక్షి) :** పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం రాంగోపాల్‌పేట డివిజన్‌లో పలు ప్రాంతాల్లో నిర్వహించిన శ్రావణ మాస బోనాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా కళాసిగూడలోని శ్రీ జూలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం నెక్లెస్‌రోడ్‌లోని అంబేద్కర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలో శ్రీ గాలి మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఇందిరానగర్‌లోని శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన తలసాని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఆంజనేయులు, గణేష్, సతీష్, కొండాపురం మహేష్ యాదవ్, కోటేశ్వర్ గౌడ్, టీనా, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



# వర్గ పోరాట దృక్పథంతోనే కుల నిర్మూలన

- మతోన్మాద పాలకుల వల్ల దేశంలో పెరుగుతున్న అసమానతలు
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు

**వికారాబాద్, ఆగస్టు 30 (జనంసాక్షి) :** ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థను పరిష్కరించడానికి, కుల నిర్మూలన సాధించడానికి వర్గ పోరాట దృక్పథం ఒక్కటే మార్గమని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు అన్నారు, ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కెవిపిఎస్ వికారాబాద్ జిల్లా స్థాయి సామాజిక ఉద్యమ శిక్షణా తరగతులలో ఆయన కులం వర్గం అనే అంశంపై క్లాస్ బోధించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు మాట్లాడుతూ వర్గ పోరాటం ఒక్కటే సమాజ మార్పుకు చోదక శక్తిగా ఉంటుందన్నారు. ఒక కులాన్ని మరొక కులంతో ఘర్షణ పడితే పీడిత వర్గఐక్యతకు ఆటంకం కలుగుతుందన్నారు అన్ని కులాల్లోని పీడిత వర్గం ఒకటైతే సమాజం మార్పుకు సంఘటితశక్తి వస్తుందన్నారు కుల సమస్యను కూడా కులంతో పరిష్కరించలేమన్నారు కుల సమస్యను సైతం వర్గ పోరాట దృక్పథం తోనే పరిష్కరించబడుతుందన్నారు సమాజంలో పెరుగుతున్న అన్ని రకాల అసమానతలను తొలగించడానికి వర్గ పోరాటం ఒక్కటే ఏకైక ఆయుధమని చెప్పారు సామాజిక రంగంలో వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న అణిచివేత కుల పీడనను అంతం చేయడానికి అన్ని కులాలలోని పీడిత వర్గం ఐక్యంగా కుల సమస్యపై వివక్ష అసమాన తలపై సమైక్యంగా ఉద్యమాలు చేపట్టాలన్నారు కుల సమస్య అంటే కేవలం దళితుల సమస్యగా చూడకూడదని అది దేశం సమస్యగా చూడాలని చెప్పారు నేటికీ భూమి చదువు అన్నింటికీ మెజారిటీ ప్రజలుగా ఉన్న శూద్రులు దళితులు దూరం చేయబడ్డారని చెప్పారు. హిందువులందరూ బంధువులు అని పేర్కొనబడే ఆర్ఎస్ఎస్ విహెచ్పి బజరంగ్దళ్ సంస్థలు అట్టడుగు వర్గాలకు జరుగుతున్న అన్యాయంపై ఏ ఒక్కనాడు అయినా నోరు తెరిచారా అని ప్రశ్నించారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రాయల్ నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు ఆర్ మహిపాల్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో అనేక సామాజిక ఉద్యమాలు నిర్వహించామని చెప్పారు. ఆ పోరాటాల ఫలితంగా నేడు దళితులలో చైతన్యం పెరిగిందన్నారు అగ్రకుల ఆధిపత్యశక్తులను ఎదుర్కొనే ధైర్యం వచ్చిందని చెప్పారు వికారాబాద్ ప్రాంతంలో నేటికీ కులవివక్ష అంటరానితనం కొనసాగుతుందని చెప్పారు కులవివక్ష అంటరానితనానికి వ్యతిరేకంగా మతోన్మాదానికి వ్యతిరేకంగా బలమైన సామాజిక ఉద్యమాలను నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ తరగతులలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల సురేష్, ఆంజనేయులు, మాణిక్యం, మంజునాథ్, కమల్, లక్ష్మి, వెంకటయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య, ప్రశాంత్, అరుణ్ కుమార్ తదితరులు పపాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం



**కోహిర్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని పైడిగుమ్మల్, పైడిగుమ్మల్ లాల్సింగ్ తండా గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏ. చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఇళ్లను పరిశీలించి, లబ్ధిదారుల కుటుంబాలను అభినందించారు. ఈ సందర్భంగా ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లన్న పాటిల్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కౌన్సిలర్ మహేష్ కుమార్, సర్పంచులు లయ్యేక్, సురేష్, రాజ్ కుమార్, విష్ణు, మాజీ ఎంపీటీసీ జ్ఞానరత్నం, ఉప సర్పంచ్ ఆశమ్మ, వార్డు సభ్యులు శానం కాంతమ్మ, బాలయ్య, ప్రశాంత్, రేబుక, సంతోష్ రాథోడ్, నర్సింలు, కాంగ్రెస్ నాయకులు అష్రాఫ్, మాజీద్, మోసిన్, యువజన కాంగ్రెస్ నాయకులు ముజామిల్ తదితరులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం

- పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్



**బెజ్జంకి, ఆగస్టు 30 (జనం సాక్షి) :** మండల కేంద్రానికి చెందిన జెల్ల స్వామి నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి వెళ్లిన పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్ ఆదివారం రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని అన్నారు. పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు కత్తి రమేష్, జెల్ల ప్రభాకర్, రావుల నర్సయ్య, బోనగం రమేష్, బండి వేణు, ఎలిగే సతీష్, బోనాల మల్లేశం, రామచంద్రం, గుబురే చంద్రం, సంగ రమేష్, గుండని ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారంలో అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఆలయంలో ప్రత్యేక పూజలు
- ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షల భారీ విరాళం



**జిన్నారం, ఆగస్టు 31 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కేంద్రంలో మాల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, మాల సంఘం నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలలో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్నామని తెలిపారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని అన్నారు. జిన్నారం ప్రాంత ప్రజల భక్తి విశ్వాసాలకు అనుగుణంగా పోచమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం తనవంతుగా రూ.12 లక్షల భారీ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి భవిష్యత్తులోనూ అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో జిన్నారం ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, రాజేష్, స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మాయమాటలు నమ్మి కాంగ్రెస్‌కు ఓటేశాం

- కాంగ్రెస్‌కు షాక్... బీఆర్ఎస్‌లోకి భారీగా వలసలు
- ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరుతున్నాం
- కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి
- 50 మంది నాయకులు, కార్యకర్తల చేరిక
- కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

**పెద్దకొత్తపల్లి, ఆగస్టు 30 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీకి పెద్దకొత్తపల్లి మండలంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మారెడ్‌మన్‌దిన్నె, వేడుకరావుపల్లి తండాకు చెందిన తాజా మాజీ ఎంపీటీసీ మంగమ్మ అమ్రు నాయక్, ఉప సర్పంచ్ గన్నోజు రామ్మోహన్, యువ నాయకులు లక్ష్మణ్ నాయక్, పాండు నాయక్‌లతో పాటు సుమారు 50 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీరం హర్షవర్ధన్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 420 హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.

### గిరిజనుల సంక్షేమానికి కేసీఆర్ కృషి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని బీరం హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గిరిజనుల కష్టాలను తీర్చిన నాయకుడు కేసీఆర్. పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసి గిరిజనులకు భరోసా కల్పించారని తెలిపారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి బాటలు వేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలిచారని అన్నారు.

### బీఆర్ఎస్ శ్రేణులపై దాడులు సరికాదు

కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు, రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్న వారి పేర్లు రాసి పెట్టుకోండి. ఎవరినీ వదిలిపెట్టే సమస్యే లేదు. బీఆర్ఎస్ శ్రేణులు అధైర్యపడాల్సిన అవసరం లేదు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హెచ్చరించారు.

### కాంగ్రెస్‌కు ఓటేసి చింతిస్తున్నాం

బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేశామని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగలేమని భావించి బీఆర్ఎస్‌లో చేరుతున్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేసీఆర్ నాయకత్వం అవసరమని, ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేశ్‌రావు, మాజీ జడ్పీటీసీ సింగారం వెంకయ్య, మారెడ్‌మన్‌దిన్నె తాజా మాజీ సర్పంచ్ గన్నోజు సునీత, శ్రీకృష్ణచారి, పెద్దకొత్తపల్లి సర్పంచ్ రేణుక నాగరాజు, సాతాపూర్ సర్పంచ్ వంశీ, మాజీ సర్పంచ్‌లు రవినాయక్, బాలు నాయక్, బలరాంనాయక్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
31 ఆగస్టు 2026

# ఏసీబీకి ఫిర్యాదు చేసినందుకే మిల్లును కూల్చేశారు..

- అన్ని అనుమతులు ఉన్నా కక్షసాధింపుతో చర్యలు చేపట్టారు
- జిల్లా రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారులపై న్యాయపోరాటం చేస్తా
- సాంభశివ ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 30 (జనంసాక్షి) :** ఏసీబీకి ఫిర్యాదు చేసినందుకే తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడి, అన్ని అనుమతులు ఉన్న సాంభశివ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును అధికారులు కూల్చివేశారని మిల్లు యజమాని రమావత్ సమన్ నాయక్ ఆరోపించారు. జిల్లా రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారుల తీరుపై న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. శనివారం వనపర్తిలో మీడియాతో తన ఆవేదనను వెల్లడించారు. కొత్తకోట మండలం విలియంకొండ గ్రామ శివారులోని తమ రైస్‌మిల్లుకు ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయని సమన్ నాయక్ తెలిపారు. నలా కన్వర్షన్ ఆర్డర్, డీటీసీపీ అనుమతి, ఫ్యాక్టరీస్ అనుమతి, కాలుష్య నియంత్రణ మండలి అనుమతి, జీఎస్టీ రిజిస్ట్రేషన్, విద్యుత్ ఒప్పందం, ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి, సివిల్ సప్లైస్ శాఖ ఎన్ఓసీ తదితర పత్రాలు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ అధికారులు తన మిల్లును కూల్చివేశారని ఆరోపించారు.

### ఏసీబీకి ఫిర్యాదు చేసినందుకేనా..?

2025 - 26 ఖరీఫ్‌కు సంబంధించిన సీఎంఆర్ వడ్ల కేటాయింపుల విషయంలో అప్పటి సివిల్ సప్లైస్ డీఎం తనను ఇబ్బందులకు గురిచేశారని సమన్ నాయక్ ఆరోపించారు. వడ్లు కేటాయించేందుకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేయడంతో ఏసీబీని ఆశ్రయించానని, అనంతరం ఏసీబీ అధికారులు వలపన్ని సంబంధిత అధికారిని పట్టుకున్నారని తెలిపారు. అదేవిధంగా సివిల్ సప్లైస్ అధికారుల వేధింపులపై జూన్ 17, 2026న జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశానని, కమిషన్ స్పందించి రాష్ట్ర సివిల్ సప్లైస్ అధికారులకు నోటీసులు జారీ చేసిందని చెప్పారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే కొందరు అధికారులు, రాజకీయ నాయకులు తనను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు.

### న్యాయం జరిగే వరకు పోరాటం

తన రైస్‌మిల్లుకు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ చిన్నచిన్న కారణాలను చూపుతూ జేసీబీలతో కూల్చివేశారని సమన్ నాయక్ ఆరోపించారు. గిరిజనుడినైన తనను వ్యక్తిగతంగా, రాజకీయంగా టార్గెట్ చేసి వేధిస్తున్నారని పేర్కొన్నారు. తనకు జరిగిన నష్టంపై సమగ్ర విచారణ జరిపి, కూల్చివేతకు సంబంధించిన రికార్డులను పరిశీలించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ఇతర రైస్‌మిల్లుల్లోనూ సీఎంఆర్ బకాయిలు ఉన్నాయని, అయితే కొందరినే టార్గెట్ చేసి చర్యలు తీసుకోవడం సరికాదని అన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. న్యాయం జరిగే వరకు న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగిస్తానని సమన్ నాయక్ తెలిపారు.

## రహదారి అభివృద్ధికి 30 కోట్లతో పనులు ప్రారంభం



**టేక్మాల్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** నార్సింగి నుంచి మార్చట్పల్లి వరకు 11 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధికి 30 కోట్ల నిధులు మంజూరు అయి పనులు ప్రారంభించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవతో రహదారి అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది అన్నారు. రహదారిని ఆధునికీకరించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించనున్నారు. నార్సింగి – మార్చట్పల్లి మార్గంలో ప్రయాణించే ప్రజలకు ఈ పనులతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. రహదారి అభివృద్ధితో గ్రామాల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. అలాగే రైతులు, విద్యార్థులు, వ్యాపారులు రవాణా పరంగా ప్రయోజనం పొందనున్నారు. ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి దామోదర్ రాజనర్సింహకు పలువురు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాన్ కిషన్, నరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, యూసుఫ్, శ్రీధర్ చారి, సేవాలాల్, మజర్, భూమ్ రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జగలింగేశ్వర జాతర ఉత్సవాలు



**నారాయణపేట, ఆగస్టు 30 (జనం సాక్షి) :** నారాయణపేట పట్టణ నడిబొడ్డున కొలువైన కురువ జగ లింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బండి వేణుగోపాల్, సరాఫ్ నాగరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హరి నారాయణ బట్టడు, బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ ఎనిమిదవ వార్డ్ కౌన్సిలర్ కందెనపల్లి సత్యమ్మ, కురువ మనోజ్, మాజీ కౌన్సిలర్ డాక్టర్ సాయి బాబా, గొల్లబాలప్ప గొల్ల గోపాల్ యాదవ్ తది తరులు పాల్గొని స్వామివా రికి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి వేణుగోపాల్ మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులతో గ్రామంలో సుభిక్షంగా ఉండాలని, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని, వరుణ దేవుడు కటాక్షించా లని కోరారు. జాతరను విజ యవంతం చేసిన ఆలయ కమిటీకి, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రజా ప్రతిందులని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, యువకు లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

- 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ఎస్పీ వినీత్




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 30 (జనం సాక్షి) :** హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా నుండి గచ్చిబౌలి స్టేడియం వరకు నిర్వహించిన 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ రన్నింగ్ పోటీలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, డీసీఆర్‌బీ డీఎస్పీ మహేష్ పాల్గొని మారథాన్‌ను విజయవం తంగా పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిం చిన ఈ హాఫ్ మారథాన్‌లో పలువురు ఐఏఎస్, ఐపీ ఎస్ అధికారులు, యువత, క్రీడాకారులు, ఫిట్‌నెస్ ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఉత్సాహంగా పాల్గొని 21 కిలోమీటర్ల పరుగును పూర్తి చేశారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది శారీరకంగా, మాన సికంగా దృఢంగా ఉండటం ఎంతో అవసరమని భావి స్తున్న ఎస్పీ, నారాయణ పేట జిల్లాలో కూడా పోలీస్ సిబ్బంది ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందు లో భాగంగా జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బందికి లాంగ్ రన్నింగ్, సైక్లింగ్ తదితర ఫిట్‌నెస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడు తూపోలీసు విధుల్లో శారీ రక దృఢత్వం, మానసిక ఆరోగ్యం ఎంతో కీలకం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో కొంత సమయం వ్యాయా మం, రన్నింగ్, సైక్లింగ్, యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన కార్యక లాపాలకు కేటాయించా లన్నారు ఫిట్‌నెస్ అనేది కేవలం పోలీసులకు మాత్ర మే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలన్నారు. నారాయణపేట జిల్లా ప్రజలు, యువత, విద్యార్థు లు పోలీస్ శాఖ నిర్వహిస్తు న్న ఫిట్‌నెస్ కార్యక్రమాల ను ఆదర్శంగా తీసుకొని ఆరోగ్యంపై శ్రద్ధ వహించా లన్నారు. ప్రతిరోజూ రన్నింగ్ లేదా వాకింగ్ చేయడం, యోగా, ధ్యానం వంటి వాటిని అలవాటుగా మార్చుకోవాలన్నారు. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటే నే మన రోజువారీ పనుల ను మరింత ఉత్సాహంతో, సమర్థవంతంగా నిర్వహిం చగలుగుతానన్నారు. యువత క్రీడల వైపు, ఫిట్‌నెస్ వైపు దృష్టి సారించాలనీ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. ప్రతి ఒక్కరూ ఆరో గ్యకరమైన జీవనశైలిని పాటిస్తూ సమాజానికి ఆద ర్శంగా నిలవాలి" అని ఎస్పీ తెలిపారు. 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌ను పూర్తి చేయడం ద్వారా ఫిట్‌నెస్‌పై తనకున్న నిబద్ధతను జిల్లా ఎస్పీ మరోసారి చాటి చెప్పారు. పోలీస్ అధికా రులు, సిబ్బందితో పాటు జిల్లా యువత, విద్యార్థు లకు కూడా ఇది స్ఫూర్తిదా యకంగా నిలవాలన్నారు.

## ఘనంగా రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు




**రామచంద్రాపురం, ఆగస్టు 31 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర 45వ సబ్‌జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ – 2026 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రిలింగంపల్లి నియోజకవర్గం భారతీనగర్ డివిజన్ ఓల్డ్ ఎంఐజీ కాలనీలో మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి పోటీలకు హాజరై వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను అభినందించారు. చిన్నారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. క్రీడాకారులు పట్టుదలతో సాధన చేసి ఉన్నతస్థాయికి ఎదిగి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కాటూరి శ్రీనివాస్‌రావు, కార్యదర్శి వై.రామారావు, పారిశ్రామికవేత్త రామకృష్ణ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్‌రెడ్డి, భాస్కర్ ముదిరాజ్, కాలనీ అధ్యక్షులు బాలయ్య, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న సంస్కృతులకు నిలయం పటాన్‌చెరు

- ఓనం వేడుకల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**రామచంద్రాపురం, అగస్టు 30 (జనం సాక్షి) :** విభిన్న సంస్కృతులు, ఆచారాలకు పటాన్‌చెరు నియోజకవర్గం నిలయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నాయర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓనం వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేరళ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొనే ఓనం పండుగను రామచంద్రాపురంలో ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే ఇలాంటి పండుగలు ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల పండుగలు, సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఓనం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, సీనియర్ నాయకులు పరమేష్‌యాదవ్, ప్రమోద్‌గౌడ్, ఐలేష్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాపరాతి పరిశ్రమల పరిరక్షణకు చర్యలు తీసుకోండి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వినతి



**తాండూరు, అగస్టు 30 (జనంసాక్షి) :** తాండూర్ ప్రాంతానికి నాపరాతి పరిశ్రమలు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. నాపరాతి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూర్ లో మైనింగ్ పరిశ్రమ ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఎంతో మంది ఉపాధి కోసం తాండూర్ కు వచ్చి జీవనం సాగిస్తున్నారని అన్నారు. నాపరాతి పరిశ్రమలపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈ పరిశ్రమలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలను భారీ పరిశ్రమలుగా రూపాంతరం చేసే విధంగా తీసుకొస్తున్న నూతన నిబంధనల వల్ల తాండూర్ లోని నాపరాతి పరిశ్రమలు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నతరహా పరిశ్రమలు భారీ పరిశ్రమలుగా మారితే స్థానిక నాపరాతి వ్యాపారులు అదనపు ఆర్థిక భారాన్ని ఎదుర్కొని నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. అదేవిధంగా రాయల్టీ చార్జీలు పెరగడం వల్ల వ్యాపారులపై అదనపు భారం పడటమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. నాపరాతి పరిశ్రమలు దెబ్బతింటే వ్యాపారులు నష్టపోవడంతో పాటు వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాండూర్ ప్రాంత ప్రజలు, నాపరాతి వ్యాపారులు, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నాపరాతి పరిశ్రమలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే వాహనం చోరీ కేసు ఛేదింపు




**సదాశివపేట, ఆగస్టు 30 (జనంసాక్షి) :** వాహనం చోరీ కేసును సదాశివపేట పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. సుమారు రూ.12 లక్షల విలువైన డీసీఎం ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. ఈ నెల 27న రాత్రి పిఎస్ఎంఎల్ బైపాస్ సమీపంలోని అమ్మఒడి రెస్టారెంట్ వెనుక పార్క్ చేసిన టీ15యూడీ1956 నంబర్ గల ఐచర్ వాహనం చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేష్, ఎస్సై లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక క్రైమ్‌టీమ్‌ను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల దృశ్యాలు, సాంకేతిక ఆధారాలతో నారాయణఖేడ్ మండలం సతేగామకు చెందిన మంగలి గోపాల్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి చోరీ చేసిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని విక్రయించి డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గతంలో తాను పనిచేసిన బ్రిక్స్ కంపెనీ వద్ద పార్క్ చేసిన ఐచర్ వాహనాన్ని చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు సిబ్బందిని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య అభినందించారు. ఇళ్ల ముందు, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ ప్రజలకు సూచించారు.

## సెప్టెంబర్ 3న 'హలో మాదిగ - చలో సిద్దిపేట' మహా బైక్ ర్యాలీ

- ఎమ్మార్పీఎస్ అధికారిక ప్రతినిధి దేవులపల్లి రాజేందర్



**నంగునూరు, ఆగస్టు 30 (జనం సాక్షి) :** ఎస్సీ సంక్షేమ నిధులు మరియు దళితుల హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 3న సిద్దిపేట అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు 'మహా బైక్ ర్యాలీ' నిర్వహించనున్నట్లు తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి దేవులపల్లి రాజేందర్ మాదిగ పిలుపునిచ్చారు. నంగునూరు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూఎస్సీ కార్పొరేషన్ సంక్షేమానికి కేటాయించిన నిధులను పక్కదారి పట్టించకుండా ఎస్సీలకే పూర్తిస్థాయిలో అందించాలి. రూ. 12 లక్షల సహాయం: చేవెళ్ల డిక్లరేషన్ మరియు అభయహస్తం హామీ ప్రకారం ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సాయాన్ని వెంటనే అమలు చేయాలి. పారిశుద్ధ్య కార్మికులు పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుతూ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న పారిశుధ్య/సఫాయి కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ. 25,000 జీతం చెల్లించాలి అని ఎమ్మార్పీస్ టీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న, రాష్ట్ర అధ్యక్షుడు కేదాస్ మోహన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాల నరసింహులు, కొంకటి బాబు, మండల అధికార ప్రతినిధి దేవులపల్లి కృష్ణ, డి. శ్రీకాంత్, డి. అజిత్, డి. శేఖర్, డి. బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# పదవులు శాశ్వతం కాదు అభివృద్ధే శాశ్వతం

- మక్తల్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- మంత్రి వాకిటి శ్రీహరి
- కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న బీజేపీ సర్పంచ్



**మక్తల్, ఆగస్టు 30 (జనంసాక్షి) :** అభివృద్ధి అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలం జౌలాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సర్పంచ్ మహాదేవమ్మ బాలకిష్టయ్య మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ రాజకీయాలకు తావులేకుండా ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. మనలో మనం గొడవపడితే గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి బూత్‌లో, ప్రతి గ్రామంలో కనిపిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలకు ఆశ చూపించారే తప్ప, ఒక్క పేదవాడికి కూడా ఇల్లు ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రజల్లో అవగాహన పెరిగిందని, తమ గ్రామాలను తామే అభివృద్ధి చేసుకోవాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో వస్తోందని అన్నారు. మక్తల్ నియోజకవర్గంలోని 284 బూత్‌లలో ప్రతి బూత్‌కు 10 నుంచి 12 ఇందిరమ్మ ఇళ్లు ఎలాంటి అవినీతికి తావులేకుండా మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. సుమారు 276 కోట్లతో 5,500 ఇందిరమ్మ ఇళ్లు మక్తల్ నియోజకవర్గానికి రావడం శుభపరిణామమన్నారు. అలాగే నియోజకవర్గంలో 68 వేల రేషన్ కార్డులు మంజూరు చేసి, ప్రతి పేద కుటుంబానికి నెలకు 6 కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి శ్రీహరి కోరారు. పదవులు ఎవరికీ శాశ్వతం కాదని.. తాము చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సేవలు మాత్రమే శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. నమ్మకంతో తనను గెలిపించిన మక్తల్ నియోజకవర్గ ప్రజలకు న్యాయం చేసే బాధ్యత తనపై ఉందని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడికి చేరేలా పనిచేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కళాకారుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం తెలంగాణ జానపద కళాకారుల కృతజ్ఞత సభ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం జానపద కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న సందర్భంగా ఈ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహం నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు కళాకారులు సంప్రదాయ వాద్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొని కళాకారులను అభినందించారు. అనంతరం స్టేడియంలో ఏర్పాటు చేసిన సభను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కళాకారుల పాత్ర గొప్పదన్నారు. కళాకారుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. గుర్తింపు కార్డులు అందించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి చేరువయ్యేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, జానపద కళలను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జానపద యూనివర్సిటీ కావాలని కళాకారులు కోరగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ కళా సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- అధికారులకు ఆదేశాలు మంత్రి పొన్నం ప్రభాకర్
- గ్రామాలలో ప్రజాపాలనపై మంత్రి పొన్నం సమీక్ష



**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 30 (జనం సాక్షి) :** భీమదేవరపల్లి మండలం లోని పలు గ్రామాలలో "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల సమక్షంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ ప్రజల నుంచి వ్యక్తిగత, గ్రామ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను మంత్రి స్వీకరించి, ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో మూతబడిన ప్రభుత్వ పాఠశాలను ఈ ఏడాదే పునః ప్రారంభించామని తెలిపారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పెయింటింగ్ కూడా చేపడతామని చెప్పారు. బీసీ కాలనీ, రెండు తండాల అభివృద్ధికి సహకరిస్తామని, గ్రామ అవసరాలను ప్రాధాన్యత క్రమంలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పోచమ్మ గుడి అభివృద్ధికి సహాయం చేయాలని గ్రామస్తులు కోరగా, తప్పకుండా సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామాలలోజల సిరి పథకం కింద ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఒక్కో ఇంకుడు గుంతకు ప్రభుత్వం రూ.6,500, పొలం కుంటకు రూ.1.30 లక్షల వరకు సహాయం అందిస్తుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 31 వరకు కొత్త పింఛన్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్ఐవీ బాధితులు తదితర అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, మహిళా సంఘాల రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యనారాయణ రెడ్డి, ఉద్యానవన అధికారి కమలాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కొర్ర గోపాల్ నాయక్, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో చోరీ కలకలం

- 5 తులాల బంగారం, వెండి పట్టీలు మాయం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లిలో చోరీ కలకలం రేపింది. 5 తులాల బంగారం, వెండి పట్టీలు మాయం కావడంతో సుభాష్ కాలనీలో దొంగల భయంతో ఆందోళన చెందుతున్నారు. రాఖీ పండుగకు ఊరికి వెళ్లిన పుల్ల సృజన్ కుటుంబం ఇంట్లో ఈ చోరీ జరిగింది. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ కాలనీలో నివాసం ఉంటున్న ఈ కుటుంబం రాఖీ పండుగకు ఊరికి వెళ్లింది. ఇంట్లో నుంచి కోతులు బయటకు వస్తున్న విషయాన్ని గమనించిన పక్కింటి వారు అనుమానంతో ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి బీరువా తలుపులు తెరిచి ఉండడం గమనించారు. బీరువాలో ఉన్న బ్యాగును దొంగలు ఎత్తుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ బ్యాగులో సుమారు 4 నుంచి 5 తులాల బంగారం, 20 తులాల వెండి పట్టీలతో పాటు 4 నుంచి 5 వేల రూపాయల నగదు ఉన్నట్లు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# సింగరేణిలో ఏఐటీయూసీ పోరాట ఫలితం

- కార్మికులకు రూ.20 లక్షల అదనపు సాయం..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సింగరేణిలో ఏఐటీయూసీ పోరాట ఫలితమే కార్మికులకు రూ.20 లక్షల అదనపు సాయం లభించిందని, 17 ఏళ్ల తర్వాత భారీ అగ్రిమెంట్ సాధించడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల ఆర్థిక, ఉద్యోగ, వైద్య, విద్య, సంక్షేమానికి సంబంధించి మొత్తం 24 అంశాలపై యాజమాన్యంతో సానుకూల ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. 2009 నుంచి పెండింగ్‌లో ఉన్న పెర్క్స్ పై ఆదాయపు పన్ను రీఫండ్‌ను తాజా అగ్రిమెంట్‌లో సాధించామని, దీనివల్ల ఒక్కో కార్మికుడికి ఏడాదికి కనీసం రూ.35 వేలు లాభం చేకూరుతుందని, ఈ మొత్తం 2027 ఏప్రిల్‌లో ఖాతాల్లో జమ అవుతుందన్నారు. సహజ మరణం చెందిన కార్మికుల కుటుంబాలకు అదనంగా రూ.20 లక్షలు అందించేందుకు యాజమాన్యం అంగీకరించిందని, కార్మికులు, యాజమాన్యం మ్యాచింగ్ గ్రాంట్‌లతో బ్యాంకుల ద్వారా చెల్లిస్తారని తెలిపారు. లాభాల వాటాను 40 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తున్నామని, మారు పేర్ల సమస్యకు 7గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేశారన్నారు. మృతుల పిల్లలకు సూటబుల్ ఎంప్లాయిమెంట్, 2012 నుంచి పెండింగ్‌లో ఉన్న ఎన్‌ఓసీ సమస్య పరిష్కారం, కట్ అయిన ఇంక్రిమెంట్ల పునరుద్ధరణ, పెండింగ్ క్యాడర్ స్కీమ్‌ల అమలు, క్లర్క్, సెక్యూరిటీ పోస్టుల పరీక్షలు 2 నెలల్లో నిర్వహణకు యాజమాన్యం అంగీకరించిందని వివరించారు. అలాగే రిఫరల్ వైద్య ఖర్చును కంపెనీయే భరించేలా చర్యలు, కాంట్రాక్ట్ కార్మికుల పిల్లలకు సింగరేణి స్కూళ్లలో ఉచిత విద్య, గత ఏడాది ఫీజు రూ.15 లక్షలు రీఫండ్, సీనియర్ మైనింగ్ సర్దార్లకు ప్రమోషన్లు, భూపాలపల్లి, శ్రీరాంపూర్, కొత్తగూడెంలో సీబీఎస్ఈ పాఠశాలల ఏర్పాటు, రిటైర్డ్ కార్మికులకు రూ.8 లక్షల వైద్య పరిమితి పెంపు, ఓన్ హౌస్ స్కీమ్ కింద నగర్‌లో 200 గజాల స్థలం ఇచ్చేందుకు అంగీకారం కుదిరిందని తెలిపారు. కొత్త గనుల సాధనకు పోరాటం కొనసాగిస్తామని, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరామన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, జి. శ్రీనివాస్, బ్రాంచ్ కమిటీ నాయకులు ఐలయ్య, నాయకులు ఎండి కరీముల్లా, వి. రాజేందర్, డి. శ్రీనివాస్, పి. శ్రీనివాస్, సదయ్య, కాపు కొమరయ్య, క్యాతరాజు సతీష్, కెటిపిపి కొల శ్యామ్, గోవిందుల తిరుపతి, మణి సాగర్, లింగయ్య, కాసర్ల రాజయ్య, సంఘం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విష గుళికలు తిని ఎద్దు మృతి



**నడికుడ ఆగస్టు 30 (జనం సాక్షి) :** నడికూడ మండలం, పులిగిల్ల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. విష గుళికలు తినడంతో ఎద్దు మృతి చెందింది. ఈ ఘటనతో రైతు కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయారు. గ్రామస్తుల వివరాల ప్రకారం పులిగిల్ల గ్రామానికి చెందిన రైతు భాషబోయిన నాగరాజు తన కుటుంబ జీవనాధారంగా వ్యవసాయంతో పాటు పశువులను పెంచు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే అతడికి చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు విష గుళికలు తినడంతో ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురైంది. ఎద్దు పరిస్థితి విషమించడంతో నాగరాజు కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎద్దును కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ పరిస్థితి విషమించి కొద్దిసేపటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత రైతుకు రాష్ట్ర ప్రభుత్వం, ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# భద్రాద్రిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అస్థికల నిమజ్జనం



**చెన్నారావుపేట, ఆగస్టు 30 (జనంసాక్షి) :** ఓరుగల్లు ఉద్యమ నేత, నర్సంపేట అభివృద్ధి ప్రదాత, మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర అస్థికలను ఆదివారం భద్రాద్రి సీతారాముల దివ్య సన్నిధిలో పవిత్ర గోదావరి నదీ తీరాన అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. ఆదివారం దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్న కుటుంబ సభ్యులతో కలిసి చెన్నారావుపేట మండల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర అస్థికలను గంగమ్మ ఒడిలో సమర్పించారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి స్మృతి సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న మాట్లాడారు. ప్రజా జీవితాన్ని తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాన్ని, నర్సంపేట ప్రాంత అభివృద్ధి కోసం చేసిన కృషిని మర్చిపోలేమన్నారు. ప్రజల కోసం జీవితాంతం పరితపించిన నాయకుడిగా పేదలు, రైతులు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ప్రజానాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. గోదావరి గంగమ్మ ఒడిలో పెద్దన్న పవిత్ర అస్థికలను సమర్పిస్తూ కన్నీటి వీడ్కోలు పలికినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్, మాజీ జడ్పిటిసి బానోతు పత్తి నాయక్, మాజీ సొసైటీ చైర్మన్లు చింతకింది వంశీ, మురహరి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు అనుముల కుమారస్వామి, అమ్మ రాజేష్, మాజీ జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, మండల ఉపాధ్యక్షులు కుసుమ నరేందర్, బిఆర్ఎస్వి సీనియర్ నాయకులు మాచర్ల శరత్ చంద్ర, తిమ్మరాయిని పహాడ్ సర్పంచ్ ధారావత్ రమేష్, మండల నాయకులు ములుక సాంబయ్య కవి, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్, మూడు రమేష్, ఉప్పరపల్లి ఉప సర్పంచ్ మంతుర్తి అన్వేష్, కేతిడి జైపాల్ రెడ్డి, మేడి సతీష్, అబ్బిరెడ్డి, మహేందర్, సుమన్, రాజిరెడ్డి, మొర్రి కట్టయ్య, పాల్గొన్నారు.

# రెబ్బెన ఎన్‌టీఆర్ కాలనీలో పోలీసుల విస్తృత తనిఖీలు



**రెబ్బెన, ఆగస్టు30 (జనం సాక్షి):** జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు రెబ్బెన మండలంలోని ఎన్‌టీఆర్ కాలనీలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. రెబ్బెన సీఐ ఎం. సంజయ్ ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి కాలనీలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు భద్రతపై నమ్మకం కల్పించడం, శాంతిభద్రతలను కాపాడటమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులకు తెలియజేయవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే 112కు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని 1908, సైబర్ నేరాలపై 1930కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, బెట్టింగ్ యాప్‌ల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తనిఖీల్లో అక్రమ మద్యం విక్రయాలకు సంబంధించి ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా 40 వాహనాలను తనిఖీ చేసి, నిబంధనలు పాటించని వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ప్రజలు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండి, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటకృష్ణతో పాటు 25 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రైస్‌మిల్ కేసులో బాసర నాయకుల అరెస్ట్

**బాసర , ఆగస్టు 30, (జనంసాక్షి):** ప్రభుత్వ ధాన్యాన్ని రైస్‌మిల్లుల్లో అక్రమంగా విక్రయించారన్న ఆరోపణలపై బాసర గ్రామానికి చెందిన నలుగురిని విజిలెన్స్, సారంగాపూర్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవహారంలో సుమారు రూ.11 కోట్ల ప్రభుత్వ ఆస్తికి నష్టం వాటిల్లిందన్న ఆరోపణలపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న వారిలో బాసర మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దయాల లక్ష్మణరావు, కిర్గుల్ (బీ) మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, అల్లాపూర్ సుధాకర్‌రావు, మల్కన్న యాదవ్ ఉన్నట్లు సమాచారం. వీరిని నిర్మల్‌లోని సబ్‌జైలుకు తరలించినట్లు తెలిసింది. సారంగాపూర్ మండలం ధని గ్రామంలో గల రైస్ మిల్ ద్వారా ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం అప్పగించాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా ధాన్యాన్ని విక్రయించారన్న ఆరోపణలపై ఈ చర్యలు చేపట్టినట్లు తెలిసింది.

# రావణ్‌పల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి దాడి

- ఎద్దు మృతి

**సిర్పూర్ టి, ఆగస్టు 30 (జనం సాక్షి):** మండల పరిధిలో పెద్దపులి సంచారం మరోసారి కలకలం రేపింది. రావణ్‌పల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి దాడి చేయడంతో ఒక ఎద్దు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన రైతు మర్సకోల తెలంగరావుకు చెందిన ఎద్దు, రావణ్‌పల్లి అటవీ ప్రాంతానికి వెళ్లిందని ఈ క్రమంలో అక్కడ పెద్దపులి ఒక్కసారిగా ఎద్దుపై దాడి చేసి హతమార్చిందని తెలిపారు, విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు, సంఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించి, పులి దాడి జరిగిన తీరును నిర్ధారించుకుంటూ పంచనామా నిర్వహించారు. పులి దాడి వల్ల నష్టపోయిన రైతు కి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన నష్టపరిహారం అందేలా ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తూ సిఫార్సు చేయడం జరిగిందని, అధికారులు పేర్కొన్నారు. సిర్పూర్ రేంజ్ పరిధిలో గత కొన్ని రోజులుగా పెద్దపులుల సంచారం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు స్థానిక ప్రజలను హెచ్చరించారు. అటవీ పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సిర్పూర్ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ సూచించారు. అనుమతి లేకుండా ఎవరూ కూడా అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని, ముఖ్యంగా పశువులను అడవి వైపు తోలవద్దని ఆయన స్పష్టం చేశారు.

# ఆత్మల పింఛన్.. ఆప్తుల స్వాహా?

- చనిపోయిన వారికి మంజూరవుతున్న పింఛన్
- కుటుంబ సభ్యులతో నిర్వాహకుల కుమ్మక్కు
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వైనం
- లైవ్ అథెంటికేషన్ ప్రక్రియతో వెలుగులోకి..



**వెంకటాపూర్ (రామప్ప),ఆగస్టు30(జనం సాక్షి):** వెంకటాపూర్ మండలంలో చేయూత పింఛన్ల పంపిణీ వ్యవస్థ గాడి తప్పుతోంది. పింఛన్ల కోసం మండలంలో వేలాది మంది అర్హులు నిరీక్షిస్తుంటే మరోవైపు మృతి చెందిన పింఛన్ దారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్లు జమవుతున్నట్టు సమాచారం. ఇదే అదునుగా భావిస్తున్న పింఛన్ పంపిణీ చేసే నిర్వాహకులు సైతం సంబంధిత పింఛన్ దారుల కుటుంబ సభ్యులతో కుమ్మక్కై గుట్టుగా సదురు డబ్బులను డ్రా చేస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. అధికారుల నిర్లక్ష్యం మూలంగా చనిపోయిన వారి పేరుతో మంజూరవుతున్న పింఛన్ సొమ్మును నొక్కేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్టు వినికిడి. జనన మరణాల రికార్డులను నిర్వహించే అధికారులకు ప్రతి నెలా మృతుల వివరాలను నమోదు చేసుకొని మృతుల పింఛన్లను నిలిపివేసే అవకాశం ఉంటుంది. కానీ సదురు అధికారుల నిర్లక్ష్యం మూలంగా మృతుల వివరాలు నమోదు జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మృతుల పేరుతో మంజూరు అవుతున్న పింఛన్ డబ్బులను నిర్వాహకుల సహకారంతో ఆప్తులు దండుకుంటున్నట్టు తెలుస్తోంది. అయితే మృతుల, ఆచూకి లేని వారి పింఛన్ ను రద్దు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయినప్పటికి వెంకటాపూర్ మండలంలో మాత్రం అధికారులు ఆ దిశగా ముందుకు వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వెంకటాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి గత కొన్నేళ్లుగా వృద్ధాప్య పింఛన్ తీసుకునేవాడు. గత 9 నెలల క్రితం అతడు మృతి చెందాడు. అయినప్పటికి అతడి బ్యాంకు ఖాతాలో "మే "వరకు నెలకు రూ.2016 చొప్పున క్రమం తప్పకుండా నగదు జమైంది. సదురు మొత్తాన్ని పింఛన్ పంపిణీ నిర్వాహకుల సహకారంతో కుటుంబ సభ్యులు డ్రా చేసుకున్నట్టు తెలిసింది. అలాగే మండలంలోని మరో గ్రామానికి చెందిన ఓ మహిళ వితంతు పింఛన్ తీసుకునేది. ఆమె మృతి చెందినప్పటి నుంచి ఆరు నెలలు బ్యాంకు ఖాతాలో పింఛన్ సొమ్ము జమా అయ్యింది. దీంతో అట్టి నగదును సైతం కుటుంబ సభ్యులు డ్రా చేసుకున్నట్టు సమాచారం. ఇటీవల లైవ్ అథెంటికేషన్ కోసం అధికారులు ఫోన్ చేస్తే వారు మృతి చెందినట్లు తెలియటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులను "జనం సాక్షి" వివరణ కోరగా... అలా జరిగినట్టు మా దృష్టికి రాలేదని, సమాచారం అందిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. చాలా వరకు మృతి చెందిన వారి పింఛన్లను జాబితా నుంచి తొలగించామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పింఛన్ పంపిణీ లో భాగంగా నిర్వాహకులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. గ్రామస్థాయిలో అధికారులు ప్రతి నెల జనన –మరణాలను రికార్డుల్లో తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.

# వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకం

- తెలంగాణలో 42 రైల్వే స్టేషన్‌లు ఏకకాలంలో అభివృద్ధి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**వికారాబాద్, ఆగస్టు 30 (జనంసాక్షి) :** ఆదివారం నాడు వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి. ముందుగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.. స్థానిక వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో కొనసాగుతున్న ఆధునీకరణ పనులను కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి పరిశీలించారు. స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణతో పాటు తెలంగాణలోనే 42 రైల్వే స్టేషన్ లు ఏకకాలంలో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి ఆధ్వర్యంలో కవచ్ టెక్నాలజీ ద్వారా ప్రమాదాల నివారణకు దోహదపడుతుందన్నారు. బుల్లెట్ ట్రైన్ మన తెలంగాణకు వస్తే దేశంలోనే ప్రథమ స్థానంలో తెలంగాణ నిలుస్తుందన్నారు. బుల్లెట్ ట్రైన్ నడవడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు పూర్తిగా నివారించవచ్చు అన్నారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ 27 కోట్ల తో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ నుండి ప్రయాణికులు ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా ప్రయాణించగలుగుతారన్నారు.

వికారాబాద్ స్టేషన్ లో ఫోర్ విల్లర్ పార్కింకింగ్ 50కి పెంచడం జరిగిందన్నారు. టు వీలర్ పార్కింకింగ్ 150కి పెంచడం జరిగిందన్నారు. రైల్వే స్టేషన్లో ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్కలేటర్.2 లిఫ్టులు. మరియు క్యాంటీన్ దివ్యాంగులకు ఆధునిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం చివరి వరకు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అండర్ బ్రిడ్జి సమస్యలు తొలగించడం కొరకు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తో కలిసి సెంట్రల్ రైల్వే మినిస్టర్ గారితో సమస్య పరిష్కరిస్తామన్నారు, అతి తక్కువ కాలంలోనే నేషనల్ హైవే పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. ప్రయాణికులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణలో రైల్వే రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని, ఆధునీకరణ పనులు పూర్తయిన తర్వాత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని ఆయన పేర్కొన్నారు.

అనంతరం ప్రెస్ మీట్ నిర్వహించారు..ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, రైల్వే డివిజనల్ మేనేజర్ సికింద్రాబాద్ ఆర్. గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, బిజెపి మెడికల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, దిశా కమిటీ సభ్యులు వడ్ల నందు, బిజెపి జిల్లా అధ్యక్షులు రమేష్, కేయస్.రత్నం, ఎమ్మార్వో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో పేద ప్రజల కళ్ళల్లో ఆనందం



**మోమిన్‌పేట, ఆగస్టు 30 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో పేద ప్రజల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుందని, ప్రజాపాలన ప్రభుత్వంలోజూ అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని, సయ్యద్ అలీపూర్ గ్రామ సర్పంచ్ లలిత జైపాల్ పేర్కొన్నారు, ఆదివారం మోమిన్ పేట మండలంలోని సయ్యద్ అలీపూర్ గ్రామంలో పట్లోళ్ల పద్మమ్మ లక్ష్మారెడ్డి దంపతుల ఇందిరమ్మ ఇల్లును పారు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారు లందరికీ మంజూరు చేయడం జరిగిందన్నారు , గతంలో 10 సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేకపోయిందని, తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, నాయకత్వంలో గ్రామాల్లోని అనేక మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు, ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంకు మేనేజర్ నారాయణ రెడ్డి, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వెంకట్ రెడ్డి, రామ్ రెడ్డి, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** ఆగస్టు 31 వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.

ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం ఆర్డీవోకార్యాలయంలో,జిల్లాలోని అన్నీ మండల పరిషత్ కార్యాలయాలలో ప్రజావాణి నిర్వహించబడుతుందని తెలిపారు.కావున ప్రజలు ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో ఆదివారం కోరారు.

## సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించే వరకు పోరాడుతాం



**సూర్యాపేట, ఆగస్టు 30 (జనంసాక్షి) :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధన సమితి అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా 17వ రోజు ఆదివారం అంగన్వాడీ మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రాష్ట్రాల రాజధానుల మధ్యలో ఉన్న సూర్యాపేట పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా రైలు మార్గాన్ని సాధించుకోలేకపోతున్నామని అన్నారు.మొదట ప్రకటించిన విధంగా సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ దీక్షలో భాస్కరమ్మ, వసంత,ఏకలక్ష్మి సంతోషకుమారి, వెలుగు వనిత, పాల్గొన్నారు.ఈ దీక్షకు బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకిరెడ్డి, రమణాచారి, ధర్మార్జున్,డేవిడ్ కుమార్, సిఐటియు నాయకులు కోటగిరి వెంకట నారాయణ,నెమ్మాది వెంకటేశ్వర్లు,మట్టిపెల్లి సైదులు, జీడి బిక్షం, నవిలే ఉపేందర్,విద్యాసాగర్ రావు, నారబోయిన వెంకట్ యాదవ్, యాదయ్య,సట్టు నాగయ్య సంఘీభావం తెలిపారు.

## దేవాలయ భూమికి ఫెన్సింగ్

**కేశంపేట, ఆగస్టు 30 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని శ్రీ దవల గిరి వెంకటేశ్వర స్వామి ఆలయ భూమికి ఆదివారం ఫెన్సింగ్ వేశారు. గ్రామానికి చెందిన దాతలు గూడ రామ్మోహన్ రావు, తలసాని పవన్ కుమార్ రెడ్డి, పిల్లి అమరేష్ తమ సొంత డబ్బులతో 5.20 ఎకరాల ఆలయ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం మాట్లాడుతూ... ఆలయ భూమి అన్యాక్రాంతం కాకుండా దాతలు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామస్తులు, భక్తులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంచె కృష్ణయ్య, తలసాని రమణారెడ్డి, పోలెమోని సతీష్, కడియాల అంజయ్య, నాగేష్, చాకలి రాములు, రవీందర్, భోగ దశరథ, మల్లేష్ పాల్గొన్నారు.

## సీతారామ నిర్వాసితుల సమరశంఖం

- రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ 25 లక్షలు ఇవ్వాల్సిందే
- కామేపల్లిలో గర్జించిన భూ రైతులు



**కామేపల్లి, ఆగస్టు 30 (జనంసాక్షి) :** సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల భూములు కోల్పోయిన రైతాంగానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ 25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని భూ నిర్వాసితుల సంఘం,తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని కామేపల్లి మండల కేంద్రంలో రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బాధితులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. డిమాండ్లతో కూడిన బ్యానర్లు పట్టుకుని ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు,జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్గి కృష్ణ.బాదావత శ్రీను నాయక్ మాట్లాడుతూ 2019లో ప్రభుత్వం ప్రకటించిన పాత పరిహారం అవార్డు ఎంత మాత్రం సమంజసంగా లేదన్నారు.వెంటనే ఆ పాత అవార్డును రద్దు చేసి,పెరిగిన ధరలకు అనుగుణంగా ఎకరాకు రూ 25 లక్షల పరిహారం ప్రకటించాలని కోరారు.నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందేంత వరకు తమ పోరాటం ఆగదని, రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీతారామ ప్రాజెక్టు బాధితులు,రైతు సంఘాల ప్రతినిధులు,స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే జారే



**చంద్రుగొండ, ఆగస్టు 30 (జనం సాక్షి) :** విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ఆదివారం చంద్రుగొండ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, డీఏలను త్వరితగతిన అందేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు జీతాల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు.తాను గతంలో ఉపాధ్యాయుడిగా, పీడీగా పనిచేసినందున ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు తనకు తెలుసునని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వారి సాధకబాధకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తున్నానని తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణంలో గురుతర బాధ్యతను చేపట్టి, భవన నిర్మాణానికి పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించడంతో పాటు విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు సంఘాల అధ్యక్షుడు కాళ్లూరి సుధాకర్‌రావు, పద్మావతి దంపతులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే జారే ఆదినారాయణను జిల్లా అధ్యక్షుడు వెస్లీ, సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు బి. కేశవరావు, కేసీఎస్ చౌదరి, జి. రాజేందర్, అజయ్‌కుమార్, స్వామిదాస్, శేషగిరిరావు, జి. వెంకటేశ్వర్లు, రాములు, ఎన్. నరసయ్య, ఆర్. వెంకటేశ్వరరావు, ఆనంద్‌కుమార్, ప్రసాద్‌రావు, సూర్యనారాయణ, నారాయణ, ఎం.ఎం. చారి, పులి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో అక్రమ మట్టి తరలింపుపై పోలీసుల మెరుపు దాడి

- రెండు టిప్పర్లు సీజ్

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30 (జనం సాక్షి) :** మండల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న ముఠాలపై ఇబ్రహీంపట్నం పోలీసులు ఉక్కుపాదం మోపారు. శనివారం రాత్రి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని గోశాల సమీపంలో పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో భారీగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.నిబంధనలకు విరుద్ధంగా, ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఆ రెండు వాహనాలను వెంటనే అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ సంపదను కొల్లగొడుతూ, అక్రమంగా మట్టి మరియు ఇసుక రవాణాకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దీని వెనుక ఉన్న సూత్రధారుల వివరాలపై దర్యాప్తు వేగవంతం చేసినట్లు ఇబ్రహీంపట్నం పోలీసులు వెల్లడించారు.

# మహిళా సాధికారతకు సత్యసాయి సేవా సమితి కృషి

- మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ
- సర్పంచ్ రేణుక దేవి కిషన్ రావు



**యాలాల, అగస్టు 30 (జనంసాక్షి) :** శ్రీ సత్యసాయి సేవా సమితి, రంగాపూర్, తాండూర్, వికారాబాద్ జిల్లా సేవా సమితి వారి ఆధ్వర్యంలో గత 45 రోజులుగా యాలాల మండలం దేవనూర్ గ్రామంలో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ శిక్షణలో పాల్గొని పూర్తి శిక్షణ పొందిన దేవనూర్ గ్రామ మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ రేణుక దేవి కిషన్ రావు హాజరై, శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి ఉచిత శిక్షణా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, సత్యసాయి సేవా సమితి వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. మహిళలు నేర్చుకున్న ఈ విద్యను సద్వినియోగం చేసుకొని కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు.ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి బృందం సభ్యులు మాట్లాడుతూ.. ప్రేమతత్వం, సేవాభావంతోనే సమాజ సేవ చేస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనాయకులు కిరణ్ కుమార్, సంగెం రవి, మొగులాలి, కుర్వ రమేష్, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన మినీ వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు

**మోత్కూర్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వడ్ల లోడ్‌తో భువనగిరి వైపు నుంచి మోత్కూర్ వైపు వస్తున్న మినీ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్ డ్రైవర్ కుర్మిల్ల నరేష్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన నరేష్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వ్యాన్ అదుపుతప్పడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందా, ఆస్తి నష్టం ఎంతమేర జరిగిందనే వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

## క్రీడా స్ఫూర్తితో గెలపోటములను స్వీకరించాలి



**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** ఉమ్మడి ఖమ్మం జిల్లా ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలు చివరి రోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా క్రీడల అధికారి బి. గోపాల్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ ఐఏఎస్, డిప్యూటీ డైరెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చివరి రోజు జరిగిన పోటీల సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి రాహుల్ మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని అన్నారు. గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గతంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించిన సందర్భాలు అరుదని, ప్రస్తుతం ప్రాజెక్ట్ అధికారి చొరవతో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల పాల్గొన్న వారు హర్షం వ్యక్తం చేశారు. హోరాహోరీగా సాగిన వాలీబాల్ పోటీలలో ఏకలవ్య విన్నర్స్ గా నిలవగా రన్నర్స్ గా భద్రాచలం జట్టు గెలుపొందింది. అదేవిధంగా షటిల్ మరియు క్యారమ్స్ లో ఏటిడిఓ దమ్మపేట మొదటి స్థానాన్ని, భద్రాచలం రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటిడిఓలు ఎస్. చంద్రమోహన్, ఇల్లందు భారతీదేవి, భద్రాచలం రాధమ్మ, కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ హెచ్‌ఎం ఎన్. చందు, పీఈటీలు, పీడీలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రమజీవుల చెంతకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**బోనకల్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** మండుటెండను సైతం లెక్కచేయకుండా రోజంతా పొలంలో చెమటోడ్చి పనిచేసిన ఆ శ్రమజీవులకు.. ఆదివారం ఓ మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాయన్నపేట శివారుల్లో కనిపించిన ఓ అరుదైన దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకింది. నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. హంగూ ఆర్భాటాలకు దూరంగా, నేరుగా పంట పొలాల్లో కూలీ పనులు చేస్తున్న మహిళల వద్దకు వెళ్లారు. మధ్యాహ్న భోజనానికి సిద్ధమవుతూ క్యారేజీలు విప్పుకుంటున్న ఆడబిడ్డల మధ్యకు ఆయన ఓ సొంత అన్నలా అడుగులు వేశారు. హోదాను పక్కన పెట్టి.. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. "ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మీ ఇళ్లకు అందుతున్నాయా తల్లులారా?" అంటూ ఆప్యాయంగా పలకరించారు. అధికారపు హంగులు, ఆర్భాటాలు లేకుండా.. వారితో ఆత్మీయత మాట్లాడారు. భట్టి విక్రమార్కను తమ మధ్య చూసిన ఆ మహిళల ముఖాల్లో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం తమ జీవితాల్లో వచ్చిన మార్పులను చెబుతూ వారు భావోద్వేగానికి లోనయ్యారు. "ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యంతోనే ఇంట్లో సంతోషంగా అన్నం వండుకుని తింటున్నాం.. మా పిల్లపాపలు కడుపునిండా అదే అన్నం తింటున్నారు" అని చెప్పినప్పుడు వారి మాటల్లో కనిపించిన తృప్తి.. సంక్షేమ పథకాల అసలైన అర్థాన్ని కళ్లముందు నిలిపింది. కరెంటు బిల్లుల గురించి అడిగినప్పుడు.. "మాకు రూపాయి బిల్లు కూడా రావడం లేదు సార్.. ప్రభుత్వమే ఉచితంగా ఇస్తోంది" అని వారు చెప్పిన మాటల్లో.. ఎన్నాళ్లుగానో మోస్తున్న ఆర్థిక భారాన్ని దించుకున్న నిశ్చింత స్పష్టంగా కనిపించింది. ఇటీవల హైదరాబాద్‌కు కూలీ పనుల కోసం వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకున్న ఆ మహిళలు.. ఉచిత బస్సు ప్రయాణం తమకు ఎంతగానో ఉపయోగపడిందని ఆనందంగా చెప్పారు. ప్రయాణ ఛార్జీల కోసం ఖర్చయ్యే డబ్బు మిగలడం.. తమ కుటుంబ అవసరాలకు ఎంతో ఆసరాగా మారిందని కృతజ్ఞతతో తెలిపారు. ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం అందిస్తున్న పథకాలు మా జీవితాల్లో నిజమైన వెలుగులు నింపుతున్నాయని శ్రమజీవులు ఆనందంగా చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మీరు ఉచితంగా పొందుతున్న ప్రతి పథకానికి మీ తరఫున ఆర్థిక శాఖ ఆయా శాఖలకు క్రమం తప్పకుండా నిధులు చెల్లిస్తోంది. ప్రజల అవసరాలను గుర్తించడం.. ఆ అవసరాలను తీర్చడం.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఈ ప్రజాప్రభుత్వం అసలైన బాధ్యతని చెప్పారు.







# ఈ వారమూ ఐపీఓల సందడి..

## 7 ఇష్యూలు.. 8 లిస్టింగ్‌లు

ప్రైమరీ మార్కెట్‌లో ఈ వారమూ ఐపీఓల సందడి కొనసాగనుంది. మెయిన బోర్డు, ఎస్‌ఎంఈ కేటగిరీలో మొత్తం ఏడు కంపెనీలు సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. దీంతో పాటు ఎనిమిది మెయిన్‌బోర్డు ఐపీఓలు స్టాక్ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఆ వివరాలు చూసేద్దాం..పర్పుల్ స్టైల్ ల్యాబ్స్ ఐపీఓ ఆగస్టు 31న సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది. సెప్టెంబర్ 2న ముగియనుంది. పూర్తి ఫ్రెష్ ఇష్యూ రూపంలో రూ.680 కోట్లు కంపెనీ సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.546–రూ.575గా నిర్ణయించింది.రేస్ ఆఫ్ బిలీఫ్ ఐపీఓ సెప్టెంబర్ 1న ప్రారంభమై 3న ముగియనుంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.125 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.227–రూ.239గా నిర్ణయించింది.దీపా జువెలర్స్ ఐపీఓ సెప్టెంబర్ 1న ప్రారంభమై 3న ముగుస్తుంది. మొత్తం రూ.459.72 కోట్లు సమీకరించనుంది. ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిధుల సమీకరణ జరగనుంది. ధరల శ్రేణిని రూ.168– 177గా కంపెనీ నిర్ణయించింది.ఎస్‌ఎంఈ కేటగిరీలో: అశుతోష్ ఫైబర్ ఐపీఓ (రూ.56.35 కోట్లు) శాంతి ఇనార్గానిక్స్ (రూ.47.24 కోట్లు), ఫైకెమ్ టెక్నాలజీస్ (రూ.14.58 కోట్లు) ఐపీఓలు ఆగస్టు 31న సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. ఫార్మ్‌పీస్ ఐపీఓ సెప్టెంబర్ 1న ప్రారంభం కానుంది. రూ.32 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది.లిస్టింగ్‌లు ఇవీ: మెయిన్‌బోర్డు కేటగిరీలో అగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్, హై–టెక్ ఇంజినీర్స్ లిమిటెడ్, స్కైవేస్ ఎయిర్‌సర్వీసెస్, సింబియోటెక్ ఫార్మాలాబ్, అన్ను ప్రాజెక్ట్స్, లుమినో ఇండస్ట్రీస్, ఈఎస్‌డీఏస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ప్రయారిటీ జువెల్స్ ఈ వారం లిస్ట్ కానున్న కంపెనీల జాబితాలో ఉన్నాయి.

# ఏథర్ ఎనర్జీ నుంచి కోణార్క్ స్కూటర్

**ప్రారంభ ధర రూ.99,999**

బెంగళూరు: విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ కోణార్క్‌ను విడుదల చేసింది. మూడు వేరియంట్లు– ఎస్100, ఎస్125, ఎస్160లో తీసుకొచ్చిన ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ల ధర రూ.99,999 (ఎక్స్‌షోరూం, బెంగళూరు) నుంచి ప్రారంభం అవుతుంది. సెప్టెంబరు నుంచి వీటి డెలివరీలు మొదలవుతాయని పేర్కొంది. ఏథర్ కొత్తతరం ఈఎల్ ఫ్లాట్‌పామ్‌పై తయారైన మొట్టమొదటి స్కూటర్ ఇదే కావడం గమనార్హం. ఈ ప్లాట్‌పామ్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.400–500 కోట్లను వెచ్చించినట్లు కంపెనీ తెలిపింది. ఈఎల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌బోర్డ్ ఛార్జింగ్, ఏఈబీఎస్, 10,000 కి.మీ సర్వీస్ ఇంటర్వెల్స్ లాంటి కొత్త

# విద్యుత్తు స్కూటర్లకు భారీ గిరాకీ..

- **కావాలంటే 2 నెలలు ఆగాల్సిందే**
- **ఇటీవల పెరిగిన డిమాండ్ వల్లే**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రజాదరణ ఎక్కువగా ఉండే కార్లకు వేచిచూసే సమయం ఉండడం మామూలే. అయితే ఇపుడా పరిస్థితి విద్యుత్ స్కూటర్లలోనూ కనిపిస్తోంది. వీటికి గిరాకీ పెరుగుతుండడంతో పాటు, అందుకు తగ్గట్లుగా ఉత్పత్తి లేకపోవడంతో షోరూముకు వెళ్లి కొత్త స్కూటర్‌ను వెంటనే తీసుకొచ్చే రోజులు పోయాయి. కనీసం 3 వారాల నుంచి గరిష్ఠంగా 2–3 నెలల వరకూ ఆగాల్సి వస్తోంది. దాదాపు అన్ని ప్రముఖ బ్రాండ్లకూ వేచిచూసే సమయం పెరిగింది. ముఖ్యంగా కొనుగోలుదార్ల ఆసక్తి ఎక్కువగా ఉండే మోడళ్లు, వినియోగదార్లకు నచ్చిన రంగుల వేరియంట్‌లకు ఉన్న గిరాకీకి తగ్గట్లుగా వెయిటింగ్ కూడా పెరుగుతోంది. దీంతో కంపెనీలు తయారీ సామర్థ్యాలను పెంచుకునే పనిలో పడ్డాయి. అయితే అందుకు 1–2 ఏళ్ల వరకు సమయం పడుతుంది. 'కొద్ది నెలలుగా అన్ని విద్యుత్ ద్విచక్ర వాహన బ్రాండ్లకు వేచిచూసే సమయం పెరిగింది. అయితే నగరం, బ్రాండ్, వేరియంట్‌ను బట్టి ఇది కాస్త అటూఇటూగా ఉంటోంద'ని వాహన డీలర్ల సంఘాల సమాఖ్య(ఫాడా) ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ అంటున్నారు. వేర్వేరు ధరల వద్ద వేర్వేరు వేరియంట్లు లభిస్తుండడంతో వినియోగదార్లు ఎంచుకు నేందుకు ఎక్కువ ఆప్షన్లు కనిపిస్తున్నాయి. అదీకాక పశ్చిమాసియాలో యుద్ధం పుణ్య మాని పెట్రోలు ధరలపై అనిశ్చితి ఏర్పడడంతో సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్(ఐసీఈ) వాహ నాల నుంచి ఈవీలవైపు విని యోగదార్లు మళ్లుతున్నారు. చాలా వరకు డీలర్ల వద్ద నిల్వలు ఎక్కువగా ఉండ దం లేదు. పరిమిత రం గుల వేరియంట్లే లభ్యమవుతున్నాయి. దీం తో ఎక్కువ కాలం వేచిచూసే ఓపికలేని వారు తమకు అందుబాటు లో ఏది ఉందో అదే కొనేస్తు న్నారు. గిరాకీ ఎంతలా పెరిగిందో ఈ క్యాలెండర్ సంవత్సరంలో విక్రయాలే చెబుతున్నాయి. 2025 మొత్తం మీద 13.4 లక్షల వాహనాల అమ్మకాలు జరగ్గా, ఈ ఏడాదిలో ఇప్పటికే 11.8 లక్షల విద్యుత్ ద్విచక్రవాహనాలు విక్రయ మయ్యాయి. మొత్తం ద్విచక్ర వాహ నాల్లో ఈవీల వాటా 11 శాతంగా ఉం డగా, స్కూటర్ల విభాగంలో ఇది 25 శాతంపైగా చేరడం ఈ విభాగంలో గిరాకీని తేటతెల్లం చే స్తోంది.



**గిరాకీకి తగ్గట్లు ఉత్పత్తి కష్టంగానే..**

ఈ పరిస్థితి చే దు మిఠాయిలా ఉందని ఏథర్ ఎనర్జీ సీఈఓ తరుణ్ మెహతా అంటున్నారు. కంపెనీ సరఫరా సామర్థ్యంతో పోలిస్తే గిరాకీ ఎపుడూ అధికంగానే కొనసాగుతోందన్నారు. త్రైమాసిక ప్రీ ఆర్డర్లు ఏడాది కిందటితో పోలిస్తే 158% పెరిగి 1,50,000 వాహనాలకు చేరగా, ఉత్పత్తి 83,000 వద్ద ఉందని ఆయన వివరించారు. ఇక డీలర్ల వద్ద నిల్వలు తొలి త్రైమాసికంలో 14 రోజుల నుంచి 3 రోజులకు తగ్గాయన్నారు. ప్రతీ నెలా చాలా రాష్ట్రాల నుంచి 50,000 వరకు ప్రీఆర్డర్లు వస్తున్నాయి. దీంతో డీలర్లు తాజా బుకింగ్‌లను ఆర్డర్లు ఆపేస్తున్నారు. ఎందుకంటే వేచిచూసే సమయం 2 నెలలు, అంతకు మించి చేరుతోందని మెహతా అంటున్నారు. సామర్థ్య విస్తరణలో.. గిరాకీ–సరఫరా అంతరాన్ని పూడ్చడానికి కంపెనీలు నడుం బిగించాయి. టీవీఎస్ స్కూటర్ నెలవారీ విద్యుత్ స్కూటర్ల ఉత్పత్తిని ప్రస్తుత 40,000 నుంచి 50,000కు చేర్చుతోంది. బజాజ్ ఆటో 50,000 వాహనాల నుంచి 60,000కు పెంచుతోంది. ఏథర్ ఇప్పటికే హోసూర్ ప్లాంటును 35,000 యూనిట్ల నెలవారీ పూర్తి సామర్థ్యంతో నడుపుతోంది. మహారాష్ట్రలో కొత్త ఫ్యాక్టరీ మూడో త్రైమాసికంలో అందుబాటులోకి వస్తే వార్షిక సామర్థ్యానికి 5,00,000 యూనిట్లు జతచేరుతాయి. గిరాకీ ప్రస్తుత వేగంతో కొనసాగితే, అప్పటికి ఆ ఉత్పత్తీ సరిపోకపోవచ్చు.

# త్వరలో అంతర్జాతీయ మార్కెట్లోకి లలితా జువెలరీ

**దక్షిణాది రాష్ట్రాల్లో కొత్తగా 110 స్టోర్లు**


**హైదరాబాద్:** తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) పూర్తి చేసుకున్న ఆభరణాల విక్రయ సంస్థ లలితా జువెలరీ మార్ట్ లిమిటెడ్ వ్యాపార విస్తరణపై పూర్తి స్పష్టతతో ముందుకు సాగుతోందని సంస్థ సీఎండీ ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. శనివారమిక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల్లో రిటెయిల్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించడంతోపాటు, అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం తమకు 64 షోరూములున్నాయని, వీటికి అదనంగా మరో 110 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. 2027 మార్చి నాటికి కనీసం 10 స్టోర్లకు పైగా ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. దక్షిణాదిలో 175 షోరూములకు చేరుకోగానే ఉత్తర భారత్‌కు విస్తరిస్తామని వెల్లడించారు. ఇందులో తొలుత మహారాష్ట్ర, ఆ తర్వాత ఉత్తరప్రదేశ్, ఢిల్లీ మార్కెట్లు ఉంటాయన్నారు.

**మలేషియా, సింగపూర్‌లో..:** వచ్చే 2–3 నెలల్లో మలేషియాలో షోరూమును ప్రారంభించబోతున్నట్లు కిరణ్ కుమార్ వెల్లడించారు. ఆ తర్వాత సింగపూర్ మార్కెట్లోకి అడుగుపెడతామని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఉన్న భారతీయ, ఆసియా వినియోగదారులకు నాణ్యమైన ఆభరణాలను, అత్యుత్తమ ధరకే అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.అధిక లాభాలు ఆశించకుండా, తక్కువ లాభంతో ఎక్కువ విక్రయాలు సాధించడమే సంస్థ ప్రధాన వ్యూహమని ఆయన వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో 58 షోరూముల ద్వారా రూ.25,000 కోట్ల మొత్తం ఆదాయం, రూ.1,000 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో స్టోర్ల సంఖ్య పెరిగిన కొద్దీ విక్రయాల విలువ మరింత వృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమకు 9 లేదా 14 క్యారెట్ల బంగారం విక్రయించే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. 22 క్యారెట్ల పసిడి ఆభరణాలనే విక్రయిస్తామన్నారు. తమ వద్దకు వస్తున్నవారిలో 60% పాత బంగారం మార్పిడి చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పసిడి ధరలపై..: 'నేను వ్యాపారం మొదలుపెట్టినప్పుడు గ్రాము రూ.280 ఉండేది. కరోనా సమయంలో కిలో బంగారం రూ.48 లక్షలకు చేరింది. ఇప్పుడు దాదాపు రూ.1.63 కోట్ల దరిదాపుల్లో ఉంది. బంగారం ధర ఎప్పుడూ వృద్ధి దశలోనే ఉంటుంది. కాబట్టి, పసిడిని అత్యంత సురక్షితమైన సాధనంగా చూడాల'ని ఆయన సూచించారు.

# అక్రమ జూద రాకెట్‌లో భారతీయ మూలాలున్న రాజకీయ నాయకుడు

అమెరికా లోని న్యూజెర్సీ లో భారతీయ మూలాలున్న రాజకీయ నాయకుడు ఆనంద్ షాను ఎటువంటి పదవులు తీసుకోకుండా నిషేధం విధించారు. రాకెటరింగ్, మనీ లాండరింగ్ ఇతర అక్రమ కార్యక్రమాల్లో ఆయన పేరు బయటకు వచ్చింది. ఇటాలియన్–అమెరికన్ నేరముఠాలతో సంబంధాలున్నట్లు ఆయన ఒప్పుకొన్నాడు. దాదాపు మిలియన్ డాలర్ల సొమ్మును ఈ ముఠా నుంచి సంపాదించినట్లు తేలింది. దీనిలో కొంత మొత్తం తన రాజకీయ ప్రచారానికి వినియోగించాడు. ఆనంద్‌షా ఈ జూదపు ముఠాలో స్పోర్ట్స్ బుక్ ఏజెంట్, పోకర్ మేనేజర్‌గా వ్యవహరించేవాడు. ఈ క్రమంలో 9,00,084 డాలర్లు సంపాదించాడు. అతడి నేరాలకు 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఈ ఏడాది డిసెంబర్ 4వ తేదీన పూర్తి స్థాయి శిక్షను ఖరారు చేయనున్నారు.






# ఈక్విటీలు, డిపాజిట్లపైనే ఆసక్తి

**పొదుపు అలవాట్లు మారుతున్నాయి**

**బ్యాంకు ఖాతాల్లో భారీగా చేరిన సగటు నిల్వ**

**హైదరాబాద్:** భారతీయ కుటుంబాల పొదుపు ధోరణిలో విప్లవాత్మక మార్పు వస్తోంది. గతంలో సామాన్యులు తమ కష్టార్జితాన్ని భూమి, బంగారం వంటి భౌతిక ఆస్తుల్లో దాచుకునేందుకు మొగ్గు చూపేవారు. 'జేఎమ్ ఫైనాన్షియల్' తాజా నివేదిక ప్రకారం.. ఇప్పుడు ప్రజలు సంప్రదాయ ఆస్తులకంటే షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బ్యాంకు డిపాజిట్ల వంటి ఆర్థిక సాధనాల్లో మదుపు చేసేందుకు మొగ్గు చూపిస్తున్నారు. కొవిడ్ మహమ్మారి తర్వాత ఈ ధోరణి మరింత పెరిగింది. కుటుంబాల పొదుపులో ఆర్థిక ఆస్తుల వాటా 2005లో 39.5% కాగా, 2024 నాటికి ఇది 44.7 శాతానికి పెరిగింది. బ్యాంకుల్లో కొత్త ఖాతాల సంఖ్య కంటే ఇప్పటికే ఉన్న ఖాతాల్లో నగదు నిల్వలు గణనీయంగా పెరుగుతున్నాయి. 2026 మార్చికి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల సంఖ్య 1.8% వృద్ధితో 261.7 కోట్లకు చేరుకుంది. కానీ, డిపాజిట్ల విలువ 9.7% వార్షిక వృద్ధితో ఏకంగా రూ.134.8 లక్షల కోట్లకు చేరింది. ఒక్కో బ్యాంకు ఖాతాలో ఉండే సగటు 7.7% వృద్ధితో రూ.51,494కు పెరిగింది. ప్రజలు సాధారణ బ్యాంకు ఖాతాల్లోనే పెద్ద మొత్తంలో నగదు



ఉంచుతున్నారు.బ్యాంకింగ్ వ్యవహారాల్లో పురుషులతో పోలిస్తే, మహిళల వాటా వేగంగా పెరుగుతోంది. 2019–26 మధ్య మహిళల బ్యాంకు ఖాతాలు 8.5% వార్షిక వృద్ధి రేటు నమోదు చేశాయి. వారి ఖాతాల్లోని డిపాజిట్ల విలువ 13.4% పెరిగింది. ఇదే కాలంలో పురుషుల ఖాతాల వృద్ధి 3.1%, డిపాజిట్ల వృద్ధి 7.5 శాతంగా ఉంది. మొత్తం వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో మహిళల వాటా 41 శాతానికి చేరింది. దేశంలో ప్రస్తుతం మహిళలకు 107.4 కోట్ల బ్యాంకు ఖాతాలుండగా, అందులోని డిపాజిట్ల విలువ రూ.55.5 లక్షల కోట్లు. పురుషుల డిపాజిట్ల విలువ రూ.79.3 లక్షల కోట్లుగా ఉంది.సాధారణ పెట్టుబడిదారులు నేరుగా షేర్లు కొనడానికి బదులు మ్యూచువల్ ఫండ్ల ద్వారా మార్కెట్లో అడుగుపెడుతున్నారు. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో మ్యూచువల్ ఫండ్ల యాజమాన్య వాటా 2024–25లో 10.2% అయితే 2025–26లో 11.3 శాతానికి విస్తరించింది. నేరుగా షేర్లు కొనే మదుపరుల వాటా 9.9% నుంచి 9.4 శాతానికి తగ్గింది. 2014లో మ్యూచువల్ ఫండ్ల వాటా 3.4 శాతమే.చిన్న మదుపరులు క్రమానుగత పెట్టుబడి విధానాన్ని (సిప్) ఎంతో ఇష్టపడుతున్నారు. వార్షిక సిప్ చెల్లింపులు 20.8% వృద్ధితో రూ.3.49 లక్షల కోట్లకు చేరాయి. నెలవారీ సిప్ ప్రవాహం 2016 జూన్‌లో రూ.3,310 కోట్లు కాగా, 2026 జూన్‌లో రూ.31,780 కోట్లకు చేరింది. మ్యూచువల్ ఫండ్ల పోర్ట్‌ఫోలియోల సంఖ్య 16.8% వృద్ధితో 27.4 కోట్లకు చేరింది. ఇందులో రిటెయిల్ మదుపరుల వాటా 90.5%. అధిక నికర విలువ ఉన్న వ్యక్తుల (హెచ్‌ఎన్ఐ) వాటా 8.9 శాతానికి పెరిగింది.వ్యక్తిగత డీమ్యాట్ ఖాతాలు 17.6% వార్షిక వృద్ధితో 22.5 కోట్లకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం ఈ విభాగ వృద్ధి రేటు 26.7 శాతంతో పోలిస్తే ఈ ఏడాది కొంత తగ్గినా, కొత్త ఖాతాలు ప్రారంభమవుతూనే ఉన్నాయి. డీమ్యాట్ ఖాతాల్లో 30 ఏళ్లలోపు వారి పెట్టుబడులే 38.4%. మొత్తం మీద మార్కెట్ పెట్టుబడిదారుల సగటు వయసు 35.8 ఏళ్ల నుంచి 36.1 ఏళ్లకు పెరిగింది.

**పీఎంఎస్ సేవల కోసం..**

హెచ్‌ఎన్ఐలు ప్రత్యేక సలహాదారుల సేవలతో కూడిన పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్)కు ప్రాధాన్యం ఇస్తున్నారు. పీఎంఎస్ ఆస్తుల విలువ (ఏయూఎం) 10.4% పెరిగి, రూ.35.1 లక్షల కోట్లకు చేరింది. ఈ తరహా పెట్టుబడిదారుల సంఖ్య 8.8% పెరిగి 2.08 లక్షలకు చేరుకోగా, వారి సగటు మదుపు పరిమాణం రూ.16.88 కోట్లకు పెరిగింది.

# ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడులకు మద్దతిస్తాం: టెమాసెక్

**ఢిల్లీ:**ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడులకు తాము మద్దతు ఇస్తామని సింగపూర్ ప్రభుత్వ వెల్త్‌ఫండ్ అయిన టెమాసెక్ తెలిపింది. నష్టాల్లో ఉన్న ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టిన పెట్టుబడులపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో టెమాసెక్ పై ప్రకటన చేసింది. ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా ఉండగా.. మిగిలిన వాటా టాటా సన్స్ వద్ద ఉంది. 2022 జనవరిలో భారత ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను టాటా సన్స్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో టెమాసెక్ వాటాదారుగా ఉంది. టాటా సన్స్ గ్రూపు భారీ స్థాయిలో చేపడుతున్న ఎయిరిండియా నవీకరణ ప్రక్రియ సంక్లిష్టమైనదే కాకుండా, పలు సంవత్సరాలు కొనసాగుతుందని, అనుసంధానపరంగా సవాళ్లు ఉంటాయని టెమాసెక్ అభిప్రాయపడింది. 'ముఖ్యంగా విమానయాన రంగంలో ఇలాంటి ప్రక్రియకు సమయం పడుతుంది. గగనతల ఆంక్షలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, ఇంధన ధరల్లో అస్థిరత లాంటి పలు బాహ్య అంశాలపై ఇది ఆధారపడి ఉండటమే ఇందుకు కారణమ'ని తెలిపింది. సింగపూర్ బయట దీర్ఘకాలిక వృద్ధిని సాధించేందుకు, రెండో హబ్‌గా భావిస్తున్న భారత్‌లో పెట్టుబడులు పెట్టడాన్ని కొనసాగిస్తామనే విషయాన్ని సింగపూర్ ఎయిర్‌లైన్స్ స్పష్టం చేసినట్లు వెల్లడించింది. అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలో మూడో అతిపెద్ద విమాన రవాణా మార్కెట్‌గా ఉన్న భారత్ తమకు రెండో ప్రధాన కేంద్రంగా సేవలు అందించే స్థితిలో ఉందని తెలిపింది.

# ల్యాప్‌టాప్ కొనుగోలులో ప్రాసెసర్‌కే ప్రాధాన్యం!

**అమెజాన్ 'బెస్ట్ ఇన్ టెక్' సర్వే**



దిల్లీ: ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్‌ల కొనుగోలుదారుల ఆలోచనా విధానంలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. బ్రాండ్ పేరు కంటే సాంకేతిక ఫీచర్లు, సామర్థ్యానికే వినియోగదారులు పెద్దపీట వేస్తున్నారని ఇ–కామర్స్ దిగ్గజం అమెజాన్ నిర్వహించిన బెస్ట్ ఇన్ టెక్ సర్వేలో తేలింది. దాదాపు 40,000 మంది వినియోగదారుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. దీని ప్రకారం..ల్యాప్‌టాప్ కొనుగోలుదారుల్లో అత్యధికంగా 87% మంది ప్రాసెసర్ పనితీరు ఆధారంగానే తుది నిర్ణయం తీసుకుంటున్నారు. ట్యాబ్లెట్ విషయానికొస్తే.. స్క్రీన్ పరిమాణం, డిస్‌ప్లే నాణ్యతకే 74% మంది ప్రాధాన్యత ఇస్తున్నారు. ట్యాబ్లెట్ విషయంలో ధర (12%), ప్రాసెసర్ (9%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఒకే ధర శ్రేణిలో మెరుగైన ఫీచర్లు లభిస్తే.. ఇతర బ్రాండ్ వైపు మొగ్గుచూపేందుకు 53 శాతం మంది సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) ఫీచర్లపై విపరీతమైన ఆసక్తి కనిపిస్తోంది. ల్యాప్‌టాప్‌ల్లో ఏఐ ఫీచర్లు ఉత్పాదకతను భారీగా పెంచుతాయని 58 శాతం మంది భావిస్తున్నారు.

# ఆర్థిక సేవల సంస్థలదే అగ్రస్థానం

**జీసీసీల అద్దె లావాదేవీల్లో 70% వృద్ధి**

హైదరాబాద్: భారత్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) విస్తరణలో విదేశీ బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగాలు అగ్రస్థానంలో నిలిచాయి. ఈ ఏడాది జనవరి–జూన్ కాలంలో విదేశీ బీఎఫ్ఎస్ఐ సంస్థలు 73.20 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్థలాన్ని లీజుకు తీసుకొని, కొత్త రికార్డును నమోదు చేశాయి. స్థిరాస్తి సేవల సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. గతేడాది ఇదే సమయంలో నమోదైన 43.10 లక్షల చ.అడుగుల స్థలంలో పోలిస్తే ఇది 70 శాతం వృద్ధిని సూచిస్తోంది. దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాలైన ముంబయి, దిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, పుణె, హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతాలలో జీసీసీల మొత్తం లీజింగ్ 2.06 కోట్ల చదరపు అడుగులకు చేరింది. ఈ మొత్తం కార్యాలయ అద్దె లావాదేవీల్లో 36 శాతం వాటాను బీఎఫ్ఎస్ఐ రంగమే దక్కించుకోవడం విశేషం.

# ప్రపంచం కోసం భారత్‌లో తయారీ ప్లాంట్లను నెలకొల్పండి

**సాంకేతికత, ఆవిష్కరణ కేంద్రాలనూ ప్రారంభించండి**

**ప్రపంచ పెట్టుబడిదార్లను ఆహ్వానించిన ఆర్థిక మంత్రి**

**వాషింగ్టన్:** భారత్‌లో తయారీ, సాంకేతిక, ఆవిష్కరణ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిందిగా ప్రపంచ పెట్టుబడిదార్లను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆహ్వానించారు. భారత్‌లోని ప్రతిభను, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కెనడాలో మూడు రోజుల పర్యటన ముగించుకొని ఆరు రోజుల పర్యటన నిమిత్తం ఆమె అమెరికాకు చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా చికాగోలో ప్రముఖ పెట్టుబడిదార్లు, వ్యాపార సంస్థల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఇందులో భారత్ సాధిస్తున్న వేగవంత వృద్ధి, సంస్కరణలు, దీర్ఘకాలిక పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రముఖంగా వారితో ఆమె ప్రస్తావించారు. 'వ్యాపార సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి, తయారీ, ఆవిష్కరణ, విస్తరణకు వీలు కల్పించే వాతావరణాన్ని సృష్టించేలా విధానాలు తీసుకొని రావడంపై భారత్ ఎక్కువగా దృష్టి సారిస్తోంద'ని యూఎస్– ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ సహకారంతో చికాగోలోని భారత కాన్సులేట్ జనరల్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె అన్నారు. భారత్‌ను కేవలం సేవలు అందించే మార్కెట్‌గానే కాకుండా.. ప్రపంచం కోసం నిర్మించడానికి ఒక వేదికగా చూడాలని ఆమె వారికి తెలిపారు. భారతదేశ ఇంజినీరింగ్ ప్రతిభ, తయారీ స్థాయి, సాంకేతికత వ్యవస్థను సద్వినియోగం చేసుకుంటూ దానిని ఒక తయారీ కేంద్రంగా, సాంకేతిక, ఆవిష్కరణల కేంద్రంగా, వినియోగదార్ల విపణిగా, దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల పెట్టుబడులకు గమ్యస్థానంగా చూడాలని సూచించారు. భారత జీసీసీలు ప్రపంచ ఆవిష్కరణల కేంద్రాలుగా మారుతున్న నేపథ్యంలో ఏఐ, ఇంజినీరింగ్, అనాలటిక్స్, ఉత్పత్తి, అభివృద్ధి, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో అత్యధిక విలువ కలిగిన వ్యాపారాలను నిర్మించడమే తదుపరి అవకాశమని అన్నారు. ప్రపంచ మూలధనాన్ని భారత్‌లో ఉన్న అవకాశాలతో అనుసంధానించే అంతర్జాతీయ ఆర్థిక కేంద్రంగా గిఫ్ట్ సిటీ అవతరిస్తోందని తెలిపారు.

# ఓటింగ్‌లో పాల్గొన్నవి సుభాష్ చంద్ర అనుబంధ కంపెనీలే!

**ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వులపై బ్యాంకులు**

**దిల్లీ:** ఎస్సెల్‌గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్‌చంద్ర వ్యక్తిగత దివాలా ప్రక్రియపై వివాదం కొనసాగుతోంది. రూ.22,006 కోట్ల క్లెయిమ్‌నకు గానూ రూ.6.5 కోట్లు మాత్రమే చెల్లించేందుకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ అనుమతించడంపై రుణాలు ఇచ్చిన బ్యాంకులు గుర్రుమంటున్నాయి. రుణ పరిష్కార ప్రణాళికకు ఆమోదం తెలిపిన క్రెడిటర్లకు సుభాష్ కుటుంబంతో సంబంధం ఉందని ఆరోపిస్తున్నాయి.సుభాష్ చంద్రపై దాఖలైన వ్యక్తిగత దివాలా ప్రక్రియలో భాగంగా క్రెడిటర్లంతా కలిసి రూ.22,006.57 కోట్లు క్లెయిమ్ చేయగా.. కేవలం రూ.6.5 కోట్లు చెల్లించే పరిష్కార ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. ఈ ప్రణాళికకు 80.81 శాతం క్రెడిటర్ల నుంచి ఆమోదం లభించడం గమనార్హం. అయితే, ఇందులో సుభాష్ చంద్ర కుటుంబంతో సంబంధం ఉన్న 5 సంస్థలు రుణదాతల కమిటీలో 61.78 శాతం ఓటింగ్ వాటాను కలిగి ఉన్నాయని, ఈ ప్రణాళిక ఆమోదించడంలో కీలక పాత్ర పోషించాయని బ్యాంకులు ఆరోపిస్తున్నాయి.వీణా ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, డైరెక్ట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, వరల్డ్ క్రెస్ట్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ, లెమనేడ్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ, కార్ప్‌కాల్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ కంపెనీలకు అధిక ఓటింగ్ వాటా ఉండడంతో ఇది సాధ్యమైందని బ్యాంకులు పేర్కొంటున్నాయి. వీణా ఇన్వెస్ట్‌మెంట్స్ అనేది సుభాష్ చంద్ర సుభాష్ చంద్ర సోదరుడి భార్య సుశీలాదేవి గోయల్ నిర్వహిస్తున్నారని; అలాగే, డైరెక్ట్‌మీడియా, వెంచర్స్, వరల్డ్ క్రెస్ట్ కూడా వాటి అనుబంధ సంస్థలని పేర్కొంటున్నాయి. దివాలా ప్రక్రియ నిబంధనల ప్రకారం అనుబంధ సంస్థలకు ఓటింగ్ హక్కులు ఉండకూడదని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీబీఐ ట్రస్టీషిప్ సర్వీసెస్ వాదించాయి. దీనిపై ఎన్‌సీఎల్‌టీ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో కేసు మూడో సభ్యుడైన నీలేష్ శర్మ వద్దకు చేరింది. అయితే, రుణగ్రహీతకు ప్రత్యక్షంగా 51 శాతం కంటే ఎక్కువ వాటా లేదా బోర్డు నియంత్రణ ఉంటేనే అనుబంధ సంస్థగా పరిగణించవచ్చని పేర్కొంటూ బ్యాంకుల అభ్యంతరాలను తిరస్కరించి, పరిష్కార ప్రణాళికకు ఆయన ఆమోదం తెలిపారు.

**తీవ్రంగా వ్యతిరేకిస్తున్న బ్యాంకులు**

రుణంలో మొత్తం 3.2 శాతం వాటా కలిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళతామని పేర్కొంది. ప్రభుత్వరంగ బ్యాంకులైన కెనరా బ్యాంక్ (1.60%), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (0.76%), ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ (6.09%) కూడా ఈ ప్రణాళికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

# అమెరికా వ్యాపారంలో పెంటగాన్‌కు పిడికెడు

**వెనుజువెలా చమురులో వాటా..!**

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా రక్షణశాఖ ఇప్పుడు చమురు వ్యాపారంలోకి కూడా దిగనుంది. తాజాగా అమెరికా–వెనుజువెలా మధ్య కుదిరిన మెగా చమురు డీల్‌లో పెంటగాన్‌కు కూడా భారీ వాటా దక్కనుంది. ఈ విషయంపై ఆ దేశానికి చెందిన ఓ ప్రముఖ పత్రిక కథనం ప్రచురించింది. అమెరికాకు లభించనున్న చమురులో 35% వాటా పెంటగాన్‌కు కేటాయించనున్నారు. ఇప్పటి వరకు పెట్టుబడులు వచ్చేట్లు చేయడం వంటి పనులకే పరిమితమైన అమెరికా ప్రభుత్వం నేరుగా చమురు వ్యాపారంలోకి దిగినట్లవుతుంది. అమెరికా రక్షణశాఖకు చెందిన స్ట్రాటజిక్ క్యాపిటల్ ప్లాన్స్ నార్త్ అమెరికన్ బ్లూ ఎనర్జీ పార్ట్‌నర్స్‌లో పెన్ని వారెంట్స్‌తో వాటా దక్కించుకొనేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఫలితంగా భవిష్యత్తులో ఉత్పత్తి చేసే చమురు ఉత్పత్తి వ్యయానికి 20% వాటాకు పెంటగాన్ కొనుగోలు చేసే హక్కు లభిస్తుంది. నార్త్ అమెరికన్ బ్లూ ఎనర్జీ పార్ట్‌నర్స్‌ను వెనుజువెలాకు చెందిన వ్యాపారవేత్త అలెజాండ్రో నిర్వహిస్తున్నారు. ఈ కంపెనీకి వెనుజువెలాలో 17 చమురు క్షేత్రాల అభివృద్ధి కాంట్రాక్టులు దక్కే అవకాశం ఉంది.

# తిరుమల ఇండస్ట్రీస్ రైస్ మిల్లుపై సివిల్ సప్లయ్ టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు

- 340 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



**హుజూరాబాద్, ఆగస్టు 30 (జనం సాక్షి) :** మండలం రాంపూర్ గ్రామంలోని 'తిరుమల ఇండస్ట్రీస్' రైస్ మిల్లుపై సివిల్ సప్లైస్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, సివిల్ సప్లై అధికారులు ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు మెరుపు దాడులు నిర్వహించారు. పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కుల జేబులు నింపుతోంది. ఈ తనిఖీల్లో భారీ ఎత్తున నిల్వ ఉంచిన సుమారు 340 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మిల్లు యజమాని ఉపేందర్ సమీప బంధువైన శీల శీను అనే వ్యాపారి ఈ అక్రమ దందాకు సూత్రధారిగా వ్యవహరిస్తున్నట్లు విచారణలో తేలింది. జమ్మికుంట, ఇల్లంతకుంట, హుజురాబాద్ మండలాల్లో ఈ రేషన్ బియ్యాన్ని సేకరించినట్లు ట్రాలీ డ్రైవర్లు వెల్లడించారు. హుజురాబాద్ మండలంలోని ఇప్పల నరసింగాపూర్ గ్రామ రేషన్ డీలర్ నుంచి రేషన్ బియ్యం తీసుకొచ్చినట్లు ట్రాలీ డ్రైవర్ తిరుపతి సురేష్ వెల్లడించాడు. ఆయా గ్రామాల్లోని రేషన్ డీలర్లు, స్థానిక చిన్న వ్యాపారుల నుంచి ఈ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరిస్తున్నారు. అనంతరం ఆ బియ్యాన్ని తిరుమల ఇండస్ట్రీస్ కు తరలించి, రీసైక్లింగ్ చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద ప్రభుత్వానికి లెక్క చూపిస్తూ భారీ మోసానికి పాల్పడుతున్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

### రెండు ట్రాలీలు సీజ్, ఇద్దరు డ్రైవర్లు అదుపులోకి..

తనిఖీల సమయంలో ఎవరికీ అనుమానం రాకుండా పరదాలు కప్పి మిల్లుకు తరలిస్తున్న సుమారు 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం లోడుతో ఉన్న రెండు ట్రాలీలను అధికారులు రెడ్ హ్యాండెగా పట్టుకున్నారు. ట్రాలీ డ్రైవర్లు తిరుపతి సురేష్, అంగిడి తిరుపతిలను సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ పోలీసులు, సివిల్ సప్లై అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో బియ్యం నమూనాలను సేకరించిన అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న డీలర్లు, రేషన్ దందా చేస్తున్న శీల శీను అనే వ్యాపారితోపాటు, ఇండస్ట్రీ యజమాని ఉపేందర్ పై కేసులు నమోదు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. లోతుగా విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు, భారీగా రేషన్ బియ్యం నిల్వలు బయటపడే అవకాశముందని టాస్క్ ఫోర్స్ అధికారులు వెల్లడించారు.

# డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు టాబ్లెట్ల విక్రయం

- మెడికల్ షాపుపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు.. షాపు సీజ్
- మెడికల్ షాపు యజమాని కొమ్మ రాము అరెస్ట్






**కరీంనగర్ క్రైమ్, ఆగస్టు 30(జనంసాక్షి) :** కరీంనగర్ రూరల్ పోలీసులు డ్రగ్స్, హాష్ ఆయిల్,గంజాయి,ని స్వాధీనం చేసుకుని 9 మందిని అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో నిందితుల్లో ఒకరైన నితిన్, జగిత్యాల జిల్లా వాసి, గత కొంతకాలంగా కరీంనగర్‌లోని బ్యాంక్‌లైన్ సమీపంలోని డీమార్ట్ వద్ద ఉన్న ఆరోగ్య ఫార్మసీ మెడికల్ షాపు యజమాని కొమ్మ రాముతో పరిచయం ఏర్పరుచుకున్నట్లు వెల్లడించారు.నితిన్ తనకు ఉన్న పరిచయాన్ని ఉపయోగించుకుని, ఎలాంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా టపాల్-50, మత్తు టాబ్లెట్ల, అధిక ధరలకు కొమ్మ రాము వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం నితిన్‌తో పాటు మరో 8 మంది కలిసి ఆ టాబ్లెట్లను నీటిలో కరిగించి, సిరింజీల ద్వారా తమ శరీరంలోని నరాల్లోకి ఎక్కించుకుని మత్తుకు అలవాటు పడినట్లు విచారణలో వెల్లడించారు. 9 మందిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. నిందితుల వాంగ్మూలంలో మెడికల్ షాపు ఎలాంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు టాబ్లెట్లు కొనుగోలు చేసినట్లు వెల్లడైన నేపథ్యంలో, కరీంనగర్ రూరల్ పోలీసులు, మెడికల్ షాపును తనిఖీ చేయాలని కోరుతూ కరీంనగర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు లేఖ పంపించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ ఈ నెల 29తేదీన ఆరోగ్య ఫార్మసీ మెడికల్ షాపును తనిఖీ చేశారు. తనిఖీలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించడం, సంబంధిత వివరాలను రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయకపోవడం వంటి అంశాలను గుర్తించారు. అనంతరం నిబంధనల ప్రకారం మెడికల్ షాపును సీజ్ చేశారు.ఈ క్రమంలో మెడికల్ షాపు యజమాని కొమ్మ రామును కరీంనగర్ రూరల్ పోలీసులు ఈ 30 తేదీన అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌లో పంచుల సమక్షంలో విచారించారు.విచారణలో కొమ్మరాము అధిక డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో, ఎలాంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా, సంబంధిత రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయకుండా, తనకు పరిచయమైన నితిన్‌కు గత కొంతకాలంగా టాబ్లెట్లు విక్రయించినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.అనంతరం పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి, కొమ్మ రాముపై అరెస్ట్ మెమో జారీ చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ కేసులో ఇప్పటికే స్వాధీనం చేసుకున్న టాబ్లెట్లు, సిరింజీలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపించి, పూర్తి నివేదికను కోరడం జరిగింది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నుండి నివేదిక అందిన అనంతరం, అందులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా మెడికల్ షాపు యజమాని కొమ్మ రాముపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుని చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

# ఆటోను ఢీకొన్న కోళ్ల వ్యాన్



- ఒకరు మృతి
- కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం
- మృతురాలు కుటుంబానికి పరిహారం ఇప్పించాలని సీఎంఓకు ఫోన్

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 30 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మంగంపేట గ్రామం బీసీ కాలనీకి చెందిన రైతు కూలీలు ఆదివారం రోజు పత్తి చేనులో పనులకు ఆటోలో వెళ్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంగంపేట నుండి మల్యాపూర్ లో వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుండగా, గంగాధర - కరీంనగర్ మెయిన్ రోడ్డులో ర్యాకం లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ వద్ద వెనుక నుండి వస్తున్న కోళ్ల వ్యాన్ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లింగాల దేవమ్మ (55) తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం వెంటనే సివిల్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. జిల్లా కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అలాగే మృతురాలు లింగాల దేవమ్మ కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం తరపున పరిహారం అందించాలని సీఎంఓ కార్యాలయానికి ఫోన్ చేసి కోరారు. ఆయన వెంట మంగంపేట సర్పంచ్ లింగాల లింగయ్య, ఉప సర్పంచ్ నల్ల హనుమంతు, కాంగ్రెస్ నాయకులు బైరిశెట్టి సంపత్ తదితరులు ఉన్నారు.

# గన్నేరువరంలో ఉద్రిక్తత

- యువజన సంఘాల ధర్నా భగ్నం చేసిన పోలీసులు





**గన్నేరువరం, ఆగస్టు 30 (జనంసాక్షి):** గన్నేరువరం మండల కేంద్రంలో ఆదివారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. యువజన సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాను అడ్డుకునేందుకు పోలీసులు భారీగా మోహరించారు. మండల కేంద్రంలో ఎలాంటి పరాజయాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు పేరుతో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.. ఈ నేపథ్యంలో 11 గంటలకు వివేకనంద విగ్రహం వద్దకు చేరుకున్న యువజన సంఘం నాయకులు, వివిధ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున దీక్షకు కూర్చొని ఎమ్మెల్యే కవ్వంపల్లికి వ్యతిరేకత నినాదాలు చేశారు. తిమ్మాపూర్, చొప్పదండి సిఐ లు బొల్లం రమేష్, ప్రదీప్, గన్నేరువరం, చొప్పదండి ఎస్సైలు జి. నరేందర్ రెడ్డి, నరేష్ రెడ్డిలు నిరసన తెలుపుతున్న యువకులను అరెస్టు చేసి పోలీస్ వాహనంలోకి ఎక్కించి చిగురుమామిడి పోలీస్ స్టేషన్ కు తరలించారు. గన్నేరువరం మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణం కోసం డిమాండ్ చేస్తున్న యువజన సంఘాల నాయకులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడం కలకలం రేపింది. కాంగ్రెస్ నాయకులకు ఒకలా, యువజన సంఘాలకు మరోలా పోలీసులు వివరిస్తున్న తీరుపై నాయకులు తీవ్రస్థభంలో మండిపడ్డారు. ఎన్నికల సమయంలో యువతను నమ్ముకుని గెలిచి, నేడు వారిపైనే అణచివేత ధోరణి ప్రదర్శించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ద్విసభ్య విధానం: కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు ఎలాంటి ఆంక్షలు లేవు కానీ, ప్రజా సమస్యలపై నిలదీస్తున్న యువజన సంఘాలకు మాత్రం పర్మిషన్ నిరాకరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పది రోజుల్లోగా రోడ్డు పనులు ప్రారంభించకపోతే ప్రజా ఉద్యారాన్ని ఉధృతం చేస్తామని యువజన నాయకుడు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి హెచ్చరించారు.

# ఆలయంలో చోరీ

- రెండు హుండీలను ధ్వంసం చేసి నగదు అపహరణ
- రూ.50 వేలకు పైగా ఉండొచ్చని గ్రామస్తుల అంచనా

**గాంధారి, ఆగస్టు 30 (జనంసాక్షి) :** గాంధారి మండలం పెద్ద పోతంగల్ గ్రామపంచాయతీ పరిధిలోని బుగ్గగండి ఆలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయంలోని రెండు హుండీలను ధ్వంసం చేసి అందులోని నగదును అపహరించారు. శుక్రవారం రాత్రి లేదా శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన బుగ్గగండి ఆలయంలో శివలింగం కొలువై ఉంది. ఆలయానికి భక్తుల్లో విశేష ఆదరణ ఉంది. పాత ఆలయం, నూతన ఆలయంలో భక్తుల కానుకల కోసం రెండు హుండీలను ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది శ్రావణమాసం చివరి సోమవారం హుండీలను తెరిచి, వీసీడీ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, భక్తుల సమక్షంలో నగదును లెక్కిస్తారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి పనులతో పాటు అన్నదాన కార్యక్రమాలకు వినియోగిస్తుంటారు. ఈ ఏడాది హుండీల్లో రూ.50 వేలకు పైగా నగదు ఉండే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు. గతేడాది హుండీల ద్వారా రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఈసారి కూడా అదే స్థాయిలో ఆదాయం వస్తుందని భావిస్తున్న సమయంలో హుండీలు ధ్వంసం చేసి నగదు అపహరించడం దురదృష్టకరమని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ భద్రతపై అధికారులు, నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ ఘటనపై వీసీడీ సర్పంచ్ మాట్లాడుతూ.. ఆలయంలో చోరీ జరుగుతుందని ఊహించలేదని అన్నారు. పెద్దగుడి, చిన్నగుడి రెండింటిలోని హుండీలను ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లడం బాధాకరమైన విషయమని పేర్కొన్నారు.









# సిరిసిల్ల జిల్లాలో మోగిన రైలు కూత

- బస్వాపూర్ వరకు విజయవంతంగా ట్రయల్ రన్!

**ముస్తాబాద్ ఆగస్టు 30 (జనం సాక్షి) :** కొత్తపల్లి-మనోహరాబాద్ నూతన రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా, జిల్లా సరిహద్దులోని తంగళ్ళపల్లి మండలం బస్వాపూర్ రైల్వే స్టేషన్ వరకు నిర్వహించిన రైల్వే ట్రయల్ రన్ విజయవంతమైంది. తొలిసారిగా జిల్లా సరిహద్దు ప్రాంతంలోకి రైలు వచ్చి కూత పెట్టడంతో స్థానిక ప్రజలు, రైతులు ఆనందంలో మునిగిపోయారు. సిద్దిపేట మార్గం నుంచి బస్వాపూర్ స్టేషన్ వరకు రైల్వే అధికారులు ఇంజిన్‌ను నడిపి పట్టాలు, సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.దశాబ్దాలుగా రైలు సౌకర్యం కోసం నిరీక్షిస్తున్న గిరిజన, గ్రామీణ ప్రాంత ప్రజలు రైలు రాకను చూసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ మార్గం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సిరిసిల్లలోని చేనేత, జౌళి ఉత్పత్తుల రవాణాకు కొత్త ఊపిరి అందడమే కాకుండా, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు రవాణా కష్టాలు తప్పనున్నాయి.

# 2,100 కిలోమీటర్ల సాహసోపేత బైక్ రైడ్

- గిన్నిస్ వరల్డ్ రికార్డుతో సీఐ మహేష్‌కు ఘన సన్మానం
- కష్టపడి కచ్చితంగా ప్రతి ఒక్కరు చదవాలి
- ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి, ఎంతటి కష్టానైనా ఇష్టంతో చదవాలి
- యువత అన్ని రంగాలలో రాణించాలి





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం దేమే గ్రామానికి చెందిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్ 2,100 కిలోమీటర్ల సాహసోపేత బైక్ రైడింగ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. కామారెడ్డి పట్టణంలోని వశిష్ట కళాశాలలో ఆయన చిన్ననాటి మిత్రులు, గ్రామస్తులు, సర్పంచులు, అభిమానులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఇటీవల లడక్‌లో అత్యంత ఎత్తైన, కఠినమైన రహదారులపై సుమారు 2,100 కిలోమీటర్ల మేర ఏడు రోజుల పాటు సాహసోపేతంగా బైక్ రైడింగ్ చేసి మహేష్ ఈ ఘనత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వగ్రామానికి చెందిన వ్యక్తి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల దేమే గ్రామస్తులు, మిత్రబృందం, యువత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐ ఎం. మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువును నమ్ముకుని కష్టపడి పనిచేస్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చని అన్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే సమాజానికి సేవ చేయాలనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని మహేష్ సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా క్రమశిక్షణతో ముందుకు సాగాలని తెలిపారు. సమాజంలో ఎవరికి ఆపద వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి మిత్రులు, గ్రామస్తులు, సర్పంచులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు కలిసి సీఐ మహేష్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఆయన సాధించిన విజయాన్ని యువతకు స్ఫూర్తిదాయకంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మాజీ ఎంపీపీ రవి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకటి, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, చిన్ననాటి మిత్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 226 మందికి రూ.56.43 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల

- బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 30,(జనంసాక్షి):** నియోజకవర్గంలోని 226 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన రూ.56.43 లక్షల విలువైన చెక్కులను బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. నిర్మల్ పట్టణంతో పాటు నిర్మల్ రూరల్, సోన్, మామడ, లక్ష్మణచందా, సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు చేయించుకుంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. మొత్తం 226 మంది లబ్ధిదారులకు రూ.56,43,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, బీజేపీ మండల నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

# గద్వాల కుర్రోడికి పసిడి పథకం



**గద్వాల,ఆగస్టు 30 (జనం సాక్షి) :** క్రీడల్లో ప్రతిభ చాటిన గద్వాల యువ అథ్లెట్ రఘుపతి నాయుడికి అద్భుత గౌరవం దక్కింది. హనుమకొండలో నిర్వహించిన సౌత్ జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల అండర్-16 (ఖ-16) విభాగంలో రఘుపతి నాయుడు పసిడి (స్వర్ణ) పతకం సాధించి జిల్లా ఖ్యాతిని చాటారు.ఈ ఘన విజయం సాధించిన సందర్భంగా ఆదివారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రఘుపతి నాయుడిని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి క్రీడాకారుడిని శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

రఘుపతి నాయుడు ఇదే జోష్‌తో మున్ముందు జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించి, జిల్లాకు, రాష్ట్రానికి మరిన్ని పతకాలు తీసుకురావాలని బండ్ల జ్యోతి ఆకాంక్షించారు. యువత క్రీడల్లో రాణించేందుకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో అద్భుతమైన ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం అందిస్తే వారు అంతర్జాతీయ స్థాయిలో మెరుస్తారని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సన్మాన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ జయలక్ష్మి, స్థానిక నాయకులు సుభాన్, రమేశ్ నాయుడుతో పాటు పలువురు క్రీడాభిమానులు, యువకులు పాల్గొని విజేత రఘుపతి నాయుడికి శుభాకాంక్షలు తెలిపారు.



# ఆదేశాలు కలెక్టర్‌వి.. అమలు చేసేదెవరు?

## అధికారులు-ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఎక్కడ?

- ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై పర్యవేక్షణ కరువు
- ఇసుక, రైస్‌మిల్లులపై నిఘా ఏది?

**'యథా రాజా.. తథా మంత్రి' అన్న చందంగా?**

ప్రజా సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో స్పందించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో కొన్ని సమస్యల విషయంలో ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులపైనే ప్రజలు ఆధారపడాల్సి వస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మిగతా శాఖల అధికారులు కూడా సమష్టిగా స్పందించి సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ యంత్రాంగం ప్రాథమిక బాధ్యత. కాబట్టి ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై శాఖల వారీగా సమీక్ష, కలెక్టర్ ఆదేశాల అమలుపై పర్యవేక్షణ, ఇసుక వ్యవహారాలపై తనిఖీలు, రైస్ మిల్లుల పనితీరుపై నిఘా వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ అవసరమని ప్రజలు అంటున్నారు. అధికారులు-ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం బలోపేతం చేసి, ప్రజలకు జవాబుదారీ తనంతో కూడిన పాలన అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**వనపర్తి బ్యూరో ఆగస్టు 29 జనంసాక్షి**

జిల్లాలో పాలనా వ్యవస్థపై ప్రజల్లో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ ఆదేశాల అమలు, అక్రమాల నియంత్రణలో అధికార యంత్రాంగం పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కలెక్టర్ స్థాయిలో ఆదేశాలు వెలువడుతున్నా.. అవి క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు అంటున్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయకపోవడం వల్లే సమస్యలు పరిష్కారం కాకుండా పేరుకుపోతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం ఏది?**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. అయితే వాటిలో ఎన్ని పరిష్కరించబడ్డాయి.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయనే అంశాలపై క్రమబద్ధమైన సమీక్ష ఎంతవరకు జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు బాధితులు వాపోతున్నారు.

**కలెక్టర్ ఆదేశాల అమలుపై అనుమానాలు**

జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు, అధికారుల పనితీరుపై ఆదేశాలు ఇస్తున్నప్పటికీ.. వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయించడంలో కొందరు అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆదేశాలు ఇచ్చినంత మాత్రాన సరిపోదని, వాటి అమలుపై నిరంతర పర్యవేక్షణ, బాధ్యత నిర్ధారణ అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**ఇసుక వ్యవహారంపై ఎవరి పర్యవేక్షణ?**

జిల్లాలో ఇసుక విక్రయాలు, రవాణాపై నియంత్రణ ఉండాల్సి ఉండగా.. కొన్ని ప్రాంతాల్లో నిబంధనల అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా కొందరి ఆధిపత్యం కొనసాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**రైస్ మిల్లులపై నిఘా ఏది?**

రైస్ మిల్లుల వ్యవహారాల్లో అక్రమాలకు తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. అయితే కొన్ని సందర్భాల్లో నిబంధనల అమలు విషయంలో యంత్రాంగం తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే అనవసర ఆరోపణలకు తావులేకుండా పారదర్శకంగా తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

# అంగన్వాడీ కొలువులకు నోటిఫికేషన్



**జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ... మహిళా అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం**

**ఇబ్రహీంపట్నం,ఆగస్టు 30 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో జిల్లాలో ఖాళీగా ఉన్న 125 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ తెలిపారు. జిల్లాలో ఆమనగల్‌లో 31, చేవెళ్లలో 29, హయత్‌నగర్‌లో 3, ఇబ్రహీంపట్నంలో 21, మహేశ్వరంలో 10, శేరిలింగంపల్లిలో 5, షాద్‌నగర్‌లో 26 అంగన్వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మొత్తం 125 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హతలు, నియమ నిబంధనలు, ఇతర వివరాలను https://www.wdcw.tg.nic.in వెబ్‌సైట్లో పరిశీలించుకోవాలని సూచించారు. అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు సమర్పించాలని శాంతి శ్రీ తెలిపారు.

# చిటమట వాగుపై వెంటనే బ్రిడ్జి మరమ్మత్తులు చేపట్టాలి

**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న న్యావనంది, పిప్పిరి గ్రామస్థులు**



**సిరికొండ ఆగస్టు 30 (జనం సాక్షి):** న్యావనంది నుంచి పిప్రి గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న చిట మట వాగుపై ఉన్న బ్రిడ్జి అధ్వానంగా తయారైందని, వెంటనే అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా, పలువురు ప్రజాప్రతినిధులు మారినా వాగు పరిస్థితి మాత్రం మారడం లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. వర్ష కాలం వచ్చిందంటే చాలు ఈ వాగు గుండా ప్రయాణించడం ప్రాణసంకటంగా మారుతోందని వాపోతున్నారు. పిప్పిరి గ్రామానికి వెళ్లేందుకు మాత్రమే కాకుండా, ప్రముఖ పుణ్యక్షేత్రమైన లింబాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సందర్శనకు వెళ్లే భక్తులకు ఇది అత్యంత ప్రధాన రహదారి. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు, భక్తులు, పాఠశాల విద్యార్థులు ఈ మార్గం ద్వారానే ప్రయాణిస్తుంటారు. రహదారి బాగులేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి చిటమట వాగు బ్రిడ్జికి శాశ్వత మరమ్మత్తులు పూర్తి చేసి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు.

# పేదవాడిపైనే అధికారుల ప్రతాపమా?

## గిరిజన కుటుంబం ఇల్లు కూల్చివేతపై బీజేపీ నేత ఆగ్రహం

- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బండారి శాంతికుమార్ డిమాండ్
- స్పందించకుంటే ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం
- బూత్ కార్యకర్తలతో 'మన్ కీ బాత్' వీక్షణ



**బొంరాస్‌పేట, ఆగస్టు 30 (జనం సాక్షి):** అటవీ భూమిలో ఇల్లు నిర్మించుకుంటున్న నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన నిర్మాణాన్ని అధికారులు కూల్చివేయడం దారుణమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్ అన్నారు. ఊరేనికితండాలో రాథోడ్ రవినాయక్ నిర్మించుకుంటున్న ఇంటిని ఈ నెల 28న పోలీసు బందోబస్తు మధ్య అటవీ శాఖ అధికారులు కూల్చివేశారు. విషయం తెలుసుకున్న శాంతికుమార్ ఆదివారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి తండాకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇల్లు కోల్పోయి గుడిసెలో నివసిస్తున్న కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు. తండా పరిధిలో సుమారు 60 ఇళ్లు అటవీ ప్రాంతంలో ఉన్నాయని చెబుతున్నప్పటికీ, సామాన్య నిరుపేద ఎస్టీ కుటుంబం నిర్మించుకుంటున్న ఇంటినే కూల్చివేయడం సరికాదన్నారు. అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, లేకుంటే ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బొంరాస్‌పేట మండల కేంద్రంలోని 188వ బూత్ కార్యకర్తలతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించారు. స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యమిస్తూ 'వోకల్ ఫర్ లోకల్' స్ఫూర్తితో ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని, బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షులు మదన్, బాబయ్యనాయుడు, మండల అధ్యక్షుడు ఉప్పరి జగదీశ్వర్‌సాగర్, నాయకులు సతీష్, శ్రీకాంత్, బలరాం పాల్గొన్నారు.



# ఉప్పల్, మేడిపల్లిలో నీట్ పరీక్ష కేంద్రాల తనిఖీ

**పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి**

**బోడుప్పల్-జనంసాక్షి :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్, మేడిపల్లి మండలాల్లో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పరిశీలించారు. నాగోల్‌లోని సీఐఓఎస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, పీర్జాదిగూడలోని సూర్య టెక్నాలజీ, మేడిపల్లి కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించిన అదనపు కలెక్టర్.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పకడ్బందీగా పరీక్ష నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి తహసీల్దార్, సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ





- బస్సుల కోసం చుక్కలు చూసిన ప్రయాణికులు
- బస్సు ఏమో పల్లె వెలుగు.. బోర్డు మాత్రం ఎక్స్‌ప్రెస్.. స్టిక్కర్ స్పెషల్ సర్వీస్
- అయోమయంలో ప్రయాణికులు

**సదాశివనగర్, ఆగస్టు 30 (జనంసాక్షి):** కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడింది. ఒకవైపు బస్సులు సరిపోక ప్రయాణికులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడగా, మరోవైపు బస్సుల పేర్లు, బోర్డులు, స్టిక్కర్ల వ్యవహారం ప్రయాణికులను మరింత అయోమయంలోకి నెట్టింది. పేరుకు పల్లెవెలుగు... బస్సుపై మాత్రం ఎక్స్‌ప్రెస్ స్టిక్కర్... ఇదేంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. పల్లెవెలుగు సేవగా కనిపించే బస్సుకు ఎక్స్‌ప్రెస్ స్టిక్కర్ అంటించి నడపడం ఏమిటని పలువురు నిలదీస్తున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల ఉచిత ప్రయాణ పథకానికి సంబంధించి కూడా బస్సు రకం విషయంలో స్పష్టత లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మహిళల ఉచిత ప్రయాణానికి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ వంటి సేవలను అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారికంగా పేర్కొంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బస్సుల గుర్తింపు, సేవల వివరాలపై స్పష్టత లేక ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక సమాచారం ప్రకారం మహిళలు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందవచ్చు.

**"బస్సు పల్లెవెలుగా... ఎక్స్‌ప్రెస్... స్పెషల్ సర్వీసా...?**

ముందు ఆర్టీసీనే స్పష్టంగా చెప్పాలి. ప్రయాణికులను ఎందుకు అయోమయంలో పడేస్తున్నారు?" అంటూ పలువురు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సుల కోసం చుక్కలు చూసిన ప్రయాణికులు బస్టాండ్‌లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగినా, అందుకు తగినన్ని బస్సులు అందుబాటులో లేకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు వస్తుందేమోనని రోడ్డువైపు చూస్తూ గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని ప్రయాణికులు వాపోయారు. ప్రయాణికుల రద్దీని ముందుగానే అంచనా వేసి అదనపు బస్సులు ఏర్పాటు చేయాల్సిన ఆర్టీసీ అధికారులు ఆ దిశగా సరైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందించాల్సిన ఆర్టీసీ, బోర్డులు-స్టిక్కర్ల గందరగోళం, బస్సుల కొరతతో ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**"పేర్లు మార్చడం కాదు... ప్రయాణికుల కష్టాలు తీర్చండి"**

పల్లెవెలుగు బస్సుపై ఎక్స్‌ప్రెస్ స్టిక్కర్ అంటించడం వంటి గందరగోళాలకు తెరదించి, ప్రతి బస్సు ఏ సేవకు సంబంధించినదో స్పష్టంగా తెలియజేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. రద్దీ సమయాల్లో అదనపు బస్సులు నడిపి, ప్రయాణికులు బస్టాండ్‌లో గంటల తరబడి ఎదురుచూడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# చెరువులోకి..పరిశ్రమల కాలుష్యపు నీరు





- మృత్యువాత పడుతున్న మూగజీవులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- కాలుష్యంతో సతమతమవుతున్న ఎలికట్ట గ్రామ ప్రజలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** పరిశ్రమల నుండి వెలువడే రసాయన వ్యర్థ పదార్థాల కాలుష్యపు నీరును పరిశ్రమ యాజమాన్యాలు చెరువులోకి వదలడంతో ఆ నీటిని తాగిన మూగజీవులు మృత్యువాత పడుతున్నాయి గతంలో చేపలతో కలకలలాడే చెరువు కాలుష్యపు నీటికి చేపలు మృతి చెందాయి ఆ నీటిని తాగిన మూగజీవులు కూడా మృత్యువాత పడ్డాయి ప్రస్తుతం ఆ చెరువులో చేపలు లేవు ఆ నీటిని తాగిన మూగజీవులు మృత్యువాత పడుతుండడంతో పశువులు కూడా నీళ్లు తాగలేక పోతున్నాయి పరిశ్రమల నుండి వెలువడే రసాయనం వ్యక్తపదార్థాల కలుషితపు నీరు చెరువులోకి వదలడంతో మూగజీవులు మృత్యువాత పడడం చేపలు మృతి చెందడం జరుగుతుందని ఎలికట్ట గ్రామ ప్రజలు పరిశ్రమ యాజమాన్యాల తీరుతో పాటు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు గతం నుండి సంబంధిత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఎలికట్ట గ్రామ శివారులో ఉన్న మహి గ్రానైట్స్, తిరుమల ప్రైవేట్ లిమిటెడ్, ముకుంద కరోప్యాక్, లాంటి పరిశ్రమల నుండి వెలువడే రసాయన వ్యర్థ పదార్థాలు చెరువులోకి వదలడంతో చెరువు నీరు కలుషితంతో పాటు దుర్వాసన వెదజల్లుతుందని సంబంధిత అధికారులు ఈ పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ఎలికట్ట గ్రామస్తులు కోరుతున్నారు.

# అర్హులకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు

- 480 ప్లాట్లకు లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక : పిఏసి చైర్మన్ అరికెపూడి
- ఎస్సీలకు 67, ఎస్టీలకు 24 ప్లాట్లు, బీసీలకు 77, జనరల్ కేటగిరీకి 240 ప్లాట్లు
- మూడు నాలుగు రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం



**శేరిలింగంపల్లి, ఆగస్టు 30 (జనం సాక్షి):** అర్హులైన లబ్ధిదారులకు పూర్తి పారదర్శకతతో ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నామని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికపూడి గాంధీ తెలిపారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలో ప్రభుత్వ భూమిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆదివారం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ ఒత్తిళ్లు, సిఫారసులకు తావులేకుండా నిబంధనల ప్రకారం లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. మొత్తం 480 ప్లాట్లకు గాను ఎస్సీలకు 67, ఎస్టీలకు 24, బీసీలకు 77, జనరల్ కేటగిరీకి 240 ప్లాట్లను కేటాయించినట్లు వెల్లడించారు. దివ్యాంగులకు 24 ప్లాట్లను కేటాయించినట్లు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారుల పేర్లను బహిరంగంగా ప్రకటించడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమన్నారు. మూడు నాలుగు రోజుల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణ పనులను ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నిర్మాణాలు హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ప్రాజెక్టు డైరెక్టర్ నాయక్, ఆర్డీవో శ్రీధర్, కార్యదర్శి విమల, ఈఈ వాణి, ఏఈఓ వాసు, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో తెరసే సమర శంఖం

**నేడే కవిత 'పాంచజన్య సంకల్ప సభ'.. ఉచిత విద్య, వైద్యం సహా కీలక ప్రకటనలకు వేదిక**

**నిజామాబాదు జిల్లా ప్రతినిధి ఆగస్టు 30 జనంసాక్షి:** నిజామాబాద్ గడ్డపై రాజకీయ పునరేకీకరణే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేడు నిర్వహించనున్న 'పాంచజన్య సంకల్ప సభ' ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కొత్త పార్టీ ఏర్పాటు తర్వాత తొలిసారిగా సొంతగడ్డపై అడుగుపెడుతున్న ఆమె, కలెక్టరేట్ గ్రౌండ్ వేదికగా పార్టీ ప్రధాన ఎజెండాను ప్రకటించడంతో పాటు అన్ని పార్టీల్లోని తెలంగాణ ఉద్యమకారులను ఏకతాటిపైకి తెచ్చేందుకు పిలుపునివ్వనున్నారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలే టార్గెట్‌గా కవిత అడుగులు వేస్తుండటంతో, మధ్యాహ్నం జరిగే ఈ భారీ బహిరంగ సభ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సభలో భాగంగా సామాజిక న్యాయ తెలంగాణ సాధనే ధ్యేయంగా కవిత పలు సంచలన హామీలను ప్రకటించనున్నారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించేలా విద్య, వైద్యం పూర్తిగా ఉచితమని స్పష్టం చేయడంతో పాటు, నిరుద్యోగ యువతకు 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఉద్యమకారులకు లక్ష సూపర్ న్యూమరీ పోస్టుల భర్తీపై బ్లూ ప్రింట్ విడుదల చేయనున్నారు.
అలాగే స్వయం ఉపాధి కోసం బ్యాంక్ లింకేజీతో సంబంధం లేకుండా రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు ప్రభుత్వ గ్యారంటీతో రుణాలు ఇప్పించే విధానాన్ని వివరించి, రైతు సంక్షేమమే ధ్యేయంగా తన భవిష్యత్తు కార్యాచరణను ప్రజల ముందుంచనున్నారు.

**'పాంచజన్య సంకల్ప సభ' : కవిత ర్యాలీ నిర్వహించే రూట్ మ్యాప్**

మధ్యాహ్నం 2:30 గంటలకు ఇందల్వాయి మండలం గన్నారంలో తెలంగాణ రక్షణ సేన జెండాను కవిత ఎగురవేస్తారు. అనంతరం మధ్యాహ్నం 2:45 గంటలకు మాధవ నగర్ సాయిబాబా గుడి వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీగా నిజామాబాద్ పట్టణానికి బయలుదేరుతారు. మాధవ నగర్ సాయిబాబా ఆలయం నుండి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ పులాంగ్ చౌరస్తా, రాజ రాజేంద్ర చౌరస్తా, పెద్ద బజార్, నెహ్రూ పార్క్, గాంధీ చౌక్, బస్టాండ్ మీదుగా ప్రయాణించి ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్ వరకు కొనసాగుతుంది. మధ్యాహ్నం 3:30 నుండి 3:45 గంటల మధ్య సమావేశ వేదిక వద్దకు కవిత చేరుకుంటారు. అక్కడ 'పాంచజన్య సంకల్ప సభ'లో ప్రసంగించిన అనంతరం, సాయంత్రం 6:30 గంటలకు నందిపేట మండలం సీహెచ్ కొండూరులోని శ్రీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

# ప్రజా సమస్యలపై చర్చించాలి.. వ్యక్తిగత దూషణలొద్దు

- నగర అభివృద్ధిపై బీజేపీ పాలకవర్గానికి చిత్తశుద్ధి లేదు
- క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకునే ఓపిక, పరిష్కరించే ప్రయత్నం పాలకవర్గం చేయడం లేదు
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 30 (జనంసాక్షి) :**
క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై పాలకవర్గం సమావేశంలో చర్చించి పరిష్కారం మార్గానికి ప్రయత్నం చేయాలేగానీ మాజీ మేయర్లు గా పని చేసిన వాళ్లే వ్యక్తిగత దూషణలకు దిగడం మంచిది కాదని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. మార్కెట్ రోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కూరుకుపోయిన డ్రైనేజీని పరిశీలించిన అనంతరం పక్కన గల అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ మున్సిపల్ ఎన్నికల్లో కేంద్రం నుండి నిధుల వరద తీసుకువచ్చి నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఓట్లు దండుకొని ఇప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గాలికి వదిలేసి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని నగర అభివృద్ధి పై వీరికి చిత్తశుద్ధి లేదని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వ వాటాను కేంద్రం నుండి తీసుకువచ్చినట్టు ప్రజలకు భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని నరేందర్ రెడ్డి తెలిపారు. ఆధిపత్య పోరు పై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో లేదని ఇప్పటికైనా కేంద్రం నుండి నగర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, నిరుద్యోగ యువతకు ఏదైనా ప్రాజెక్ట్ తీసుకురావడానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ కృషి చేయాలని నరేందర్ రెడ్డి కోరారు.

# జిల్లాలో నీట్ పీజీ పరీక్ష ప్రశాంతం

- పరీక్ష రాసిన 1471 మంది - 34 మంది గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 30 (జనంసాక్షి) :**

జిల్లాలో నిర్వహించిన నీట్ పీజీ 2026 పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణను ఆదివారం కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సంయుక్తంగా పర్యవేక్షించారు. జిల్లాలోని తిమ్మాపూర్ మండలం వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్ ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల ప్రవేశం, భద్రతా తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్ ధృవీకరణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. పరీక్ష సజావుగా జరిగేలా పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ... నీట్ పీజీ పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల నీట్ పరీక్ష విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. పరీక్ష సజావుగా సాగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని చెప్పారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ... పరీక్ష పారదర్శక నిర్వహణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టామని, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పరీక్షలు రాసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని మొత్తం 7 పరీక్షా కేంద్రాల్లో 1505 మంది అభ్యర్థులకు గాను 1471 మంది హాజరుకాగా, 34 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష నిర్వహణలో జిల్లా విద్యాశాఖ అధికారులు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాలిటీ ప్రభాకర్ రెడ్డి సేవలు మరువలేనివి

- పదవీ విరమణ ఉద్యోగానికే.. వృత్తికి కాదు
- మూడు దశాబ్దాలకుపైగా వేలాది మంది విద్యార్థులకు బోధన, మార్గదర్శనం
- పదవీ విరమణ కార్యక్రమంలో వక్తలు



**హైదరాబాద్, (జనంసాక్షి) :** పౌరశాస్త్ర బోధనలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ గుర్రం ప్రభాకర్ రెడ్డి సేవలు విద్యార్థి లోకానికి, విద్యా రంగానికి మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. 'పాలిటీ ప్రభాకర్ రెడ్డి'గా రెండు తెలుగు రాష్ట్రాల్లో వేలాది మంది విద్యార్థులకు సుపరిచితుడైన ఆయన.. మూడు దశాబ్దాలకుపైగా సాగించిన బోధనా ప్రస్థానంలో ఎంతోమంది విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించారని అన్నారు. హైదరాబాద్ జిల్లెలగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం డాక్టర్ గుర్రం ప్రభాకర్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ఆయన సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు.. ఒక ఉపాధ్యాయుడిగా ఆయన చూపిన అంకితభావం, విద్యార్థుల పట్ల ఆయనకున్న బాధ్యత, బోధన పట్ల ఉన్న నిబద్ధత ప్రశంసనీయమన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యం డాక్టర్ ప్రభాకర్ రెడ్డి తన ఉద్యోగాన్ని కేవలం విధి నిర్వహణగా భావించలేదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతగా భావించారని వక్తలు ప్రశంసించారు. మిర్యాలగూడ నాగార్జున కళాశాలలో ప్రారంభమైన ఆయన బోధనా ప్రస్థానం హైదరాబాద్ వరకు కొనసాగిందని, నాగార్జున కళాశాలలోనే కాకుండా హైదరాబాద్‌లోని జూనియర్ కళాశాలలో, ఆర్సీ రెడ్డి సివిల్స్ స్టడీ సర్కిల్‌లోనూ ఎంతోమంది విద్యార్థులకు పౌరశాస్త్రంలో శిక్షణ, మార్గదర్శనం అందించారని గుర్తుచేశారు.

**'పాలిటీ' అంటే ప్రభాకర్ రెడ్డి**

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల్లో 'పాలిటీ' అంటే ప్రభాకర్ రెడ్డి అనే స్థాయిలో ఆయన గుర్తింపు పొందారని వక్తలు అన్నారు. సివిల్స్, గ్రూప్-1, గ్రూప్-2, పోలీస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే విద్యార్థులకు పౌరశాస్త్రంలోని క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించడంలో ఆయన ప్రత్యేకతను సంపాదించుకున్నారని అన్నారు. పాఠ్యపుస్తకంలోని అంశాలను మాత్రమే కాకుండా.. సమకాలీన రాజకీయ, సామాజిక పరిణామాలను అనుసంధానం చేస్తూ బోధించడం ఆయన ప్రత్యేకత అని తెలిపారు. అందుకే ఆయన వద్ద చదువుకున్న విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయాలు సాధించడమే లక్ష్యంగా పనిచేశారని అన్నారు. ఒక ఉపాధ్యాయుడి అసలైన విజయాన్ని ఆయన సాధించిన వ్యక్తిగత ప్రగతితో కొలవలేమని.. ఆయన ద్వారా ఎంతమంది విద్యార్థులు జీవితంలో ముందుకు వెళ్లారన్నదే అసలైన కొలమానమని వక్తలు అన్నారు. ఆ దృష్టిలో డాక్టర్ ప్రభాకర్ రెడ్డి బోధనా ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

**పదవీ విరమణ ఉద్యోగానికే.. వృత్తికి కాదు**

డాక్టర్ ప్రభాకర్ రెడ్డికి పదవీ విరమణ అనేది కేవలం ఉద్యోగ జీవితానికి మాత్రమేనని, ఉపాధ్యాయ వృత్తికి, విద్యార్థులకు ఆయన అందించే సేవలకు కాదని వక్తలు అన్నారు. అనుభవం, జ్ఞానం, బోధనా సామర్థ్యం ఉన్న వ్యక్తి విద్యార్థులకు ఎప్పటికీ అవసరమేనని పేర్కొన్నారు. ఇప్పటివరకు సంపాదించిన అపారమైన అనుభవాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ఆయన మరింత విస్తృతంగా సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు. తరగతి గది నుంచి ప్రారంభమైన ఆయన విద్యా ప్రయాణం పదవీ విరమణతో ఆగిపోకుండా.. మరింత మందికి మార్గదర్శకంగా కొనసాగాలి.

**ఆయన నాటిన జ్ఞానపు విత్తనాలు**

జిల్లెలగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన డాక్టర్ గుర్రం ప్రభాకర్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మాజీ డీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ట్రైకార్ చైర్మన్ రాంచందర్ నాయక్, ఆర్కియాలజీ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్, నాగార్జున కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ రెడ్డిని ఘనంగా సన్మానించి, ఆయన దీర్ఘకాలిక బోధనా సేవలను అభినందించారు. మూడు దశాబ్దాలకుపైగా సాగిన బోధనా ప్రస్థానానికి పదవీ విరమణతో ఒక అధ్యాయం ముగిసినా.. వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో ఆయన నాటిన జ్ఞానపు విత్తనాలు మాత్రం నిరంతరం ఫలాలు అందిస్తూనే ఉంటాయని వక్తలు అన్నారు.

# నర్స్ శిరీష హత్యపై మంత్రి సీతక్క ఆరా

- డీజీపీకి ఫోన్..నిందితుడిని కఠినంగా శిక్షించాలి
- బాధిత కుటుంబానికి అండగా ఉంటాం- మంత్రి సీతక్క



**హైదరాబాద్, ఆగస్టు 30 :** రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నర్స్ శిరీష దారుణ హత్యకు గురైన ఘటనపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధులు నిర్వహిస్తున్న ఓ యువతి ప్రాణాలను అత్యంత దారుణంగా బలిగొన్న ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. శిరీష హత్య విషయం తెలిసిన వెంటనే మంత్రి సీతక్క స్పందించారు. స్థానిక పోలీసు అధికారులు, పహాడిషరీఫ్ ఇనస్పెక్టర్, ఇతర అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి సీతక్క... డీజీపీ సీవీ ఆనంద్‌కు ఫోన్ చేసి ఘటనపై సమగ్రంగా, ఉన్నతస్థాయి విచారణ జరపాలని కోరారు. ఇలాంటి దారుణ ఘటనల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా చట్టపరమైన విచారణను వేగవంతం చేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తన కుటుంబానికి అండగా నిలవాల్సిన వయసులో, తన కాళ్లపై తాను నిలబడి సేవా రంగంలో పనిచేస్తున్న ఓ యువతి ఇలా దారుణంగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలపై ఇలాంటి దారుణాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విచారణను వేగవంతంగా పూర్తి చేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. శిరీష కుటుంబ సభ్యులకు మంత్రి సీతక్క తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా నిచ్చారు.

# రాష్ట్రంలో సజావుగా నీట్-పీజీ 2026 పరీక్ష

**14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ**



**హైదరాబాద్, ఆగస్టు 30 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో నీట్--పీజీ 2026 ప్రవేశ పరీక్ష ఆదివారం సజావుగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లో ఏర్పాటు చేసిన 56 పరీక్షా కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. మొత్తం 17,626 మంది అభ్యర్థులు పరీక్షకు నమోదు చేసుకోగా, 17,143 మంది హాజరయ్యారు. మరో 483 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 97.26 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు.పరీక్ష నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగినట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని టీసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రీజనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరీక్షల నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరీక్షా కేంద్రాల్లో పరిస్థితులను పర్యవేక్షించారు.

# ప్రతి కులానికి 'యూనిక్ కోడ్' కేటాయించాల్సిందే

- లేదంటే జనగణనను నిలిపివేయండి
- ఓబీసీ జాతీయ సదస్సులో వక్తల డిమాండ్
- శాస్త్రీయత లేకుంటే రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా
- డిమాండ్లు పట్టించుకోకపోతే దేశవ్యాప్త ఉద్యమం : నేతల హెచ్చరిక




**న్యూఢిల్లీ, ఆగస్టు 30 :** దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో కులగణనను తప్పనిసరి చేయడంతో పాటు ప్రతి కులానికి ప్రత్యేకంగా 'యూనిక్ కోడ్' కేటాయించాలని పలువురు మేధావులు, రాజకీయ నేతలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్త ఏకాభిప్రాయం కుదిరేవరకు జనగణన ప్రక్రియను నిలిపివేయాలని స్పష్టం చేశారు. ఆదివారం, తెలంగాణ భవన్‌లో 'జనగణనలో కులగణన - ప్రతి కులానికి యూనిక్ కోడ్' అనే ప్రధాన డిమాండ్‌తో ఓబీసీ జాతీయ సదస్సు జరిగింది. బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ టి.చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాజ్యసభ ఎంపీ విల్సన్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఏఐసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ అనిల్ జైహింద్, స్వరాజ్ ఇండియా నేత ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ రతన్ లాల్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్ గౌడ్, ఎస్ దుర్గయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ ఇవ్వకుండా కులగణన నిర్వహించడం శాస్త్రీయ పద్ధతి కాదని వక్తలు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల తరహాలోనే ఓబీసీలతో పాటు జనరల్ వర్గాలకు కూడా విడివిడిగా ప్రత్యేక కాలమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. డ్రాప్‌డౌన్ మెనూ ద్వారా ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన ప్రక్రియను ప్రారంభి ంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

**రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా!**

శాస్త్రీయమైన ప్రణాళిక లేకుండా మొక్కుబడిగా జనగణన చేపడితే కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న సుమారు రూ.12, 800 కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని డాక్టర్ సూరజ్ మండల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ఎంపీ విల్సన్ హెచ్చరించారు. ప్రతి కులాన్ని ఖచ్చితంగా నమోదు చేసేలా పారదర్శక, శాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా మొండిగా ముందుకెళ్తే దేశవ్యాప్తంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.



















Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370